
# నందా దీపం

## (అఖండ జ్యోతి)




రచయిత

**తుమ్మపూడి కోటీశ్వరరావు**

**బెంగళూరు**

**సహాయకులు**

డా॥ ఓరుగంటి ప్రసాద్

నందా దీపం

(అఖండ జ్యోతి)

ప్రథమ ముద్రణ 2021

ప్రతులు 500

వెల 100

హక్కులు మరియు ప్రచురణ

షిర్డిసాయి బాబా మందిరము

రోడ్ నెం. 4 లక్ష్మీనగర్

సైదాబాద్

హైదరాబాద్ 500054.

–

సెల్ ః 8019262315

ఫోన్ ః 040–24078393


ప్రింటింగ్ ః శ్రీసాయిరాం ప్రింటర్స్ హైదరాబాద్.

040 23232316.








The view shows the Nanda Deep in an isolated structure *(1975)*.



Nanda Deep in a grilled enclosure *(2011)*. One of the two neem trees has been cut at ground level.

The intricate carvings on the roof of the pavilion can be seen. The eternal lamp burns brightly in every picture. →





Nanda Deep (1970)







# ధుని

ఇప్పుడు - ఈ దీపం వెలగటానికి సంధర్భ మొకటున్నది.

ఒకప్పుడు టి.విలో ఒక చర్చ విన్నా...

బాబా దేవుడు అవుతాడు. సాయిబు. మనలాగానే ఒక మనిషి!!-అని!

ఈ రచయిత 2,3 రోజులు విన్నాక - ఈ రచన చేద్దామన్న సంకల్పం - ఒక ప్రేరణ వల్ల జరిగినది. అదే బాబా ఆజ్ఞగా గ్రహించడం జరిగింది. ఈ పదం మన ఇంట్లోకి వచ్చినది. అంతా బాబా 'వీలసమాథి" లేదా సమాధివల

"రచయిత"

# నందా దీపం
## (అర్థం జ్వలతి జ్యోతిః)
## నాందీ శ్లోకము

**నాంతస్సంజ్ఞః - బహిస్సంజ్ఞః**
**నప్రజ్ఞాన ఘనం - నప్రజం నాప్రకాశం**
**అదృష్టం - అవ్యవహార్యం - అగ్రాహ్యం**
**అలంక్షణం - అబంధ్యం - అధ్వపదేశం**
**ఏకాత్మ ప్రత్యయసారం**
**ప్రరంచోపశమం - శాంతం - శివం - అద్వైతం**
**చతుర్థం మన్యంతే - స ఆత్మా - స నవిజ్ఞేయః**

(మాండూక్యం-7)

నాల్గవది తురీయమైన ఆత్మ, అది తెలుసుకోదగినది అది అంతుర్ముఖముకాదు - బహిర్ముఖము కాదు రెండు కాదు - అది ఘనీభూతప్రజ్ఞ కాదు - ప్రజ్ఞావంతమూ కాదు - కాకా పోనూ లేదు - కన్పించనిదీ - వ్యవహారానికందనిదీ - గ్రహణకందనిదీ - లక్షణవంతం కానిదీ - చింతించరానిదీ - వ్యపదేశించరానిదీ - గ్రహణకందనిదీ - లక్షణవంతం కానిదీ - చింతించరానిదీ - వ్యపదేశించరానిదీ (పేర్కొనరానిదీ) - ఏకమైన ఉనికి కలదన్న ఎరుకయే దీనిసారం - ప్రపంచమునకదే ఉపశమం - (లయం) - శాంతం - మంగళం - అద్వైతమైనది.

# నందా దీపం
## (అఖండ జ్యోతి)

**'Yet can the mind of man recevie-God's light the force of man can be driven by God's force then in he a miracle doing miracles'**

(SAVITRI - Sri Aurobindo Book 6 canto 2)

**(భగవత్ జ్యోతిని మానవమనస్సు స్వీకరిస్తుంది. మనిషిశక్తి ఆ మహాశక్తితో ప్రజ్వరిల్లుతుంది. అప్పుడతనిలో ఆ అద్భుతం అనేక అద్భుతాలు చేయిస్తుంది)**

'మిత్రమా! సాయిబాబా భౌతిక జీవితమే మనకర్థం కావటంలేదు కదా. ఇక ఆయన ఎవరో, ఏమిటో ఆయన అగాథసత్యమేమిటో మనకేం తెలుసు గనుక ఆయన మహమ్మదీయుడా? – అయితే ఆయన చెవులకు పోగులు కుట్టిన ఆనవాళ్ళెందుకున్నాయట! ఆయన హిందువా? అయితే మసీదులో నివాసమేమిటి? 'అల్లా మాలిక్!! – అన్నమాటే మంత్రంగా నిత్యం ఆప్రభువు నాలుకపై నాట్యమాడుతుందేమిటి? పలావు వండి పెడతాడేమిటి? ఆయన లోలోతుల్లో వేదాలు, పురాణాలు, గాత, ఖురాను – వల్లిస్తాడేమో! – భగవంతునికి తెలియాలి. ఆయనకు తెలియనిదేమిటి? అయన నాకు ఖురాన్ నేర్పాడు. అమిరన్న మహమ్మదీయసోదరుడు బాబాలీలలను గానం చేస్తానంటున్నాడు. ఆయనకంత శక్తి ఎక్కడిది? సాయి దర్బారు హిందూసన్యాసి మతం కాదు. తలందారు (ముస్లిం ఫకీరు) దర్బారు.

ఈ మాటలు అబ్దుల్లా అన్న బాబా సేవకుడు వ్రాయించుకొన్న వ్రాతప్రతిలోనివట. ఈ అబ్దుల్ బాబా నందాదీపం ఎలా వెల్గించాడో చెబుతున్నాడు.

'బాబా లెండీబాగ్‌లో ఒక గుంట త్రవ్వి అందులో నందా దీపం పెట్టాడు. దానిపైన ఒక రేకు కప్పి – చుట్టూ గోనె సంచులు వ్రేలాడదీసాడు. నన్ను రోజూ రెండుమారులు నీరు తెచ్చి అక్కడ పెట్టమనేవాడు. ఆనీటిని నాలుగు దిక్కులకూ చల్లుతూ, ఏవో చదువుతూ – 'దీపం గుంట చుట్టూ తిరిగేవాడు' అలా చేస్తూ బాబా అనేవాడు 'అబ్దుల్! ఈ దీపమారిపోనివ్వకు. రోజూ నూనె పోస్తూ వుండు' – అని.

ఆదీపము బహుశః 1899లో నాందేడులో అమీరు అన్న ఫకీరు దగ్గరుండే అబ్దుల్లాను బాబాస్వప్నం ద్వారా పిలిపించుకొన్నందున – అప్పుడో – ఆతర్వాతనో నందా దాపం వెలుగు లోకం మీదకు ప్రసరించటం ప్రారంభించినది. ఈ అబ్దుల్ బాబాను 45ఏళ్ళ పాటు సేవించి 1954-4-2న బాబా తేజస్సులో లీనమైనాడట.

"నానా చందోర్కరు రెవెన్యూ అధికారి. నన్ను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించమని చెప్పటం వల్ల నేను శిరిడి ప్రయాణం కట్టాను. బాంద్రానుండి దాదరుకు

వెళ్ళి, అక్కడ నుండి మన్మాడు రైలెక్కి శిరిడి పోవాలని దాదరుకి టిక్కెట్టు కొని (బాంద్రానుండి) రైలెక్కాను. రైలు బయలుదేరే ముందుగా హడావుడిగా ఒక మహమ్మదీయుడు నా పెట్టెలోనికెక్కి 'ఎక్కడకు పోతున్నా'వన్నాడు. నేను నా ఆలోచన చెప్పాను.

ఆయన – "దాదరులో రైలు దిగవద్దు. మన్మాడు రైలెక్కడ ఆగదు. దాదరు దాటి బోరీ బందరు వెళ్ళు' నేను – నా అదృష్టవశాత్తు, ఆ మరుసటి దినం 1910లో ఒకనాడు ఉదయం 9–10 గంటల ప్రాంతములో శిరిడి చేరగలిగాను. ఆయన చెప్పకపోతే ఆ లీల జరిగేదికాదు.'

(సచ్చరిత్ర – హేమద్పంతు చెప్పిన విషయము)

1896 ఆగష్టులో రమణమహర్షి అప్పటి పేరు వెంకట్రామన్, అరుణాచలము బయలుదేరాడు. తిరువణ్ణామలై పోయే రైలు 12గం॥కు స్టేషన్‌కు రావాలి. ఈయన వెళ్ళేసరికి 12 దాటింది. కానీ రైలు ఆలస్యంగా రావటంవల్ల అందినది. ఆ టికెట్టు ఖరీదు 2రూ॥ల 13అణాలు. ఇంకా ఆయన దగ్గర మూడు అణాలు మాత్రమే వున్నవి. తిరువణ్ణామలై టికెట్టు ఖరీదు 3రూ॥లు. అంతే తెచ్చుకొన్నాడాయన. రైలు సాగిపోతున్నది. తనకెదురుగా ఒక తెల్లనిగడ్డమున్న మౌల్వీ వీరిని ప్రశ్నించాడు.

మౌల్వీ – స్వామీ/ఎందాక ప్రయాణము.

వెంకటరామన్ – తిరువణ్ణామలై

మౌల్వీ – అలాగా, నేనూ అక్కడికే పోతున్నాను.

వెంకటరామన్ – ఏమిటీ! మీరూ అందాక వస్తారా!

మౌల్వీ – కాదు. అది దాటిన తర్వాత వచ్చే తిరుక్కోయిలూరు స్టేషన్‌లో దిగాలి నేను.

వెంకటరామన్ – అయ్యో! అలాగా! ఈరైలు తిరుణ్ణామలై పోతుందా! నాకు తెలియక తిండివనందాకానే టికెట్టు కొన్నానే.

మౌల్వీ – బ్రహ్మణస్వామీ! మీకేమి తెలియదన్నట్టుందే. మనం విల్లుపురంలోదిగి, తిరువణ్ణామలై వేరే రైలెక్కాలి.

(పూజ్యశ్రీ నరసిహాస్వామీజీ ఏ మహాత్ముడు శిరిడి నందా దీపాన్ని అఖిలభారతీయ సాయి సమాజాన్ని స్థాపించి – ప్రతి ఇంట్లో వెలిగించాడో, ఆయనే వ్రాసిన రమణమహర్షి జీవితచరిత్ర – 'ఆత్మానుభవ మన్న' పేరుతో వ్రాసాడో అందులోని మాటలే ఇవి.) దీని తర్వాత రమణుల దివ్యగాథను గానం చేసిన గాయకులు వ్రాసిన మాటలీ క్రిందివి. రమణులే తర్వాత చాలాకాలానికి భక్తులతో అన్నారట– "ఆ మౌల్వీ నాతో తిరుకోయిలూరు దాకా వస్తానని చెప్పాడు. కానీ మధ్యలోనే ఎక్కడో అదృశ్యమైపోయినాడు" అని.

**3**

1910 ఫిబ్రవరి నెల. ఒకనాడు కర్మ యోగి పత్రికాలయానికి వచ్చి శ్రీ అరవిందులతో రామచంద్రమజుందారన్న ఆయన స్నేహితుడు అన్నాడు–

'నిన్ను ప్రభుత్వం బంధించబోతున్నది" – అని ఇంతలో సోదరి నివేదిత వచ్చి "అదేమిటని – మీకు ద్వీపాంతర శిక్ష విధించబోతున్నది కనుక ఫ్రెంచి ప్రభుత్వాదీనములో నున్న ప్రదేశాలకు వెళ్ళమని"ఉద్బోధించినది. ఆమెకా పత్రికాధిపత్యాన్ని అప్పగించి తాను చంద్రనాగూరు వెళ్ళి, అక్కడొక నెల రహస్యంగా గడిపినట్లు (అది ఫ్రెంచివారిదట) అక్కడ నుండి పాండిచ్చేరి 1910 – ఏప్రిల్ 4న వచ్చినట్లు – ఇదంతా నా అంతస్సహచరుని ప్రభోధం (శ్రీకృష్ణుడు) వల్లనే జరిగినట్లు. – శ్రీఅరవిందులే చెప్పారట.

చంద్రనాగూరులో మోతీలాలన్న స్నేహితుల యింట్లో రహస్యంగా గడిపారట వారు. ఆ మోతీలాలు – 'జీవన సహచరుడు' అన్న గ్రంథం వ్రాసారట శ్రీఅరవిందుల పైన . అందులో ఆయన వ్రాసారట – 'శ్రీఅరవిందులు సంపూర్ణంగా యోగాభ్యాసములో నిమగ్నులయ్యేవారు. ఆయన కళ్ళు తెరిచే ధ్యానము చేసేవారు. అనేత్రాలలో దివ్యమూర్తులు సర్తించేవి. అప్పటికీ వేదదేవతామూర్తులు ఇలా భారతీ – సర్వస్వతులు వారికి సాక్షాత్కరించారని.

## 4
## అరుళ్ పెరుంజ్యోతి

వడలూరులో రామలింగస్వామి అన్న మహాయోగి – శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చి – తాను చేసిన మృత్యంజయ యోగాన్ని పూర్తి చేస్తారని శిష్యులతో చెప్పి, ఒకరోజు రాత్రి – గదిలో తలుపులు మూసుకొని, నిద్రించటానికి వెళ్ళారట. తెల్లవారి తలుపులు తెరిచి చూసేసరికి ఒక గుప్పెడు బూడిదకుప్ప కనిపించినది. ఆ మహాయోగికి శివుడు సాక్షాత్కరించి ఒక మంత్రము చెప్పాడట. ఆ మంత్రము

'అరుళ్ పెరుంజ్యోతి – అరుళ్ పెరుంజ్యోతి
పెరుం కరుణై అరుళ్ పెరుంజ్యోతి'

అది అర్థమైన బృహత్ జ్యోతి.
అర్థమైన బృహత్ జ్యోతి
పరమకరుణామయమైనది
ఆ బృహత్ జ్యోతి.

ఈ జ్యోతి చిహ్నంగా ఆస్వామి వడలూరులో – ఒక బృహద్దేవాలయం కట్టించి ఆ దీపాన్ని ప్రతిష్ఠించాడు. అది నేటికీ జ్వలిస్తూనే వుంది. ఆ దేవాలయములో కేవలం జ్యోతి మాత్రమే వుంటుంది. ఆ గుడి పేరు 'సత్యజ్ఞానసభ'. 1872లో నిర్మించి, అందులో రామలింగస్వామి చేతితో వెలిగించిన దీపప్రతిష్ఠ చేశారు. ఆ దీప జ్యోతి ఏడు తెరల లోపల వుంటుంది. ఆ ఏడు తెరలు అవిద్యాదశలకు సంకేతాలు.

(దీనికి చూ. అరుళ్ పెరుంజ్యోతి – మృత్యురహిత శరీరం తులసీరాం రచన – మద్రాసు విశ్వవిధ్యాలయం ప్రచురణ)

స్వామి శరీరంతో వున్న కాలం 1823 – 1874.

ఈ కొద్ది జీవితకాలం సాయిబాబాలాగా చాలా అద్భుతాలు చేసారట.

నీళ్ళతో పదిచోట్ల ప్రత్యక్షం కావటంలాంటివి.

ఇక్కడొక ప్రశ్న వేసుకోవచ్చు –

(హేమాద్పంతు) – సచ్చరిత్రకారునకు – శ్రీరమణలకు మహమ్మదీయుడే దారి చూపించినట్లు తెలిసింది కదా, అలాకాక ఒక హిందు సన్యాసిగానో, సాధువుగానో కన్పించవచ్చునే. ఎందుకంటే – రమణులే అన్నారు నాతో తిరుకోయిలూరు దాకా నస్తానన్న పెద్దమనిషి కన్పించకుండా పోయినాడు – అని. ఇక 'ఈయన ప్రస్తావన ఇతరులెవ్వరూ చెప్పనందున రహస్యంగానే వుండిపోయినది.

## శ్రీరామకృష్ణ పరమహంస

వీరు చేసిన సాధనలు అనంతం. సర్వమాతాల దృష్ట్యా హిందు, బౌద్ధ,/ సాధనలు క్రైస్తవ, మహమ్మదీయుల, సాధువులన్నీ చేసి సర్వమతాలు చెప్పిన లక్ష్యమొక్కటేనన్నారు. ఒకరు 'పానీ' అని, మరొకరు 'వాటర్' అనీ, మనం 'జలమనీ' – అన్నా ఒకే వస్తువును గురించి కదా. అలాగే అల్లా, జీసస్, బుద్ధుడు, శక్తి, విష్ణువు, శివుడు అని అనేదొక్క పరమాత్మను గురించి మాత్రమేననేవారట. అది విని బ్రహ్మసమాజ నాయకుడు కేశవచంద్రసేన్ – పరమహంస చేసిన సిద్ధాంతముపైన ఒక క్రొత్త మతశాఖను స్థాపించాడు.

దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక చిత్రకారుడు సర్వమతసామరస్యము – అన్న బొమ్మను గీసినాడు. దీనిని గీయించినది రామచంద్ర దత్త, మనోమోహన్ మిత్ర అన్న గురుదేవుల శిష్యులు. ఆ బొమ్మలో ఒక ప్రక్క చర్చి, మరొక ప్రక్క హిందూ దేవాలయము – నదులు మసీదులుంటాయి. ముందు వైపున వివిధ మతస్థులుంటారు. వారిని చూపిస్తూ కేశవ చంద్రసేన్ కు గురువులు వివరిస్తుంన్నట్లుంది చిత్రం.

ఆ వివరణ వాక్యమేమంటే–

'ఇదే భవిష్యత్తు లోకానికాదర్శం'– అని. ఈ బొమ్మ 10.12.81 – 27.10.82 నడుమ గీయబడినది.

ఈ మతసామరస్య వాదదారంగానే స్వామీజీ విశ్వమంతా ఒకే కుటుంబము, ఒక మతము కావాలన్న 'విశ్వగీత'ను ఉద్యమంగా తెచ్చారు. దీని వాఖ్యానం 'రోమేరోలా'– అన్న ఫ్రెంచి కవీశ్వరుడు వ్రాసిన స్వామీజీ జీవిత చరిత్రలో – ('విశ్వగీత' –. The universal Gospel)

The city of mankind- మానవతా మహానగరమన్న అధ్యాయాలుగా వ్రాసాడు.

ఇదంతా ఆధునికయుగము తెచ్చిన సర్వమానవ – మత సమన్వయవాదము. దీనినే ఆర్థర్ ఓస్‌బోర్న్ కూడా చెప్పినట్లు ముందు ముందు చదువబోవుతున్నారు.

దీనికి సూచన – ప్రతీర – వేగుచుక్క – ఆ మౌల్వీ – ఆ సాహెబు/ శ్రీ రమణుల, రామకృష్ణ, శిరిడిబాబా, వివేకానంద జీవితాల్లో ఈ సమన్వయం కనిపిస్తుంది.

మార్గదర్శనం చేయించిన సాహెబు – మౌల్వీలు ఆ దీపం 'ఆత్మదీపోభవ' – అని బుద్ధదేవుడన్న 'ఆత్మదీపము'/ దానిని శివుడునూ, విష్ణువనూ, శక్తి అనూ మరొకటిగా పిలుచుకో నీయిష్టం. ఆజ్యోతి – బాబా, రమణులు, రామకృష్ణులు, శ్రీఅరవిందులూ, వివేకానందులు – అర్థం జ్వలతి జ్యోతిః – అరుళ్ పెరుంజ్యోతి – అదే.

ఈ నందా దాపమే అరుణాచలజ్యోతి. కలకత్తా మహాకాళి – మనకు మార్గదర్శనం చేయిస్తుంది. తత్ప్రతిమలు, ప్రతిబింబాలైన శిరిడిబాబావంటి గురువులే ఆనందాదీపాలు.

స్వామీజీ విదేశాల నుండి తిరిగి వచ్చినాక కలకత్తాలో ఒక

శిష్యుడినడిగాడట. నీవు కఠోపనిషత్తు చదివినావా! అని. లేదన్నాడాయన. మరల స్వామీజీ అన్నారట. చదువు చాలా అందమైన ఉపనిషత్తు అని. అందులో మహామంత్రమే ఆయన విశ్వవ్యాప్తం చేసినది.

'ఉపనిష్ఠః జాగ్రతః ప్రాప్య వరాన్ని బోధత'

ఇదే తీసుకున్నారు వారి ప్రబోదానికాదారంగా–

'లేచినిలబడు. నిద్రమేలుకో. మహాత్ములనాశ్రయించి మార్గము తెలుసుకో'

'క్షురస్య పంథా దురత్యయాః దుర్గంపథః వదంతి'–

(కఠం--------)

"దారి కత్తివాదరవలె నిశితంగా అగమ్యంగా వుంటుంది" అని ఋషులు చెబుతున్నారు. బాబా ఇదే అన్నది 'శిరిడి నుండి కూడా ఒక మార్గమున్నది కానీ దాటడం కష్టం' అని. విన్న శిష్యుడు దీక్షిత్– అన్నాడట.

"మార్గదర్శి వుంటేనో?" – అని. "అప్పుడు సులభమేనని ఆ ఋషి అన్నాడు.

ఇదే మంత్రంలోని భావం.

బాబా అన్నాడు కదా 'నేనేదో ఇక్కడ అంటాను. పనులక్కడ జరుగుతాయి. ఈ మాటకర్థమేమంటే అది 'ఋషి వాక్కు – అదే మంత్రము.

ఇదే శాశ్వతజ్యోతి

నందాదీపం

❋ ❋ ❋

# నందా దీపం (బి.వి)

## పూజ్యశ్రీ బి.వి నరసింహస్వామీజీ

ప్రబోధం:

"అంతర్జ్యోతి నన్వేషించు."

వీరు 1929లో తిరువణ్ణామలై వెళ్ళి రమణుల దగ్గరుండి వారి జీవితచరిత్ర వ్రాసారు. వీరే తరువాత 'శిరిడి' వెళ్ళారు. వారికి భక్తియోగం ఇష్టం కనుక – నిత్యం భజన కూటములకు వెళ్ళే వారని అందకే బాబా భక్తులైనారని అంటారు. న్యాయానికి తిరువణ్ణామలై దగ్గరలో ఉన్న 'పాండిచ్చేరి' పోవచ్చు. రమణ భక్తులు కపాలి శాస్త్రి వంటి వారిలాగా – పైగా నరసింహస్వామి నిశిత ప్రజ్ఞాశాలి అని రమణులంత వారన్నారట ఐనపుడు దానికి తగిన స్థానం శ్రీఅరవిందాశ్రమం కదా – ఎందుకు వెళ్ళలేదో? నరసింహ స్వామీజీ అన్నారని వినిచిడి 'నాకెందుకే శిరిడి పోదామనిపించినదని' – ఇది దేవరహస్యంగా వుండిపోయినది.

ఆత్మజ్యోతియే మార్గదర్శకం. అశుభ్రమార్గమంతా శరత్‌జ్యోత్స్న. ఆవెన్నెల దారిలో ఆత్మనన్వేషించు. అదే ధ్యేయము. అదే మార్గము. అదే నీకు సైదోడు. నిత్యసహాచరుడతడే – సహపాంథుడు.

లౌకికమైన అహంభావము – దానికి నీడ. అదే నీకు చీకటిని కల్పించి అశుభ్రమార్గములో నడిపిస్తుంది. అంతర్జ్యోతి కేవల సచ్చిదానందమయం. సర్వే సర్వత్రా వ్యాపించి అంతర్లీనంగా వున్నదదే.

సత్యాన్వేషకునకా జ్యోతిస్సులకు జ్యోతిస్సే గమ్యం. దానిని దర్శించిన వానికంతా జ్యోతిర్మయమే. అందరూ సమానమే, అంతా సమతా భావమే.

అదే నీలోని సత్యజ్యోతి. దానిని నీవెలా పిలిచినా సరే. భగవంతుడు – ఆత్మ – పరమాత్మ. ఏదైనా ఒకటే. ఆ సచ్చిదానందాత్మక జ్యోతిని నీలోనే వెదుకు. అది నీలోనే వున్నది. దివ్యమైన సరంజ్యోతి – నిత్యమై అందరిలోనూ ప్రజ్వలిస్తూన్నది. అందరూ ఆ కిరణపుంజములోని వెలుగులే.

నేను దృఢంగా చెబుతున్నాను – ఆశుభ్రమార్గము – దివ్యతేజోమయం.

నీవు వెతుకనక్కరలేదు. ప్రార్థించు చాలు. మార్గమదే విప్పుకొంటుంది.

నా గురువు బాబా నడిచిన వెంటనే నాకది తెలిసింది.

నా ఎరుకలోనికదే ప్రవేశించినది.

మొదటిగా – తెలుసుకోవలసిందేమిటంటే – సాయిబాబాకు రూపమూ వున్నది. రూపంలేని స్థితి వున్నది. అది సగుణ, నిర్గుణ స్వరూపము. నీముందుంచిన గిన్నెలో అమృతక్షీరమాస్వాదించు. ఆ గిన్నె ఏ లోహముతో తయారైనదీ నీకనవసరం కదా. ప్రయాణించగలవు. అదే తీసుకోనిపోతుంది. ఆశుభ్రమార్గాలలో నీవడుగు పెట్టు చాలు. సంశయము త్యజించు. హృదయపూర్వకముగా ప్రార్థించు. ఆర్ద్రభావముతో అడుగు. ఆ వెలుగు నీలో జన్మలనుండి పేరుకున్న అజ్ఞాన మాలిన్యాన్ని క్షాళించి – నీలోనికి ప్రవేశిస్తుంది.

ఆయన వాక్యం స్మరించు. 'ఊగే – మూగే' నిశ్చింతగా కూర్చో. 'సబూరి' ఓర్పవసరము. చివరకు గమ్యం చేరగలవు. ఆయన ధ్యానాన్ని పాదం నుండి ప్రారంభించు. అది నీలో స్థిరమైనాక పైకి ప్రయాణించు. ప్రత్యంగభావన చేయి. నఖశిఖపర్యంతంగా ఆయన నీలో ప్రతిష్ఠితుడౌతాడు.

పాదం నుండి శిరస్సుదాకా, శిరస్సు నుండి పాదందాకా నీ ధ్యాన నేత్రము ప్రసరించాలి. క్రిందా – పైనా అంతా నీలోనికి రావాలి. పాదాలపై కేంద్రీకరించు. నిత్యం నీవక్కడే వుండాలి. అవుడానందం నీతో దీపమై వెలుగుతుంది.

సాయి ప(పా)దం, "తత్‌ధామ పరమంపదం". త్రిమూర్తులకు బాబాకు భేదములేదు. ఆమూర్తి త్రయ సమ్మేళనం నీవు గుర్తించగలవు, ఆయన శుద్ధ బ్రహ్మస్వరూపుడు గుర్తించుకో. ప్రతి జీవి హృదయరంగం మీద నర్తించే నిత్యానంద నటరాజాయన. అంతటా సర్వతంత్ర స్వతంత్రంగా నర్తిస్తున్నాడు. మహాయోగులు. మహాత్ములు దానిననుభవించగలరు. ఆ నాట్యాన్ని చూస్తూ చొక్కిపోగలవు. ఆయన నీచిదాకాశములోనే వున్నాడు. తన అర్ధదృష్టి జోత్స్నునందరిపైనా సమానంగా ప్రసరిస్తున్నాడు. ఆస్వామి పాదాల నాశ్రయించు.

భక్తితో – ప్రత్యక్షంగా ఆయన దగ్గరకు వెళ్ళు. ఆయన ఊపిరిగా,

ఆయనలోనే బ్రతుకు. అదే నీకు విశ్రాంతి స్థానంగా, నీవు సిద్ధమైనా? ఐతే ప్రస్థానానికాలస్యం దేనికి? – ఉత్తిష్ఠ, బయలుదేరు. ఇప్పుడే. ఈ క్షణమే.

వెళ్ళు. వెళ్ళు నీ హృదయంలోనున్న ఆయనతో జీవించు. అతడు నీతల్లి, నీ ఆకలి తెలిసి నీ కడుపు నింపుతుంది. నిత్యమూ దయగల తల్లిలాగా నీ ఆకలి ఏడ్పులామెకు విన్పిస్తూనే వుంటాయి.

నీ హృదయార్తిని ఆకలిని తీరుస్తుంది. కానీ ఒకటి మాత్రము గుర్తుంచుకో – ఉన్నతమైన ఆశయాలు ఫలించాలంటే నీవు సర్వాత్మనా – పరిశుద్ధంగా – పవిత్రంగా వుండాలి సుమా!

బాబా వెల్గించిన ఈ నందాదీపాన్ని స్వీకరించి అది వెదజల్లే ఆర్ధ్ర కాంతిని లోకం దారుల్లోకి తీసుకొనిపో. జీవితాంతము ఆ దీపవాహకునిగా మసులుకో. ఇదే నీవు చేయవలసిన గురుసేవ. ఊరికే పుస్తకాలు చదవటం – సుఖభోగాలతో జీవించటమూ దేనికి? దానివల్ల ప్రయోజనమేమిటి? బాబా కరుణా దృష్ఠి నిత్య మునీపై ప్రసరించాలి. ఆయన నిత్యసూర్యుడు. సంతోషంగా వుండు ధైర్యంగా జీవించు. అంతా బాబాయే చూచుకుంటాడు. భయందేనికి? ధైర్యంగా ఆధ్యాత్మిక మహాప్రస్థానం ప్రారంభించు – నేను – నీతోనే నడుస్తాను. తోడునీడగా.

నా విషయంచూడు. ఆయన నన్నాదేశించటానికి ముందే నేనన్నీ ఆయనకే సమర్పించాను.

ఇది బాబా నందాదీపాన్ని ఆసేతుశీతాచలం ప్రతి ఇంట్లో, వాకిట్లో – అదీ ఏ ప్రతిబింబాలను, ప్రమిదలను వెల్గించి లోకాన్ని దీపావళి పర్వదినంగా పరిణమింపచేసినదో ఆ దీప ప్రథమవాహకుడు శ్రీ నరసింహస్వామీజీ లోకానికి చేసిన ప్రభోధ సారాంశం.

ఈ నరసింహస్వామీజీ శిష్యుడు శ్రీసాయి పాదానంద గురువుల పైన ఒకచిన్న జీవితచరిత్ర వ్రాశారు. దాని సారాంశము– శ్రీనరసింహ ఆయ్యరు (అని పూర్వాశ్రమం పేరు) – సేల్ దగ్గర భవానీపురం (కోయంబత్తూరు జిల్లా)లో 1874 ఆగస్టు 21న తల్లి అంగచ్చ అమ్మాళ్ – తండ్రి శ్రీ వెంకటగిరి అయ్యరులకు

జన్మించారు. తల్లిగారు షోలింగపురం నరసింహస్వామికి మ్రొక్కుకోగా జన్మించినందున కొడుకుకాపేరు పెట్టుకొన్నారు. తండ్రి ప్లీడరీ వృత్తి కోసం దగ్గరిలోని సేలం పట్టణానికి నివాసం మార్చుకొన్నారు.– అక్కడ పెద్ద డాబా కట్టుకొని ధనార్జనం చేసారు. వారిల్లు పదిమందికాశ్రయంగా ఉండేది.

నరసింహ అయ్యరు మద్రాసు క్రైస్తవ కళాశాలలో బి.ఎ, న్యాయకళాశాలలో బి.ఎల్ చదివి, 1895లో న్యాయవాదుల బారులో సభ్యుడై – ఆ వృత్తిలో గొప్పపేరు – ధనం సంపాదించారు. అందరకు ఆదరణపాత్రుడై సేవకుడై – దేవాలయ జీర్ణోపద్ధారకుడై – మున్సిపల్ ఛైర్మన్ – కోపరేటివ్ సహకార బ్యాంకు అధ్యక్షుడై వైభవోపేత జీవనం చేస్తుండగా – దైవవశాత్తు తన ఇద్దరు పిల్లలు – ఒక కూతురు, ఒక కొడుకు ఇంటి పెరట్లో నూతిలో పడి మరణించటము – తను విరక్తచితుడై గురు – దైవ కృపాసకుడై అనేక సాధువులను, మహాత్ములను కలిసేవాడు. ఈ లోపల రాజకీయజీవితంలో భాగంగా, మద్రాసు శాసనసభా సభ్యుడుగా 1914 – 20 నడుమ ప్రజాసేవ చేశారు. రాజకీయాలలో వారు బాలగంగాధరతిలక్ భక్తులు. అనిబిసెంట్ హోమ్‌రూలు సంఘసభ్యుడై 1917లో భారతదేశానికి స్వపరిపాలన ఇమ్మని కోరటానికి ఇంగ్లాండు వెళ్ళిన సంఘంలో సభ్యుడై – వెళు ్తంటే ప్రభుత్వం వారిని జిబ్రాల్టరు దగ్గర నిరోధించినది. వారా ప్రయత్నము విరమించుకొన్నారు.

థియోసఫీ సభ్యుడుగా వున్న రోజుల్లో – ఆ సంఘాధ్యక్షుడైన డా॥ జి.ఎస్. అరుండేల్ చెప్పిన అంశమొకటున్నది. అదేమంటే నరసింహ అయ్యరు – అమెరికా అధ్యక్షుడు – వుడ్రో విల్సన్‌కు ఒక లేఖ వ్రాసి అందులో ఆయనను బ్రిటన్ ప్రధానమంత్రి లాయడ్ జార్జిని – ఇండియాకు స్వపరిపాలన ప్రత్పత్తిని కల్గించటానికి చెప్పాలని సూచించాడట.

1921 దాకా సాగిన ఈ భౌతిక వ్యాపారాదులన్నీ పైన చెప్పిన గృహక్షోభ వల్ల – ఆధ్యాత్మికరంగ ప్రవేశద్వారం కాగా 1929లో తిరువణ్ణామలైలోని శ్రీభగవాన్ రమణమహర్షిని దర్శించి అక్కడ మూడేళ్ళుపాటుండి – రమణుల జీవితచరిత్ర

ఆత్మసాక్షాత్కారమన్న పేరును వ్రాసి వారిని గురించి ప్రపంచానికి తెలియచేసారు. అది చదివే పాల్ బ్రంటన్ వంటివారు భక్తితో భగవాన్‌ని దర్శించారట. అలాగే ఓస్ బోర్న్ వంటివారు కూడా.

ఇప్పటికీ రమణాశ్రమంలో పాలి తీర్థం దగ్గర ఆశ్రమం వెనుకభాగాన నరసింహస్వామీజీ సాధన చేసిన కుటీరం, గుహా ఉన్నాయి. వారేకాంతవాసం చేస్తూ, సాధన చేసి, తర్వాతి వారికి మార్గదర్శకులైనారని – అదే కుటీరంలో తర్వాత పాల్ బ్రంటన్ ఉన్నాడని అంటున్నారు. ఆ ప్రాంతాన్ని స్వామీజీయే ఒక కాలనీగా తయారుచేసారట – దాని పేరు 'పల్లాకొత్తు'.

"ఆత్మసాక్షాత్కార'మన్న ఆగ్రంథం క్ష రమణులపై వచిచ్చ ప్రథమగ్రంథము. అది వాల్మీకి రామకథ వ్రాసినట్లు – ఒక మహాకావ్యంగా మలిచాడాయన. ఆయన బహుభాషాకోవిదుడన్న సంగతి, బహుగ్రంథావలోకనమున్న సహృదయ పండితుడన్నది ఆకావ్యం చదివిన వారికి తెలుస్తుంది. దాని ప్రారంభమే లోకోత్తరంగా రమణీయంగా ఉంటుంది. అరుణాచల ప్రకృతి దృశ్యాలు – క్రింద పవిత్రాశ్రమం – వెనుక భాగాన చెరువు – కొబ్బరి చెట్ల తోపులు – వీటి వర్ణన ఒక కావ్య ప్రకృతి వర్ణనలు జ్ఞప్తికి తెస్తాయి.

తెనాలి రామకృష్ణుడు – తన పాండురంగమహాత్మ్య కావ్యంలో వింధ్యపర్వత వర్ణన చేసినట్లుంది, ఆ ప్రారంభం అంత రమణీయంగా వ్రాసారు కనుకనే అవి అచ్చయిన కొలది. కాలంలోనే పాశ్చాత్య దేశాలనుండి పండితులైన భక్తులు పాల్ బ్రంటన్ లాంటివారు – రమణాశ్రమ దర్శనం చేసారట. అంతగా రచనలో ద్రవించిపోయినాడాయన. అప్పుడే రమణులతో పాటుగా వున్న మరొక మహాత్ముడు శేషాద్రి స్వామి జీవితాంశాలను క్రోడీకరించి ఆయన జీవితచరిత్రను తయారుచేసి వారి శిష్యులకిచ్చారట. – అర్కోణ ప్రాంతంలో ప్రసిద్ధుడైన సొరకాయస్వామి వారి జీవితచరిత్ర వ్రాసారట. 1930 తర్వాత రమణాశ్రమం వదిలి పెట్టారు. ఎందుకు? అంతటి మహర్షిని వదిలి వేరే గురువు కోసమన్వేషించటం దేనికి? కావ్యకంఠ గణపతిముని కూడా, ఎవరు – వెంకటరమణుని రమణమహర్షి – అని ప్రసిద్ధి

కల్పించి – ఆయన మార్గాన్ని – ఆత్మన్వేషణను, లోకానికి తెలియపరిచారో, ఆయన కూడా రమణుని వదలి, దేశదేశాలు సంచరిస్తూ అనేక క్షేత్రాల్లో ఉపాసన – మంత్రజపాదులను తపస్సుగా చేసి చివరికెక్కడో ఉత్తరదేశంలో శరీరత్యాగం చేసారు – ఎందుకిదంతా? ఎవరికి తెలుసు. ఆ శిరిడి శివునకు – అరుణాచలేశ్వరునకూ తప్ప.

1931 తర్వాత అనేక సాధువులను కలిసారు స్వామీజీ. 1937లో రమణాశ్రమంలో వారి భక్తుడు మరొకరు దాతార అన్నాయన వ్రాసాడు – 'నేను స్వామీజీ కలిసి ఆశ్రమంలో ఉన్నాము. ఒకరోజున అడిగాను – రమణులను వదిలి మరొకరను వెదకటం దేనికి? అది గురుద్రోహం కాదా!" అని అంటే ఆయన అన్నారు "కాదు. ఎందరో మహాత్ములుంటారు. కానీ ఎవరి గురువు వారికి తటస్థపడేటంతవరకు అన్వేషణ తప్పదు. అది మరొకరిని తిరస్కరించటం కాదు" – అని. మరొకరు "స్వామీజీ భక్తుడు వ్రాసాడు – ఆచార్య కె.కె.ఆర్ శాస్త్రిగారు "స్వామీజీయే నాతో చెప్పారు.

"రమణమహర్షి తనంత తానుండగా తనను పండరీపురం – పొమ్మని అదే సాకోరీ – శిరిడి దారి తీసినద"ని.

ఏమైనా ఆశ్వరాదేశంగా సాయిప్రభు జీవితచరిత్రకు భారతం వ్రాసిన వ్యాసునిగా – కర్తగా ఆయన నియమించుకొన్నాడనటం మనకు తెలిసిన విషయం ఆయన ద్వారా దేశవిదేశాలకూ – సాయినాథుని జీవితచరిత్ర వ్యాపించినదంటే – ఎవరు దీనికి నిర్దేశకుడు? ఈ ప్రణాళికానిర్మాత విశ్వ నిర్మాత తప్ప.

తర్వాత స్వామీజీ మహారాష్ట్రలోని నాసిక్ – వెళ్ళగా అక్కడ మెహర్బాబా కన్పించి, తమ గురువులైన శ్రీఉపాసనీ మహారాజును, – సాకోరీ – వెళ్ళి దర్శించుకొమ్మన్నారట. అప్పటికీ అపాసనీ – మహాత్మునిగా, యోగిగా చాలా ప్రసిద్ధుడైనాడు.

1927లో మహాత్మాగాంధీ – వారిని (ఉపాసనబాబా) దర్శించి తన స్వాతంత్రోద్యమాన్ని దీవించమని అభ్యర్థించారు. ఆ ఉపాసనీ మహారాజును గురించి

మెహర్బాబా ఒకసారి అన్నారు. 'నా గురువుతో నేను సాకోరీతో చాలాకాలమున్నాను. ఆయనెంత మహాత్ముడంటే ఆయన కరుణాకటాక్షలేశం సోకితే చాలు – మట్టికణం ముక్తి పొందుతుంది – అని. వారిని స్వామీజీ 1933లో దర్శించారు. వారు తనకు సన్యాసజీవితాన్ని గడపమనీ, భక్తిమార్గాన ప్రయాణించమనీ, వేదాంత తర్కచర్చలు పెట్టుకోవద్దని భోదించారట. వారి దగ్గర కొన్నాళ్ళుండి వారి బోధలు తనకు కొన్ని సరిపడని కారణంగా మరలా మద్రాసు వచ్చి, పిదప అనేక మఠాలు చూచి – చివరకు హుబ్లీలో ఒక సాధువుతో కలిసి, పండరివెళ్ళి, అక్కడి నుండి పూనా దగ్గర భీడ్గావ్‌పేట్–లో నారాయణ మహారాజును దర్శించారట. వారు దత్తాత్రేయానుగ్రహ సంపన్నులు. వీరిని గురించి మెహర్బాబా చెప్పారు. "నాకున్న పంచగురువులలో వారొకరని". వారి దగ్గరినుండి తన ఆధ్యాత్మిక ప్రస్థానోపదేశం పొందారట. ఈలోగా అపాసనీ అన్నారట – ఈ మద్రాసు స్వామి వెళ్ళిపోయాడు కదా – మరలా అతనిని వెనక్కులాగుతాననారట. అలాగే మరలా సాకోరీ వెళ్ళాడు స్వామీజీ. 'ఈయనే ఇంత మహాయోగి అయితే ఆయన గురువెంత మహాత్ముడోనని అనుకున్నారట. అలా భావించి అపుడే ఉపాసనీ బాబా జీవిత చరిత్ర వ్రాసారు స్వామీజీ. ఈ ఉపాసనీయే తనకు సాయి అన్వేషణకు పరోక్షంగా దారి తీసారు – అదే అఖిలభారతసాయి సమాజ స్థాపనకు నాందిగా చెప్పారువారు. ఈ అన్వేషణలో వుండగా పూనా నుండి ఒక సాయి భక్తుడు తనను రమ్మని మద్రాసుకు వ్రాస్తే – వారు పూనా వెళ్ళారట. అది 1936వ సంవంత్సరము. అక్కడ జడ్జిగారు నారాయణ పురుషోత్తమ అవస్థి తమ తండ్రి సాయి భక్తులనీ – వారిని పరిచయం చేసారట. ఈ అవస్థియే ఒకసారి శిరిడీ వెళ్ళారట – తమ కుమారుని వివాహం నిశ్చయించి – ఆశార్వాదము కోసం బాబా తమ దగ్గరున్న 600/700 రూ॥లు దక్షిణ పుచ్చుకొని నిర్ధనుని చేస్తే – ఆయన అవస్థ చూచి జోగ్ అన్న భక్తుడన్నాడట– 'నీవు చాలా అదృష్టవంతుడవు. బాబా తీసుకొన్నాడంటే దానికెన్నో రెట్లుగా నీ జీతం పెరుగుతుంది. ఇప్పుడు నీకెంత కావాలి అని అడిగి, 300రూ॥లు అని తెలుసుకొని ఇచ్చాడట. ఆయన 60–71 మంది సాయిభక్తులను స్వామీజీకి పరిచయం చేస్తే అక్కడి నుండి

సాయి తనలోనికి రావటం ప్రారంభించారట. నరసింహస్వామీజీ ఆ అనుభవాన్ని ఇలా చెప్పారు. 'ఆయన సాక్షాత్తు త్రిమూర్త్యాత్మకుడు' – అని అంటే బాబా ఆయనలోనికి వచ్చాడన్న మాట. ఇందుకే వారన్నారు "నన్ను బాబా ఆదేశించాడు. నీవు సాయి పథంలో నడువు. నీకు నేను తోడుంటాన"ని 1936 నుండి అనంతమైన స్వామీజీ కృషి ఫలితం చూస్తున్నాము. ఆసేతు శీతాచలం వారు సంచరించి బాబాతత్త్వ ప్రచారం చేసినట్లు. వారి రచనలూ – వారిని చూచి – వారితో ప్రసంగించిన భక్తులూ – స్నేహితులూ కన్యాకుమారినుండి కరాచీదాకా కన్పిస్తారు. వారి లేఖలున్నాయి.

1918లో సాయి మహాపరినిర్యాణం చెందేనాటికి చాలా కొద్ది మందికి మాత్రమే బాబా అంటే అర్థమైనది అని వారే తమ బాబా చరిత్ర 1వ సంపుటములో వ్రాసారు.

1936లో వారు శిరిడీ వెళ్ళి ద్వారకామాయిని దర్శిస్తే బాబా వాడలో 4,5 మంది వ్యక్తులు మాత్రమే కన్పించారట. వారే మరలా 1940లో వెళ్తే కిటకిటలాడుతున్నదట.

ఇవాళ శిరిడిలో ఇసుకవేస్తే రాలనంత భక్తుసందోహము తిరుమలక్షేత్రం లాగా భూలోక వైకుంఠంలాగా అయినదంటే ఒక స్వామీజీ భక్తులన్నట్లు –

శ్రీరమణమహర్షి – బాబా – నివాసస్థలాలు – భక్తజనాకర్షణం ఇంత చేస్తున్నాయంటే దానికి కారణం శ్రీనరసింహస్వామీజీ కృషి – నిస్వార్థమైన భక్తి – స్నిగ్ధమైన గురుసేనా ప్రకృతియే కారణం – పరోక్షంగానైనా.

వాల్మికి లేనిదే రామాయణం లేదు. వ్యాసమహర్షి లేనిదే భారతాదులు లేవు. నేపథ్యంగా – తెరలో మహాశక్తి వుంటూ దీనినంతా నడిపించినందనటం – సత్యమేకానీ – ఇదెంత సత్యమో వ్యాస, వాల్మీకీ – నరసింహాస్వామీజీలు మనకు చేసిన మేలూ అంతా సత్యమే.

శ్రీ భగవాన్ రమణుల ఆశ్రమంలో వారి భక్తుడు దాతార్ – అన్నాయన స్వామీజీతో మాట్లాడిన విషయం పూర్వమే ప్రస్తావితమైనది. అన్న మాటలతోనే

దీనిని ముగించవచ్చు.

'నాలో ఆయన 1936లో బాబా భక్తి జ్వాల రగిలించాడు. నమ్మండి. నిజం. వెంటనే కొద్దిరోజుల్లోనే నాలోకి బాబా అనుప్రవేశించాడు. ఆయన ప్రభావాన్ని అనుభవించాను. అంత మాత్రాన రమణుల కృపా ప్రభావం తరిగిపోయినదని కాదు. ఒక బంగారు నాణెనికిద్దరూ బొమ్మ-బొరుసు వంటి వారనిపించింది'.

సాయి సమాజానికి నమస్కారము. స్వామీజీ ప్రయత్నం 20 ఏళ్ళలో ఎంత పుష్పించినదో, ఫలించినదో చెప్పలేము. సాయినాథుడెంత దయమయుడో, కానీ స్వామీజీని మన నడుమ ప్రవేశపెట్టి - భారతదేశం - సాయిభక్తి దీప కాంతులతో వెలిగిపోయేటట్లు చేసినాడు. ఆయనకు నమస్కారాలు.

❀ ❀ ❀

# ఏకః - అవర్ణః 1

'మీ మాటలు మంత్రంబులు
మీ మెట్టిన యెడ ప్రయాగ మీ పాదపవి
త్రామల తోయముల లఘ
ద్యోమార్గ ఝురాంబు పౌనరుక్త్యము లుర్విన్'
(మను చరిత్ర)

పరమాత్మను గురించి చెబుతూ వేదమన్నది. అది ఏకము. ఒకటే దానికి రంగు లేదు - రంగంటే - రుచి, వాసనా - గుణమూ వంటివి లేకపోవటం. మనిషి పంచేంద్రియ జ్ఞానమునకు అందనిది అవర్ణము. అందేది - సవర్ణం - అంటే పదార్థ - భౌతిక సృష్టి - ఇది పంచేంద్రియములకందుతున్నది, కనుక దృశ్యము. అది పంచ భూతాదుల ద్వారా వ్యక్తం కావటం - సవర్ణం.

ఆ మహాతత్త్వ దర్శనానుభవాలున్న సిద్ధపురుషులు మహాత్ములున్నారు. వారే ఆధునిక పంచ బ్రహ్మలు శ్రీరామకృష్ణపరమహంస, వివేకానందులు, శ్రీఅరవిందులు, రమణమహర్షులు, శిరిడీబాబా.

వారి మాటలు మంత్రాలు.వారి పాదం తాకిన చోటు ప్రయాగ. వారి పాదజలం ఆకాశగంగ - అని మనుచరిత్ర లోని పద్యార్థం. ఆ మహాత్ముల జన్మ - కర్మలు దివ్యములని గీతా భగవానుల మాట. అలాంటి స్థితప్రజ్ఞులు - ఒక మాట అంటే సత్యం. సత్ పదార్థాన్ని తాకుతుంది. వారి చేష్టదానికమగుణంగా దానిని బోధించేదిగా వుంటుంది.

బాబాను శిరిడిలో ప్రథమంగా శ్రీ సాయి శరణానంద (సన్యసించకపూర్వం వారి పేరు వామన ప్రాణగోవింద పటేల్)

1911 డిసెంబరు 5వ తేదీన దర్శించాడట. ఆయన బాబా భక్తులలో చాలా మహానుభావుడని కదా ప్రతీతి. గుజరాత్ భాషలో బాబా చరిత్ర వ్రాసిన శరణానంద అన్నాడట -

"బాబా శరీరంలో ప్రతీ అణువు, జీవకణమూ, రక్త బిందువూ, ప్రతిరోమ కూపమూ – అనాహతనాదాన్ని వ్యక్తీకరించటం నా అనుభవంలోని విషయము. ఆయన ఎముకలూ, కండరాలు ప్రతిదీ ఈ అనాహతనాదమయం. లోకంలోని సాధారణ వ్యక్తులకది అసాధ్యం. ఆయన జన్మ దివ్యం – అసాధారణమని" వ్రాసిన వాక్యాలే బాబా అభయప్రదానానికి కారణం.

"నేను సమాధి చెంది నా సమాధిలో నుండి ఎముకలు మీతో ప్రసంగిస్తాయి. నా సమాధి మాట్లాడుతుంది. నా మట్టి సమాధానం చెబుతుంది. నా సమాధి మీకు రక్షణగా మీతో పాటుగా వస్తుంది. మార్గం చూపిస్తుంది. నేను మీ చెంతలేనని ఆందోళన దేనికి? నా సమాధి – నా మట్టి – నా ఎముకలు మా యోగక్షేమాన్ని వహిస్తాయి. భయంలేదు!"

ఇందు చేతనే సర్వత్రా వాపించి వున్నాడని స్పష్టము. ఇలాంటి అసాధారణ జన్మ – కర్మలున్న వాని భాష, మాటకు అర్థమేమిటి? ఎలా చెప్పాలి? దానిని బట్టి కదా! ఆయన ఎవరో గ్రహించటానికైనా అవకాశముంటుంది. అది చాలా కష్టము. ఎందుకంటే ఆయన భాష సాధారణమైన మనం మాట్లాడే భాష కాదు. అంటే దాని స్థాయి వేరు, దాని జన్మస్థానం వేరు. మన భాష మన ఆలోచనల నుండి పుడుతుంది. ఆలోచన అంటే మనస్సే. ఆయన మనస్సు నుండి మాట్లాడడు. అది ఆత్మ లోతుల నుండి పుట్టేభాష. దానినే 'మంత్రం' మంటారు. అది మనోభాష కాదు. సమాధి భాష. ప్రతీకా భాష, వేదావాఙ్మయమంతా సమాధి భాష' అన్నారు. అంటే సమాధ్యవస్థ నుండి పుట్టే భాష – మంత్రమయ వాక్కు దీనికి ప్రథమోదాహరణ – ధూళియా కోర్టు విషయములో ఒక దొంగ తన దగ్గరున్న వస్తువులు బాబా ఇచ్చాడని పోలీసులకు పట్టుబడి కోర్టులో అన్నాడు. విచారించటానికి 'జోషీ' అన్న మెజిస్ట్రేటు వచ్చి బాబాను ప్రశ్నించిన ఘట్టం – ఓస్‌బర్న్ గ్రంథస్థం చేసాడు. అది ఇలా ఉన్నది.

| | |
|---|---|
| మెజిస్ట్రేటు | – మీ పేరు |
| బాబా | – వీరంతా సాయిబాబా అంటారు |

| | |
|---|---|
| మీ తండ్రి పేరు | – సాయిబాబాయే |
| మెజిస్ట్రేటు | – మీ గురువెవ్వరు? |
| బాబా | – వెంకుసా |
| మెజిస్ట్రేటు | – మతం |
| బాబా | – కబీరు |
| మెజిస్ట్రేటు | – కులం |
| బాబా | – పర్విర్దిగార్(దైవము) |
| మెజిస్ట్రేటు | – మీ వయస్సెంత |
| బాబా | – లక్షల సంవత్సరాలు |
| మెజిస్ట్రేటు | – మీరు చెప్పింది నిజమేనా? ఇది కోర్టు వ్యవహారం |
| బాబా | – ఔను |
| మెజిస్ట్రేటు | – ఈ దొంగ మీకు తెలుసా? |
| బాబా | – తెలుసు – నాకందరూ తెలుసు, అంతా నావాళ్ళే. |
| మెజిస్ట్రేటు | – వీడు (దొంగ) నగలు మీరిచ్చారంటున్నాడు. |
| బాబా | – ఔను, అందరికిచ్చేది నేనే? – అయినా ఎవరికెవరిస్తున్నారు? |
| మెజిస్ట్రేటు | – అయితే ఆ నగలు మీ కెక్కడివి? |
| బాబా | – అంతా నాదే కనుక. |

ఈ సమాధానాలు స్థాయి వేరని స్పష్ట పడుతూనే వున్నది. ఆయన కాలాతీతస్థాయిలో వుండి విరాట్ – పురుషునిగా మాట్లాడుతున్నాడు.

వామన కథలో బలి అడిగాడు –

'వడుగా! ఎవ్వరివాడ నీవు' – అని

'నాకూరూ పేరూలేదు. అంతా నేనే' – నన్నట్లు వామనుడు.

బాబా భాష వేదఋషి భాష. మంత్ర భాష, దాని స్థాయిమనకందదు. మెజిస్ట్రేటు మతిపోయినవాడైనాడట. ఆయనకూరూ, పేరులేదు, కులంలేదు,

మతంలేదు. శరీరం నిష్ఠదైతే ఇవన్నీ ఉంటాయి.

ఆత్మ నిష్ఠనికేముంటుంది కనుక?–

ఇందులో 'వెంకుసా' అన్నమాటను బట్టుకొని బాబా గురువాయన అన్నారు కొందరు. తరువాత తెలిసినదేమంటే బాబా జన్మించటానికి ముందే వెంకుసా'– సమాధి ఐనాడట. (30 ఏళ్ళకు ముందు).

మరి వెంకుసా 'అని ఎందుకన్నాడు? అంటే బహుశా ఆ మెజిస్ట్రేటుఆయన భక్తుడేమో? లేదా – వెంకుసా పేరు నాటికి ప్రచలితంగా వుండవచ్చు. సాయిశరణానంద వంటివారు కొందరు బాబా గురువు రోషన్‌షా – అన్నారు. ఆయన వున్నాడో లేడో మరి? – కొందరసలాయన లేడన్నారు కానీ – ఎవరో సూఫీ బాబాకు గురువై యుండవచ్చని అన్నారు – ఎందుకు? – అందరకూ వున్నప్పుడాయనకూ వుండవచ్చుకదా?– అని కానీ రమణమహర్షికి గురువెవ్వరు? – రామకృష్ణ పరమహంసకు గురువెవ్వరు? శ్రీ అరవింద మహాయోగికెవ్వరున్నారు? (ఎవరో ఒకరున్నా – ఆయన గురుత్వమెంత ?) కనుక పరమేశ్వరుడే గురువు.

రాముడికి, కృష్ణుడికి తల్లిదండ్రులున్నప్పుడు బాబా కెందుకుండరన్న సాధారణ వాదాన్ని బట్టి కొందరు పత్రి పుట్టిన వూరుగా – అక్కడాయన జన్మించినట్లు చెప్పారు. కానీ అది ధృడంగా సాక్షాధారంలేనిదై పోయినది. అయితే తల్లి, తండ్రులు లేరా? ఉంటే కోర్టు సాక్ష్యంలో ఎందుకు చెప్పలేదు? అది చాలా అవసరం కదా! రమణమహర్షి అంతవారు తల్లికి మోక్షమిప్పించినపుడు – బాబా – 'మాతృదేవోభవ' అన్న మాటనే స్మరించలేదో! పుట్టపర్తి బాబా తమ తల్లి పేరున విద్యాసంస్థలు, విగ్రహాలు పెట్టించి మాతృఋణం తీర్చుకోగా – తనకు పూర్వజన్మగా చెప్పుకొన్న సాయిబాబా ఈ పని ఎందుకు చేయలేదు.

గురువు – జన్మదేశం, తల్లిదండ్రులు ఏమీ తెలియని అంధకారంలో బాబా ఎందుకు దాచినట్లు? తనది అసాధారణ జన్మ కనుక.అందుకే పరస్పర విరుద్ధంశాలతో – ఆయన జన్మ వృత్తాంతాలు వచ్చాయి. ఇదీ తనది దైవవంశమనటాన్ని స్థాపించేదే! ఎందుకంటే వేదవాఙ్మయంలో పరమాత్మ వర్ణన

– విరుద్ధాంశల్లో వ్యక్తీకరింపబడినది కనుక.

పరమాత్మ కదలదు – కదులుతుంది. జన్మ లేదు – జన్మిస్తుంది. స్థిరమూ చలమూ – అవర్ణ X సవర్ణమూ – అంతా తానే – ఏదీ తానుకాదు. ఇలా వుంటుంది ఆభాష, అంటే తత్త్వమనిర్దేశ్యమూ, అవాచ్యం. మాట కందనిది – మనస్సు నిర్మించే కందనిదనే కదా భావం. కనుక అది ఏకము. అఖండము. దేశకాలాతీతం. మన భాష దేశకాలబద్ధం. కనుకనే బాబా భాష పిట్టకథలుగా తత్త్వ నిర్దేశం చేసాడు. తప్ప తర్కభాషలో చెప్పలేదు.

12–12–1910 నాడు కపర్దే తన దినచర్య(డైరీ)లో వ్రాసినాడు. బాబా ఒకరోజు చెప్పినాడట–

1. ఒకడికొక అందమైన గుఱ్ఱమున్నది. వాడెంత శ్రమించినా జంట గుఱ్ఱముతో కలిసి పని చేయలేదు. ఒక గురువునడిగితే 'దానిని తెచ్చిన చోటికే తీసుకొని పో' అని చెప్పగానే గుఱ్ఱమాతని మాట విన్నది – అని.

ఇదేం భాష – 'ఒక చెట్టున్నది. పై కొమ్మ మీద పక్షి కళ్ళు మూసుకొని ఆనందానుభవం పొందుతుంది. క్రింద కొమ్మ మీద పక్షి ఆయా పండ్లు తింటూ – ఆయా విరుద్ధ రుచులననుభవిస్తున్నదన్న" ఉపనిషద్భాషగ లేదా?–

ఇదే 'సమాధిభాష' అన్నారు.

గుఱ్ఱమంటే – 'మనస్సు'. ప్రాణశక్తి – సంకేతము. ప్రాణం మనస్సు ఒకటే. దాని జంట మగ గుఱ్ఱం. లోకసాధారణమైన గుఱ్ఱమైతే సంతోషించాలి కదా! కనుక ఆ గుఱ్ఱం మనస్సు. అది పుట్టినచోటు హృదయం. ఆత్మ దానితో కలిస్తే ఆనందమే – అదే మాట వినటమంటే.

శ్రీ రమణహర్షినొక వ్యక్తి ప్రశ్నించాడట –

'స్వామీ! మార్గమేమిటని వారన్నారట. వచ్చిన దారినే పోవటమేనని – అడిగిన వ్యక్తి ఖిన్నుడైతే ప్రక్కనున్న పెద్దాయన చెప్పాడట. వారన్నది మీవూరు పొమ్మని కాదయ్యా? – నీ జన్మ ఎక్కడ నుండి వచ్చినదో ఆ ఆత్మలోకి – మనస్సు మళ్ళించటమే దాని అర్థమని. బాబా గుఱ్ఱమూ మనస్సే.

చాంద్ పాటిల్ గుఱ్ఱం కథ ప్రసిద్ధమే కదా? దానితోనే అసలు బాబా కథ మొదలవుతుంది. బాబా అంటే గొప్ప ఔలియా – సిద్ధ పురుషుడు – అని పాటిల్ గుర్తించాడు. ఆ కథలో గుఱ్రం తప్పిపోతే అతడు – జీని కళ్ళెం భుజాన వేసుకొని తిరుగుతున్నాడు. బాబా (అప్పటికాయన పేరేమిటో ఎవరూ చెప్పలేదు మరి – ఔరంగాబాదుకు సమీపంలో యెవలా నదీ తీరంలోని 'సింధోన్ – బింధోన్' (ఔరంగాబాదుకు 24 కి.మీ దూరంలోని) గ్రామాలు. అక్కడ ధూప్‌ఖేడా నుండి వస్తున్న చాంద్ పాటిల్‌ను బాబా చూడటం – తర్వాతి కథ తెలిసినదే కదా. ఈ కథలో బాబా అన్న మాటలు – గుఱ్ఱం మోయవలసిన జీనూ – కళ్ళెం నీవు మోస్తున్నావేమిటి? నీ గుఱ్ఱం ఆ ప్రక్క పొదల్లోనే వున్నది. అనగానే అది దొరికినదని కదా కథ – మనిషి మనుస్సును శాసించాలి తప్ప – తాను దానికి లొంగిపోకూడదు. లొంగిపోయేవాడు సాధారణ వ్యక్తి. శాసించే రౌతు యోగి అని బాబా బోధ కదా. అలాగే పాటంకర్ వచ్చిబాబా నడిగాడు బాబా నేను చాలా చదివాను కానీ ధ్యానం, యోగం కుదరటంలేదు – అని. ఇది సరిగ్గా వాసిష్ఠ గణపతి ముని (18–11–1907)లో రమణులను దర్శించి అడిగాడట. 'సామీ! నీవే గురువవు. ఎంతో తపస్సు చేసాను. ఏమీ ఫలితం కన్పించదు. లోపమెమో చెలియదని ప్రాధేయపడి ప్రార్థిస్తే – ఎంతో కాలంగా మౌనంగా వున్న ఆ మౌనస్వామి మొదటిసారిగా అన్న మాట – ఆ ప్రశ్నిస్తున్నదెవరో – విచారించి తెలుసుకోవటమే తపస్సు –అన్నారట.

ఇదీ రమణుల ఆత్మవిచారమార్గం – ఋజుమార్గమని లోకానికి భోధించారు.

బాబా పాటంకర్‌తో అన్నాడట – ఒక వర్తకుడున్నాడు. అతనికొక ఆడ గుఱ్ఱమున్నది. అదొక రోజున 9 లద్దెలు వేసినది. వాటినతడు జాగ్రత్తగా మూట కట్టుకొన్నాడు – అని. ఇదేమి సమాధానం – మరలా గుఱ్ఱమే వచ్చినది – దానికి తెలిసిన వారు చెప్పిన సమాధానం – నవవిధ భక్తులని (సాయిసచ్చరిత్ర) ఇది భక్తి మార్గం అయినా ఆ లద్దెలు చెప్పటమేమిటి – ఆ గుఱ్ఱమేమిటి అదీ ఆడగుఱ్ఱము –

అది మూల ప్రకృతి. విశ్వప్రాణశక్తి సంకేతము. కనుక బాబా భాష – సంకేతభాష వేదభాష. తర్కభాష కాదు. సాధారాణ భాష కాదు – అనటానికి చాలినంత విషయం సచ్చరిత్రకారుడు నిబద్ధించాడు.

ఒక భక్తునితో బాబా అన్నాడట – నీకు, నాకు నడుమ నున్న ఆ గోడ కూల్చివేయి – మనం పరస్పరం నిత్యం చూచుకోవచ్చునని. ఆ గోడ మనస్సు – జీవాత్మకు పరమాత్మకు నడుమ నుండి మనిషిని భగవంతునితే వేరు చేసేది.

ఇలా ప్రతీ విషయాన్ని వివరించుకోవచ్చు.

సృష్టి – స్థితి లయాది కార్యక్రమ నిర్వాహణ చేసేది భగవంతుడు. మెహర్బాబా అన్నాడు–

"నాకున్న దర్శనశక్తి మీకూ వుంటే బాబా సర్వసృష్టి కర్త అని అంటారు. – అని.

దానిని ఋజువు పరిచే కథలు కొన్ని సచ్చరిత లో వున్నాయి. నానా చందోర్కరు వంటి భక్తులను కాపాడిన సర్వవాపకత్వం (భగవల్లక్షణం) వారికి మార్గం చూసిన భిల్లు (చందోర్కరు కథలో నీటిని చూపినవాడు) దేవు ఉద్యాపన కథలో – ముగ్గురు మనుష్యులుగా వచ్చి భోజనం చేసినవారూ, జామ్నేరు చమత్కారంలో జట్కా బండి తోలినవాడు – ఉపాసనీ బాబా కథలో ఆయన బాబా నతిథిగా రమ్మన్నప్పుడు కుక్క – మాల – గొర్రెలకాపరి వంటి వారుగా తోచిన వాడు – అంతా నానావిధ రూపాల్లో వ్యక్తమైన తన విశ్వమూర్తిత్వాన్ని స్థాపించిన వైనం ఇవన్నీ బాబా దైవమన్న విషయాన్ని వ్యక్తీకరించే సామాగ్రి కాదా–?–!

సచ్చరిత్ర చివరి అధ్యాయంలో కప్పను పాము బారి నుండి కాపాడిన కథలో సృష్టిపాలన విషయం కదా. ఇలాంటి కథలు చాతా వచ్చాయి.

## దిగంబరత్వం – సాంబరత్వం

**'ఈశావాస్యమిదం సర్వం – యతించ జ్జగత్యాం జగత్**
**మాగృధ.. కన్యస్విద్ధనం'–**

అన్న ఈశావాస్య ఉపనిషత్తును దాసగణుకు కాకా పని పిల్ల ద్వారా –

తత్త్వ బోధ చేయించిన ఘట్టం తెలిసినదే. ఈ ప్రపంచం ఈశ్వరునకు ఇల్లు. ఆయనే దీనికి యజమాని. నేను కాదు. నేనాయన ఇంట్లో పిల్లవాడను. సేవకుడను. కనుక నా ఆలనా, పాలన ఆయన ఆధీనం. నాకు స్వతంత్రం లేదు. ఇది దాసగణుకు బోధ. అంటే మనకు ఎవరికెవరిస్తున్నారని కదా కోర్టు మెజిస్ట్రేటుతో అన్నాడు బాబా– అందరికీ నేనే ఇస్తున్నాను. అంతా నావాళ్ళే. కనుక దొంగ – దొరా నా యింటివాళ్ళే – నని కదా దీనికర్థము.

కాబట్టి ఎవరి ధనాన్ని ఆశించకు. ఆయన కర్పించక తినకు – అని పై మంత్రార్థము.

సచ్చరిత్ర – సెనగలు తిన్న కథలో – నేనే నీలో లేనా? – నా కర్పించి తింటున్నావా?– అని చెప్పటంలో భావం – పై మంత్రార్థమే – నా సొమ్ము నా కర్పించక నీవు తినటం పాపం, ఇది నీకెలా తినాలో చెప్పిన అంశము.

పై మంత్రంలో వాస్యం అంటే జగత్తు ఈశ్వరునకు వస్త్రమనీ అర్థమే. అఖండ తత్త్వం. అనంతం. దేశ కాలములన్న వస్త్రదారణ చేసి ఖండమూ లేదా వ్యక్తి దేహమన్న వస్త్రం ధరించి వ్యక్తమౌతున్నది. దేశకాల వ్యక్తులే అంబరం. కాంచనాంబరుడు. విష్ణువు. శివుడు దిగంబరుడు అంటే అఖండమైన శివతత్త్వం. దేశకాలవ్యక్తులుగా పరిణామం పొందటమే విష్ణుతత్వం – కనుకనే ఆయనే విశ్వరక్షకుడు. అవతారధారణం చేస్తూ – లోక రక్షణ కార్యక్రమమును నిర్వహిస్తున్నాడు. ఇదే స + అంబరత్వం.

దసరా పండుగ సీమోల్లంఘనం రోజున బాబా ఆవేశంతో తన కఫ్నీ తీసివేసిన కథ వుంది కదా! దాని కర్థమేమిటి? తాను దిగంబరుడైనా సాంబరుడై సృష్టిగా వస్తున్నాడనీ. తన అవతారం చాలించి శివుడౌతున్నాడని భావం. తర్వాత అదే రోజున మహానిర్యాణం చెందటానికిది సూచన అంటే ఆయన – నిర్గుణ తత్త్వమైన శివుడూ – సగుణ తత్త్వమైన విష్ణువూనన్నమాట ఇందుకే బాబా అన్నాడు–

'మీరెక్కడున్నా – ఏం చేస్తున్నా నాకు తెలుసునని జ్ఞాపకం పెట్టుకొనండి. నేనందరి హృదయాల్లో వున్నాను కనుక. చరాచర జీవకోటి నేనే. జగచ్ఛక్రాన్ని త్రిప్పేది నేనే. నేనే జగన్మాతను. త్రిగుణ సామరస్యమూ నేనే. సృష్టి, స్థితి, లయకారకుడను

నేనే. నన్ను స్మరించు. నీకు మాయ బాధలేదు. మరిస్తే బాధిస్తుంది. పిపీలికాది బ్రహ్మ పర్వంతము నా శరీరమే – నా రూపమే – నని సచ్చరిత్ర మూడవ అధ్యాయంలో చెప్పబడినది. ఇందులో హృదయములో వున్నాను అనటం – ఆయన అంతర్యామిగా చెప్పటం. త్రిగుణముల సామరస్యమన్న మాట. సృష్టికి పూర్వవస్థ నేనే నని చెప్పటం – సృష్టిగా తానే తనంకది రూపమవటం వల్ల – తానే విష్ణువునని చెప్పటం – చరాచర జీవకోటికి తానే పాలకుడననటం అది తన రక్షణ బాధ్యత అనటం. నేనున్నానని స్మరించు – మాయ నిన్ను బాధించదు – అనటం. మనస్సు ద్వారా లోకంలోకి పోయి తాను వేరే వ్యక్తిననుకొని సుఖ, దుఃఖాదులనుభవించటం – మాయలో తగుల్కోవటం – ఆ మనస్సు లోతనను ప్రతిష్ఠించి నిత్యస్మరణతో జాగరూడవై యుంటే – నేనే నిన్ను రక్షిస్తాననటం –

కాబట్టి ఈ మాటల్లో తన దిగంబరత్వం – సాంబరత్వం చెటుతున్నాడు బాబా.

మరొక చోట – మాయ నన్ను బాధిస్తున్నది అన్నాడు. (సచ్చరిత్ర 32వ ఆధ్యాయం చివర బాబా సర్కారు అన్న కథలో)

అంటే మాయ ద్వారా తాను సాంబరిడై– జగత్తుగా పరిణమిస్తున్నానని. భావం. ఇది తనకు సృష్టికల్పం కల్గించేది తనలోని మాయా శక్తి ఇది విశ్వఅతీత అవస్థ.

మన మాయ – వ్యక్త – దశలో – నేను వేరే, ఆత్మ వేరనుకొనేది రెండూ వేర్వేరుగా చూచుకోవాలి. ఇదే బాబా – సాధనోపాయంగా మనకనుగ్రహించినది. శరణాగతుడవు కమ్మంటున్నాడు. ఆ శరణాగతితో మాయ జయించగల్గుతున్నాడు జీవుడు– అదే నవవిధ భక్తి స్వరూపంగా గుఱ్ఱం లద్దెల కథలో చెప్పాడు బాబా.

❋ ❋ ❋

# ఏకః – అవర్ణః 2

దిగంబర + సాంబర తత్త్వములు – శ్రీకృష్ణతత్త్వం, కృష్ణ శబ్దార్థమే సగుణ + నిర్గుణ తత్త్వమని వ్యాస భగవానుడే చెప్పటం వల్ల.

బాబా తాను శ్రీకృష్ణతత్త్వస్వరూపుడనని ప్రకటించిన ఘట్టాలు రెండు, మూడున్నాయి.

1. ఉద్ధవేశ బువాతో బాబా అన్నాడట.

'నీవు నిత్యం పారాయణం చేసుకో'–అని ఆయనన్నాడు – ఏది అని అడిగితే బాబా వాడాకు పోయి కాకా దీక్షిత్ చదువుతున్న భాగవతం తెప్పించి – ఒకచోట వ్రేలుదూర్చి – ఇది అన్నాడట.

అది శ్రీకృష్ణుడు ఉద్ధవునకు భాగవతం ఏకాదశ స్కంధంలో చెప్పిన ఘట్టం – అది పారాయణం చేసుకో అనటానికిది అర్థం.

దీనివలన భాగవతం నాటి ఉద్ధవుడు లేదా ఆ పేరుతో నేడున్న బాబా భక్తుడు – తాను శ్రీకృష్ణుడనని చెప్పటమే దీని పరమార్థం.

**2**

బూటీ కట్టిన మందిరములో నడుమ హాలులో మురళీధరుని విగ్రహం పెట్టించాలని భావించి – అదే మాట మసీదులో బాబాతో అంటే – ఎందుకురా? మనమే కూర్చుందామని – తర్వాత ఆయన సమాధి మందిరముగా చేసుకున్నాడు కదా.

బాబా – శ్యామ – నానా చందోర్కరు వంటి భక్తులతో అంటూ వచ్చాడు. మనం ఎన్నో జన్మల నుండి కలిసి వున్నాం అని.

కప్పు – పాము కథలో వీరభద్రప్ప – డుబ్కీల పూర్వజన్మ వృత్తాంతాలు చెప్పాడు.

అలాగే శ్రీమతి కపర్దికి రాజారాం మంత్రాన్ని భోధించిన కథలో ఆమె

పూర్వజన్మ వృత్తాంతాలు నాలుగు అంచెలుగా చెప్పాడు.

1. ఆమె వర్తకుని ఆవు, 2. తోటమాలి కూతురు, 3. వర్తకుని కూతురు క్షత్రియుని పెండ్లి చేసుకున్నది. 4. ప్రస్తుతం బ్రహ్మణుని కూతురు. ఆ విధమైన పూర్వజన్మ జ్ఞానాన్ని బహుధా ప్రకటించాడు బాబా. ఇంత బాహాటంగా చెప్పిన వారరుదు కదా.

ఇది కృష్ణావతారంలో గీతను బోధిస్తూ అర్జునునితో అన్నాడు భగవంతుడు –నే నీ యోగాన్ని పూర్వము వివస్వంతునికి బోధించాను. ఆయన నుండి ఇక్ష్వాకుడు తెలుసుకున్నాడు. ఈయనకు మనువు గురువు. ఇలా అంటే అర్జునుడన్నాడు. – నీవిన్నప్పుడున్నావు. వాళ్ళు పూర్వులు కదా? ఎలా సంభవము? – అంటే భగవంతుడన్నాడు –

**"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున'**
**తాని అహం వేద సర్వాణి. న త్వం వేత్థ పరంతప (4–5)**

నాయనా! మనకు చాలా జన్మలు గతించాయి. అని నాకు తెలుసు. నీకు తెలియదు. ఇంతే – నని.

దేశకాల, అతీత దశలో వున్నవాడు తప్ప – ఇలా చెప్పలేడు.

అదే భగవల్లక్షణం –సర్వజ్ఞత్వం.

**'తత్‌విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేశ్వంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః (గీత 4–34)**

గురువును (జ్ఞానార్థియైన శిష్యుడు) చక్కగా ప్రశ్నించటం ద్వారా ప్రాణిపాతం (పాదాభివందనాదుల) ద్వారా జ్ఞానం లభిస్తుంది. అది తెలిసిన దార్శనికులైన జ్ఞానులుంటారు. వారు నీకు అజ్ఞానంతొలగించటం ద్వారా జ్ఞానాన్ని ప్రకాశింప చేస్తారు.– అన్న విషయం నానా చందోర్కరుకు గీతాబోధ కల్గించాడు ఈ శ్లోక వివరణలో, కృష్ణుడు జ్ఞాని కదా మరి ఇతరులు బోధిస్తారు – తెలుసుకో – అని ఎందుకన్నాడంటే – ఆ గురువు తానూ ఒకటే కనుక – అనటం వల్ల బాబా తనను తాను శ్రీకృష్ణుడ నేననటం కదా.

ఆ శ్లోక వివరణ ఓస్‌బర్న్ గ్రంథస్థం చేసాడు. (సచ్చరిత్ర కారుడూ) – చేసి అన్నాడు. “బాబాతో నానా అన్నాడట ఆ వివరణ విని బాబా నాకు గీతార్థం బోధించు – అని అలాగే రోజూ నాదగ్గర గీత చదువుమని అలాగే చేశాడట. కానీ దురదృష్టం – ఆ విషయం మనదాకా రాలేదు – కానీ ఆయన చెప్పినది. శుద్ధమైన అద్వైతమేనని వ్రాసాడు ఓస్‌బోర్న్.

## 4

మరొక ఫోటో బాబా పురాతనమైన గోడ ప్రక్క నడుస్తూ నిలబడినట్టి దొకటున్నది. అటు ఇటూ బూటీ మరొకరు పట్టుకొన్నట్లున్న ఫోటో.

ఆ నిలబడిన తీరు – ఎడమకాలి మీద బరువంతా అనించి కుడిపాదం, ఎడమపాదం మీదుగా నేలను తాకిస్తున్న వైనం కల పోటో. భాగవతాది పురాణాలు – ఇది శ్రీకృష్ణుని వ్యతస్థపాదం – నిలబడి మురళి వాయిస్తున్న బొమ్మలు చూస్తున్నాం. – శ్రీకృష్ణదేవరాయల వంటి మహాకవులు ఆ త్రిభంగిమ వ్యత్యస్త పాదారవిందాన్ని కీర్తించిన పద్యాలు చదువుతున్నాం. దానిని గురించి సద్గురు కందుకూరు శివానందమూర్తిగారు తమ శ్రీకృష్ణ అన్న గ్రంథంలో వ్యాఖ్యానించారు.

“వామపాదం పృధ్వీ తత్వం. ధక్షిణపాదం ఉర్ధ్వలోక తత్త్వం. వామపాద ధ్యానంతో మనస్సు సుస్థీరమౌతుంది. తర్వాత దక్షిణ పాదధ్యానం – దివ్యానంద దాయకమని” ఈ విషయమే శ్రీలీలా సమాధి గ్రంథంలో – బాబా బండమీద కూర్చున్న భంగిమను వ్యాఖ్యానిస్తూ చెప్పబడినది.

దక్షిణపాదం ఆకాశంలోని దేవతలకు – వామపాదం భూలోక వాసులకూనని. వామమంటే వ్యక్త సృష్టి – దక్షిణమంటే అవ్యక్త నిర్గుణ తత్త్వమనీ – ఆబండరాయి – మనిషి మనస్సంకేతం – అదే నటరాజు విగ్రహంలో కాలి క్రింద అపస్మారుడనే రాక్షసుడన్న సంకేతము చెప్పబడటం చూచుకోవచ్చు.

ఆ రెండు చిత్రాల్లో బాబా తాను శ్రీకృష్ణావతారమని వ్యక్తం చేయటం – ప్రతీకా దృష్టితో చేసాడు. అవతార చేష్ట – భాష – ప్రతీకలు తప్ప సాధారణ లోక

వ్యవహారా విషయాలు కావు.

అవతార తత్వ విషయమూ, ఆ 'శ్రీలీలా సమాధి'లో శ్రీ అరవిందుల వాఖ్యానం ప్రదర్శింపబడినది. చదువుకోవచ్చు.

## సాధన సహస్రం

విజ్ఞాన భైరమన్న తంత్రగ్రంథమొకటి సుప్రసిద్ధమైనదున్నది. అందులో 112 సాధనా ప్రక్రియలు చెప్పబడినవి. అంతకంటే వేరే సాధనలుండవన్నారు. వేత్తలైనవారు.

బాబా కూడా శతాధిక సాధనలు చెప్పారు. ఆయనదొక మార్గం కాదు. దేనినీ బోధించటానికి వచ్చిన అవతారం కాదది. భక్తుల వయస్సులు, జీవుడేస్థాయిలో వుంటాడో దానికనుగుణంగా బోధించాడు తప్ప తన ప్రత్యేక మార్గము చెప్పలేదు. ఆయన చెప్పిన ప్రత్యేక మార్గమొక్కటే – అదే శిరిడీ నుండి కూడా ఒక బాట వున్నది. అది చాలా కష్టమైనదారి. దారినిండా క్రూర జంతువులుంటాయి – అని అంటే దీక్షిత్ అన్నాడట. మార్గదర్శకుని తోడుగా తీసుకొని పోతే – నని – బాబా అన్నాడట అప్పుడు మార్గము శుభప్రదాయకమౌతుందని. ఇది సచ్చరిత్ర మొదటి అధ్యాయం చివర్లోనే వున్నది.

శ్రీ భగవాన్ రమణమహర్షి అన్నారు – నాకు నామరూపాలు లేవు. మహావిష్ణువు దగ్గరి నుండి క్రిందిదాకా సర్వులలోని మహాచైతన్యమేనేనని, బాబా అన్నాడు. సర్వదేవతా స్వరూపుడనని – సర్వజీవులూ నా శరీరాలేనని – అంటూనే నాకు నిరాకార, సాకారాలున్నాయి – నీవేదైనా ధ్యానించవచ్చు.

"నను కేవలానంద స్వరూపుడను. అది నా నిరాకారం. దానిని ధ్యానించు నీకు చేతకాకపోతే నీవు మసీదులో చూస్తున్న ఈ రూపాన్ని ధ్యానించు – నేను ఇంద్రియాదిక శరీరం కాదు. నేను నిత్యసాక్షిని. నాకు కర్తవ్యం లేదు."

ఇది బాబా సూక్తులు – ప్రణాళిక అన్న నరసింహస్వామీజీ గ్రంథంలో (105–106) అంశాలు.

(108,109,110)

క్రిందవారే ఇచ్చారు. “ నిత్యమూ నేనెవరనని ఆత్మ విచారణ చేయి. అది శ్రవణ మననాదుల ద్వారా”.

మనమెవరము? నేనెక్కడి నుండి వచ్చాను? ఈ ప్రపంచమంతా ఎక్కడిది? ఎక్కడున్నది? మన సంగతేమిటి? ఈ విచారధారలో నిమగ్నం కావాలి. మనం ఆత్మస్వరూపులమని తెలుసుకోవాలి గుర్తించాలి.

మనష్యులు తమ మధ్య భేదమున్నట్లు భావిస్తారు. నాదీ – నీదీ – నీవూ – నని. ఇదంతా సత్యం కాదు. ‘నీలో నేనున్నాను. నాలో నీవున్నావు’ – అని గుర్తించు. ఈ మార్గం నానా చందోర్కరు వంటి అద్వైతులకు బోధించాడు.

అదే నరసింహస్వామీజీ గ్రంథంలో 122–123 అంశాల క్రింద చెప్పిన విషయసారాంశమిది.

చందోర్కరు ప్రశ్నలు .

భగవంతుడంటే ఏమిటీ? ఆయన స్వరూపమేమిటి? ఎక్కడుంటాడు? మనమెలా దర్శించాలి.

బాబా సమాధానం.

“ఆయన సకల జీవరాసుల్లోనూ వున్నాడు. సర్వేసర్వత్రా వ్యాపించిన మహాచైతన్యమది. కాని మాయావరణలో వున్నావు. నిన్నాతెర చూడనివ్వదు. మనసంతా ఆయన అంశలమే. కనుక ఎవ్వరినీ ద్వేషించటం కూడదు. అందర్ని, అన్నిటినీ చరాచరాన్ని ప్రేమించావంటే భగవంతుడు నీకు సన్నిహితుడౌతాడు. దీనికి సాధన – మనస్సును నిశ్చలం చేయాలి. పదార్థజగత్తును నాది – నీది అని చూడకు. అది ఈశ్వరునిది. ఆయన సృష్టి చూచి ఆనందించటానికే నీకు జ్ఞానేంద్రియాలున్నాయనుకో. దానికి మూర్తి, సాకారపూజ ఉపకరిస్తుంది.విగ్రహారాధన కాదనకు. అందులోనూ చైతన్యమున్నది. అదీ భగవంతుడే. మననం ధ్యానం ఆవశ్యకములు. సాధన చతుష్టయాన్ని అభ్యసించు. సాధన చేయి. నిత్యానిత్య వివేకం చాలామంచిది. అవసరం. కేవలం పుణ్యక్షేత్రాటనం చాలదు. వివేకంతో చేయాలి. వైరాగ్యమలవరచుకోవాలి.

శమదమాదులనభ్యసించాలి. మోక్షమంటే వైకుంఠంకాదు. కైలాసంకాదు. శుద్ధ చైతన్యానుభవం. దానినే బ్రహ్మమన్నారు. అది అవాఙ్మానసగోచరం."

చందోర్కరు మరలా ప్రశ్నించాడు – బ్రహ్మమంటున్నావు కదా? – మరి లోకంలో సుఖ, దు,ఖాదులకు మూలమేది? ఆయన నిరాకారం – ఏకం – అంటున్నావు కదా!

ఈ అనంత జీవమయమైన సృష్టి నానావిదంగా ఎందుకు తోస్తున్నది? అంటే – ఒకే నీరు – గుంటలు మొ॥న వాటిలో భిన్నంగా తోచినట్లు. రంగులు కలిపిన నీరు నానా విధాలుగా వున్నట్లు – ఆ రంగు తొలగిస్తే అంతా ఏకవర్ణమైన జలమే కదా. అలాగే సృష్టి వివిధ జీవుల కర్మాదులచేత భిన్నంగా తోస్తున్నది. శుద్ధసత్యం – వ్యావహారిక – ప్రాతిభాసికంగా తోస్తున్నది. ఒకే వ్యక్తిలో బాల్యాది దశలు పరిణమించినా వ్యక్తి ఒకడే కదా! త్రిగుణమయమైన ఆత్మపదార్థం – మహాత్ములకు శుద్ధపారమార్థిక సత్యంగా, అపరిశుద్ధులకు వ్యావహారిక, ప్రాతిభాసిక సత్యంగా తోస్తున్నది. వ్యవహారిక జగత్తు చూచేవారికి ద్వంద్వంగా తోస్తున్నది. కొందరకు చెడు మంచిగా, మంచి చెడుగా భాసించటం లేదా.

ఇదంతా మాయవల్ల, మాయ అంటే శుద్ధచైతన్యము యొక్క శక్తి తప్ప వేరు కాదు. బెల్లం నుండి తీపి వేరు చేయలేనట్లు చైతన్యం నుండి మాయాశక్తిని వేరుచేయలేము. ఈ మాయచైతన్యములో లీనంచేస్తే – కేవలం చైతన్యమే – ఏకతత్త్వమే భాసిస్తుంది. చైతన్యంలాగానే మాయ కూడా అనాది. ఇది చైతన్య శక్తి. దానికి కార్యరూపం. దీనివల్లనే ద్వంద్వ బుద్ధి ఏర్పడి జగత్తుగా కన్పిస్తున్నది.

మాయావరణ తొలగిపోతే ఏక చైతన్యమే అంతా. కనుక మనిషి జగత్తును శుద్ధచైతన్యంగా ధ్యానించాలి. ముక్తి అంటే ద్వంద్వ బుద్ధి నశించటము. దు.ఖరాహిత్యమో ముక్తి". ఇది బాబా చెప్పిన దానికి – నరసింహస్వామీజీ పుస్తకములో వ్రాసిన దానికి సంగ్రహరూపము.

(మాయను అద్వైతంలో అనిర్వచనీయమన్నారు. కానీ బాబా – చైతన్య శక్తి అనటం – శాక్తేయ, తాంత్రికాద్వైతం చెప్పినట్లు వాఖ్యానించవచ్చు. అంటే శంకరుల

'సౌందర్యలహరి'లో

'శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్త. ప్రభవితం'–

శివ, శక్తుల సమ్మేళనమే ఇదంతా – అన్నట్లుగా బాబా అనటం వల్ల ఇది తాంత్రిక – శక్తేయాద్వైత' మనాలి. దాని వివరణకిది చోటు కాదు. కానీ భేదమున్నట్లు సూచింపబడటమే ప్రస్తుతాంశం'–)

నానా చందోర్కరుకు గీతాశ్లోక వివరణ చేసిన సందర్భాములో భోధించటం క్ష్యంజ్ఞానవిషయంగా గాక – 'ఉపదేశంతితే జ్ఞానం'– అన్న చోట – అజ్ఞానమని బాబా వివరణ చేసిన సందర్భములో చందోర్కరు – శంకరులలా అనలేదన్నాడు. బాబా 'వారనకపోతే పోనీలే' అన్నాడు. కనుక చందోర్కరు శాంకరాద్వైతి కావచ్చు. కనుక ఈ వేదాంత విచారణ చెప్పాడు బాబా.

అదే సకల జీవులకూ మార్గమనలేదు.

మరొక చోట బాబా మనిషి ఎలా జీవించాలో చెబుతూ అన్నాడట.

"భూమిలో గింజలు వేస్తున్నాము. మేఘాలు వానలు కురుస్తున్నవి. సూర్యుడు కిరణప్రసారం చేస్తున్నాడు. గింజలు మొలకెత్తుతున్నాయి. అవి మొలకెత్తినా ఎండిపోయినా భూమి, సూర్యుడు, మేఘం సంతోషించటం లేదు. ధు.ఖించటం లేదుకదా. వాటి మానాన అవి నడుస్తున్నవి.

నీవిలా బ్రతకటం అభ్యసించు. నీవు నీవు వుంటే – దుఃఖమెక్కడిది? దుఃఖము లేకపోవటమే మోక్షమంటే"–(శ్రీరమణులన్నారు – కోర్కె లేకపోవటమే ముక్తి' అని. బుద్ధుడు తృష్ణా రాహిత్యమే చెప్పాడు.)

ఆ ఆత్మ విచారమార్గము, ఆత్మాన్వేషణ, క్లిష్టమూ. సాధారణ వ్యక్తికి, అర్థం కావటమూ కష్టమే. 'అహం బ్రహ్మాస్మి నేనేబ్రహ్మం అనుకోవటమంటే లోకానికి ఇబ్బంది కూడా – ఎక్కడో వైకుంఠం, కైలాసం, బదరీనాథ్, అమర్‌నాథ్ దాకాపోతే తప్ప తృప్తిపడని మనిషికీ భోధ సరిపడదు. ఒక కథ కూడా వున్నది. ఒక సూఫీ యోగి – అనల్‌హక్ – నేనే అల్లాను – అనేవాడట. మిగిలిన వారికది కర్ణకఠోరంగా విన్పిస్తే, అతనిని నరికి చంపి పారవేసారట – ఇదీ లోకమంటే.

కనుక బాబా చెప్పేవాడట–

'అనల్‌హక్ – అనుకోవటం కంటే – యాదేహక్ –

(అల్లా సేవకుడను – అల్లామాలిక్ అని బాబా ఇందుకే అనేవాడు)

అనుకోవటం మంచిది. తూహి, తూహి – సర్వం నీవే – నీ యిష్టమని అనుకోవటం మేలని – దానినే సంకేత భాష' లో చెప్పేవాడు బాబా – రామాఫలం తిని అరిగించి కోవటం కష్టం. తినటానికి, జీర్ణము కావటానికీ సీతాఫలం మంచిదని – ఆత్మ విచారణ కంటే 'సగుణోపాసన' మంచిదని అర్థము. (ఇక్కడ మనమొక విషయం గుర్తించాలి. బాబా భక్తుల్లో పండితులు చాలా అరుదు. అంతా ప్రభుత్యోద్యోగులూ, సాధారణ జనులూ అధికము, రమణ మహర్షికి, రామకృష్ణ పరమహంసకూ, శ్రీఅరవిందులకలా కాదు. (శ్రోతలు శాస్త్రవేత్తలు) పైగా బాబా వ్రేపల్లె వంటి శిరిడిలో వున్నాడు. ఇతరులలా కాదు కదా. కనుక నానా చందోర్కరు వంటి వారికి ఆత్మాన్వేషణ మార్గం చెప్పాడనుకోవాలి. పాటంకర్ పండితుడే అయిన భక్తిమార్గమే చెప్పాడు. – గుర్రపులద్దెల కథలో. ఇందుకే బాబా భక్తుని స్థాయిని బట్టి బోధించేవాడు.

## బోధలు

1. ఇష్ట దేవతారాధనః వారి వారి ఇష్టదేవతను గృహదేవతనే ఆరాధించుకోమన్నాడు. ఎవరి ఇష్టదేవతను వారు బాబా శరీరమన్న తెరపై సినిమా చూచినట్లు చూచుకొన్నారు. మద్రాసు భజన సమాజంలోని ఇల్లాలు కోదండరాముని చూచుకొన్నట్లు గణపతి, మారుతి, జైనతీర్థంకరుడు, దత్తాత్రేయాది మూర్తులను దర్శించుకొన్నారు.

అలాగే అక్కల్ కోట మహారాజు. అమన్‌బాబా, మౌలీసాహెబు వంటి ముస్లిం యోగులను దర్శించుకొన్నారు, ఆ మతస్థులు – అందుకే బాబా, ఆయా భక్తులు వచ్చినపుడు వారి వారి ఇష్ట దేవతారాధనలన్నీ తనకే చెందినట్లు చెప్పేవాడట.

భారతంలో, తెల్లవారి సైంధవుని తల నరకాలని నరుడు తల పెట్టినపుడు,

నారాయణుడా రాత్రి పాశుపతాస్త్ర – తదధి దైవతాన్ని ధ్యానించమన్నాడట. ఇక్కడ చేసిన పూజలు, అక్కడ శివునకు చెందినట్లు చెప్పబడినదని ద్రోణ పర్వంలోని కథను భావించవచ్చు.

2. కొందరకు, వారి వంశ గురువులు చెప్పిన మంత్రాలను జపింకోమన్నాడు.

ప్రధాన్ అన్న భక్తునకు రామమంత్రము వారి వంశగురువను గ్రహించినది జపించుకోమన్నాడట.

3. శ్రీమతి తార్కాడ్‌కు – రాజారాం అన్న మంత్రము బోధించాడు. కొంచెము మార్చి 'శ్రీరాంజయరాం జయజయరాం' – అని గణేష్ మహారాజన్న భక్తునకు భోధించాడు.

4. రేగే అన్న భక్తునితో – అన్నాడు బాబా – 'పుస్తకాలు చదువవద్దు. నీ హృదయంలో నన్నే నిలుపుకో' – అని.

5. ముకుంద లేలే శాస్రితో – నారాయణోపనిషత్తు పారాయణం చేసుకోమన్నాడు. దీక్షిత్ వంటివారికి ఏకవథ భాగవత పారాయణ విధించాడు. గురు చరిత్ర పారాయణ కొందరకు – ఇలా వారి వారి అభీష్టానుసారంగా వారికీ తెలియకుండా, సుప్తావస్థలో వున్న వాటిని వెలికి తీసి విధించాడనుకోవచ్చు. తనంటే ఏమిటో, తన లీలా విశేషాలేమిటో, తన విచిత్రావతార విశేషాలేమిటో, కొన్నిచోట్ల బహుశా సంశయంతో వచ్చిన వారికోసం చెప్పిన ఘట్టాలూ వున్నాయి.

ముకుందలేలే శాస్త్రి విషయము 'శ్రీలీలా సమాధి'లో దీర్ఘంగా చెప్పబడినది. దానికిది సంగ్రహరూపం. ఆయన వస్తే బాబా గీతలో 9వ అధ్యాయంలోని చివరి నాలుగు శ్లోకాలు చదివి నారాయణోపనిషత్తును పారాయణం చెసుకోమన్నాడట.

ఆ శ్లోకాల్లో 30వ శ్లోకముః

**'అపి చేత్సు దురాచారో భజతే మా మనన్య భాక్।**

**సాధురేవ సమంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః॥ (9–30)**

"ఎంతటి గొప్ప దురాచారి అయినా నాయందే మనస్సు నిలిపి నన్నే ధ్యానిస్తాడో వాడూ సాధువే. వాడు నిశ్చయాత్ముడు కనుక" ఈ శ్లోకమే

ఎందుకెన్నుకున్నాడో తెలిగ్గానే భావించవచ్చు. నేటికీ వదలని జాడ్యం – బాహ్యాచారాడంబరత్వం.

ఒక శ్రీవైష్ణవ కుటుంబములో పుట్టిన పండితురాలు స్వామీ వివేకానంద జీవితచరిత్ర వ్రాస్తూ పీఠికలో అన్నది –

"మాది శ్రీవైష్ణవ కుటుంబము. అంతా మడీ ఆచారము. మా తాతగారు తన వంట తానే చేసుకొనేవాడు" అని. ఇదే మతమన్న మనిషిని మార్చడానికే శ్రీరామకృష్ణ పరమహంస నుండి రమణమహర్షి దాకా గురుపరంపర వచ్చినది. ఈ విషయం ఆర్థర్ ఓస్‌బోర్న్ వ్రాస్తాడు.

"వర్ణమతాతీతమైన ఆధ్యాత్మికసాధనకు. ప్రతీ వ్యక్తి అర్హుడే. స్త్రీ, పురుష భేదం కూడా లేని వ్యవస్థను సృష్టించిన మహాత్ముడు శ్రీరామకృష్ణపరమహంస. ఆయన శిష్యుడైన స్వామీజీ నుండి పాశ్చాత్యులకు ఈ అదృష్టము పట్టినది. ఇదే రీతి శ్రీ రమణమహర్షితో పరాకాష్ఠ చెందినది' – అని.

(నీవు నిశ్చింతగా వుండు – గాలి అదే పాడుతుంది – అనే పుస్తకంలో) జగజ్జనని శారదాదేవి చరిత్ర ఒక ఘట్టమున్నది. ఆ తల్లి – కామార్పు కుర్ – పరమహంస జన్మస్థానంలో వున్నది. అప్పటికి పరమహంస శరీరత్యాగం చేసారు. అపుడొక కడజాతివాడు వచ్చి 'అమ్మా! నీ పాదాలను పూజించుకోనిస్తావా?' – అంటే – ఆ కన్నతల్లి ఆర్తురాలై 'నాయనా – నిన్ను వీరు రానివ్వరు. నన్ను ముట్టుకోనివ్వరు కదా – కనుక ఈ రాత్రికి – నీవొక తెల్లని క్రొత్త బట్ట తెచ్చుకోమని – ఆ తల్లి కాళ్ళకు పారాణి లేదా కుంకుమ హత్తుకొని, అతడు తెచ్చిన బట్టపై నిలుచుచున్నది. ఆ పాదముద్రలే నేటికీ పరమహంస దేవాలయంలో భద్రపరచబడి – భక్తులకు హృదయానందాన్ని కల్గిస్తున్నవి. (నేను వ్రాసిన 'మహాదేవీసూక్తం' చివరి అట్టపైన ఆ తల్లి ఫోటో క్రింద – ఈ బొమ్మ నచ్చొత్తించాను.)

ఇదీ ఈ దేశము యొక్క దుష్టసంస్కారము. ఇక్కడ బాబా అలావున్నాడు చూడబోతే సాయిబు వేషం. రోజూ స్నానదులు లేవు. పలావు వండి వెడుతున్నాడు. ఇక మంత్రం లేదు. జపం లేదు. మడీ లేదు. ఇదంతా ఏమిటీ? కాని జనం ఎగబడి

వస్తున్నారు. ఏమిటో చూద్దామని గీతలో 11 శ్లోకాలు వల్లిస్తూ –జప, తపాదులు నటిస్తూ వున్న భక్తులు – దంబాచారులు గీతలో అన్నట్లుగా – ఆ భావజాలంలో కూరుకొనిపోయి వచ్చాడా ముకుందలేలేశాస్త్రి – అందుకే సుదురాచారి – శ్లోకం చదివాడు. (ఉపాసనీ బాబాను మార్చిన వైనం చూచుకోవాలి. వారు తానేనని చెప్పాడు. ఏదీ పరమాత్మ భిన్నం కాదనీ – అన్నీనేనేనని – ఆయనకు తెలియ చెప్పటానికని)

ఇది బాబా విచిత్ర భోధనా విధానము. దురాచారం బాహ్యం. దుర్ – కానీ – సు(మంచి) కానీ బాహ్యమే. అంతరంగములో వుంటుంది భక్తి – జ్ఞానంః రమణమహర్షి అనేవారట – 'మీరు పైతొడుగులు శరీరాలు చూచి – అదీ, ఇదీ అనుకొని ద్వేషించటం చేస్తారు. కానీ లోపల వున్న వాడిని చూడటం లేదని / కనుక బాబా తర్వాతి నాల్గు శ్లోకాలు చదివి – ఆడంబాచారి శాస్త్రికి భగవత్తత్వం భోధ చేశాడు.

**'యో వెత్తి మాం తత్త్వతః'** – శ్రీకృష్ణపరమాత్మ మాటిమాటికీ గీతలోఅన్నదిందుకే. తత్త్వతః' – చూడు, విచారించు, ఆచారాదులు కావు ముఖ్యం.

**'క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వత్ శాంతిం నిగచ్ఛతి**
**కౌంతేయ ప్రతిజానీహీ, నమే భక్తః ప్రణశ్యతి' –(9–31)**

అని తర్వాతి శ్లోకం చదివాడు –

'వాడు వెంటనే ధర్మాత్ముడౌతాడు. క్రమంగా శాంతిని పొందుతాడు. ఇవి చక్కగా తెలుసుకో (ప్ర+జానీహి)

నా భక్తుడెవ్వడూ నశించడు' –

ధర్మాత్ముడు కావటం, శాంతిని పొందటం క్రమ పరిణామంగా చెబుతున్నాడు స్వామీ – నా భక్తునకు పతనం లేదు.

ఉపాసనీ – తన బ్రాహ్మణత్వం – పైరీతిగా మరిచిపోయి అది దోషమని తెలిసి, మహాయోగి కావటానికి నాల్గేళ్ళు పట్టినది – ఇక లోకం సంగతేమిటి?

30 వ శ్లోకానికి ముందు శ్లోకము –

**'స మోహం సర్వభూతేషు, న మే ద్వేషో స్తి న ప్రియః**

**యే భజంతి తు మాం భక్త్య మయి తే తేషు చాప్యహమ్॥ (9–29)**

సర్వజీవరాసుల్లో నేను సమంగా ఉన్నాను. నాకొకడు శత్రువు లేడు. మిత్రుడు లేడు (ఈ ద్వంద్వము లేకపోవటమే సమత్వం. ఎవడు నన్ను సేవిస్తున్నాడో, భక్తితో ఆరాధిస్తున్నాడో వానిలో నేను, నాలో వాడూ వున్నాడు?

ఇది బాబాతత్త్వం. తత్త్వతః చూడు – బాహ్వ వేషాచారాలు చూడవద్దని బాబా భోదిస్తున్నాడనాలి కదా. ఈ తత్త్వ బోధ పండితునకు సంబంధించినది. కాని వారికో మరి? 22 అధ్యాయం చివర (సచ్చరిత్ర) ముక్తారాం, హేమద్పంతులకు ఒక దీర్ఘ చర్చ జరిగినది.

ఒక పాము తప్పించుకొన్నది. చంపబోతే ముక్తారం అన్నాడు – మంచిపని జరిగింది. దభోల్కరు (సచ్చరిత్ర కారుడు) అది కాదు అన్నాడు. ఈ హింసాహింసల గొడవ చాలాసేపు జరిగినది. చివరకు బాబా దగ్గరకు వచ్చారు – ఆయన అన్నాడు – 'భగవంతుడు సకల జీవరాసుల్లో వున్నాడు. ఆయన ఆజ్ఞలేక ఏమీ జరగదు. అన్నీ ఆయన ఆజ్ఞకు హద్దంగానే ప్రవర్తిస్తాయి. కనుక అన్నిటినీ ప్రేమించటం మంచిది'.–

❊ ❊ ❊

# ఏకః - అవర్ణః 3

ఈ విషయమే 'ఈశావాస్య మిదం సర్వం' - అన్న ఈశావ్యాసంలోని ప్రథమ మంత్రార్థము. సర్వమూ ఈశ్వరునకు నివాసమైనపుడు శత్రుమిత్రాది బేధం కానీ, చంపాలనుకోవటం కానీ - అర్థములేని పనికదా. జంతువులను సైతం ప్రేమించాలి - అన్నప్పుడు సాటి మానవుల సంగతి చెప్పాలా?-

బాబా ఏది చేసినా, చెప్పినా - ఒక బోధాంశమే - మానవజాతిని నిత్యం, జాగరూకుడై - మేల్కొలువుతూనే వున్నాడు. నిద్రపోవద్దురా అని. నిద్ర కూడా మేలుకొని పొమ్మన్నాడు కదా - బల్లనుయ్యాలగా చేసుకున్న ఘట్టంలో మహల్సాపతితో చెప్పిన మాటలు స్మరించాలి.

కనుక బాబాకు ఒక మార్గమేముంటుంది? నీ కోసం వచ్చినాడాయన. నీ స్థాయిని బట్టి - నీకు మార్గోపదేశం చేయటమే ఆయన మార్గం - 'సర్వభూతేషు సమం' - అన్నాడు. కనుక అన్ని మార్గాలాయనే - అసలు మార్గమే ఆయన.

ఏది కాదు (ఆయన మార్గము). భక్త పరాధీనత తప్ప ఆయన ఏదీ కాడు. అన్నీ ఆయనే. కనుకనే సచ్చరిత్ర 19వ అధ్యాయం చివర్లో వ్రాయబడినది కదా -

"తానెవరన్నది తెలుసుకోవాలనుకున్నవరికి శ్రవణం, మననం - కొందరకు భగవన్నామం. కొందరకు తన లీలలను వినటం, కొందరకు పాదపూజ, కొందరకు జ్ఞానేశ్వరి వంటి సద్గ్రంథ పారాయణం - కొందఱకు విష్ణుసహస్రపారాయణ, కొందరకు ఖండోబామందిరానికి పంపటం కొందరకు స్వయముగా ఉపదేశమివ్వటం. కొందఱకు స్వప్నంలో బోధించటం. వారి ఉపదేశములకు పరిమితి లేదు' - అని. ఈ వైవిధ్యం దేనికి? - అన్నీ తానే కనుక. అన్నింటికి లక్ష్యం - గమ్యమైనదే ద్వారక. నలుదిక్కుల ద్వారాలు కలది. కేంద్ర బిందువు - గమ్యస్థానము.

**'తద్విష్ణోః పరమం పదం'-** అన్నట్లు. తానే.

ఎటునుండి చూచినా, నీకా చూపుండాలే తప్ప - చూద్దామన్న కోరిక ఉండాలే తప్ప - ఆ చూపునకు లక్ష్యం - తానే అని చెప్పటమే కదా. నేడు మనం చూస్తున్న గుళ్ళు, గోపురాలు ఆయన బోధల్లాగా - అనంతంగా, విశ్వరూపంగా

సాక్షాత్కరిస్తున్నాయి.

గురువంటే - చెప్పటమే కదా. సాధనలో తో(ట్రుపాటులు సవరించాలి. దేవ్–కు జ్ఞానేశ్వరి చదవటానికాటంకాలు దక్షిణరూపములో తొలగించటము. ఆయన చదువుతున్నాడో లేడో నని స్వప్నంలో సాక్షాత్కరించి ప్రోత్సహించటం లాంటివి దీనికుదాహరణలు.

ఒకచోట స్వామి వివేకానంద అన్నారు ఒక శిష్యునితో 'నేనెవరినైనా శిష్యునిగా అంగీకరించానంటే, ఈ శరీరం పతనానంతరం కూడా అతనిని గమ్యం చేరుకునేటంతవరకు బాధ్యత తీసుకుంటున్నానని' అర్థమని.

ఈ దక్షిణ వ్యవహార విషయం కొంత చూడదగ్గది. ఇతరాత్రా కన్పించనిది. మ్రొక్కు మరచిపోయిన వారికి గుర్తు చేయటం - శతశృంగి దేవత విషయంలో శ్యామాను 'వణి'కి పంపటం - దీనికుదాహరణ.

## దక్షిణమార్గ వైవిధ్యము

ఒక సాధకుడు గురువును దర్శించి అడుగుతున్నాడు.

స్వామీ! నాకు మార్గోపదేశం చేయమని.

గురువన్నాడు - ఆత్మన్వేషణ - నేనంటే ఎవరు? -వెతికి పట్టుకో అని - ఏ రమణ మహర్షివంటివారో.

సాధకుడు - నా వల్లకాదు. ఏదైనా అభ్యాసమార్గం చెప్పండి.

(శేషాద్రి స్వామి వంటి మహానుభావుడు రమణమార్గం బహుధావిని - ఏమిటో? - నాకర్థంకావటం లేదు - నేను నా మార్గానే పోతానులే' అన్నాడట)

గురువు - నీ మనస్సును పరిశుద్ధం చేసుకో. వృత్తులనరికట్టు.

సాధ - నా వల్ల కావటములేదు. ఎందుకంటే సంసారం, ధనం, కామాదులడ్డు వస్తున్నాయి.

గురువు - మంత్ర జపం చేయి.

సాధ - అదీవల్ల కావటం లేదు. సమయం చిక్కటం లేదు. లోకవ్యవహారముల వల్ల.

గురువు – వివాహము చేసుకొని – ఉద్యోగం సంపాదించుకో. కొంత ధనము ఆశ్రమానికివ్వు – ప్రాణాయామాదులు చేసుకో. గురువుని ధ్యానించు లేదా ఇష్టదేవతను.

సాధ – నమస్కారము స్వామీ! అలాగే చేస్తాను.

ఈ వివిధోపాయాలు, దక్షిణ ఇదే బాబా మార్గము – సాధకుని స్థాయిని బట్టి చెప్పటం.

(ఈ సంభాషణ – కాశ్మీర శైవయోగమన్న ఆంగ్లగ్రంథంలోనిది. చూ. పుట 275 స్వామి శంకరానంద)

ఈ దక్షిణ ఏం చేస్తున్నది. గురుభక్తిని కల్గించి మార్గాంలోని ఆటంకాలను తొలగిస్తున్నది. ఇదే బాబా చెప్పినది.

మసీదు వాళ్లను తన బాకీను కోరుతున్నది. బాకీలేని వారిని నేనడగను. నాకు డబ్బెందుకు – ఫకీరుని – అనటంలో భక్తుల నుద్ధరించే ఆలోచన తప్ప తనకెందుకీ డబ్బు.

ఒక రాణిగారు బంగారునాణెములను సమర్పిస్తే – త్రోసి వేసాడు. మహల్సాపతి కయినా ఇస్తానని ఆమె అంటే నివారించాడు. ఎవరికేమివ్వాలో తెలిసివాడు – కనుక.

❀ ❀ ❀

## ఈ యుగ విశిష్టత

మనం నివసిస్తున్న యుగం చాలా అద్భుతమైనది. స్వామి యుక్తేశ్వరులన్నారు. – (పరమహంస యోగానంద గురువు) ఇది ద్వాపర యుగం ప్రారంభము. ఏనాడు అణుశక్తి మహత్తు మనిషి కనిపెట్టినాడో ఆనాడే ఈ యుగం ప్రారంభం జరిగినది. – అని. దీని కుదాహరణగా ఈ 19–20 శతాబ్దుల నడుమ ఎంతమంది మహాత్ములు – మహాశక్తి విభూతులు – అవచారాలు వచ్చినవో చూస్తే తెలుస్తుంది.

శ్రీ రామకృష్ణ పరమహంస – 1836 –1886
శ్రీ వివేకానందస్వామీజీ – 1863 – 1902
శ్రీ శిరిడీబాబా – 1838 – 1918
శ్రీ అరవింద మహాయోగి – 1872 – 1950
శ్రీ రమణ మహర్షి – 1879 – 1950

ఎక్కడ పాశ్చాత్య నాగరికత ఈ దేశంలో పాదం మోపినదో అదే గడ్డ పైన దానిని సమూలంగా విధ్వంసం చేసే మహాశక్తి శ్రీ రామకృష్ణపరమహంసగా అవతరించినది. ఆయన పూరించిన పాంచజన్య శంభారావమే స్వామి వివేకానందగా విశ్వమంతా కుదిపివేసినది. సనాతన వైదిక ధర్మస్వరూపం – లోకానికి తెలిసినది.

అదే సమయంలో శిరిడిబాబా వచ్చాడు.

భగవాన్ రమణులు – ఆత్మదర్శనానుభవము పొందిన తేదీ అప్పటికి శిరిడీలో బాబా తన అవతారకార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు.

ఈ యుగ ప్రత్యేకతను గురించి వ్రాస్తూ – ఆర్థర్ ఓస్‌బోర్న్ "ఎవరు శిరిడిబాబాను గురించి నమ్మశక్యంకాని (యోగవిభూతులున్న) శిరిడి బాబా అన్న గ్రంథమును వ్రాసాడో ఆయనే శ్రీ రమణమహర్శి చరిత్ర కూడా వ్రాసాడు". అన్నాడు.

"శ్రీరామకృష్ణపరమహంసతో ప్రారంభమైన వర్ణమతవ్యవస్థాతిశయమైన ఆత్మాన్వేషణ – ధ్యాన, యోగాదులు విశ్వమంతా వ్యాపించినదో ఈ ఉద్యమం రమణమహర్షితో పరాకాష్ఠ చెందినది.

మంత్ర దిక్షాదులతో, జపతపాదులతో అవసరం లేకుండా ప్రతివ్యక్తి జాతి,

మత, వివక్ష లేకుండా పాశ్చాత్యులను సైతం తన ఒడిలో చేర్చుకొని జోలపాడినదో ఆ యథార్థ మతోద్యమం వీరితోనే లోకవ్యాప్తి చెందినది. లోకమంతా తరిస్తున్నది" – అని.

వీరెవ్వరూ ఒక మతాన్ని స్థాపించటానికి రాలేదు. వీరే అన్నారు – సాధకునకు తోడ్పడడము కోసము వచ్చాము తప్ప – మతస్థాపన కోసం కాదు' – అని.

మణిసాకుకర్ తన సాయిబాబా అన్న గ్రంథములో వ్రాసాడు – 'బాబా అనేకసార్లు అన్నాడు. నేనే బోధించటానికి రాలేదు. నిద్ర మేల్కొలపటానికి వచ్చాను తప్పు. దీనినాయన తన అనంత ప్రేమ నుండి సాధించాడు. శతాబ్దాల తరబడి శతాధిక వేదాంత గ్రంథాలు వచ్చినా, చదివినా సాధన పూణ్యమై పోయినది. కనుక బాబా మామూలు భాషలో అతి సాధారణ వ్యక్తికీ, అర్థమయ్యేటట్లుగా – సాధనామగ్నులయ్యే విధానాలు బోధించాడు – అని. ('శిరిడి సాయిబాబా – ఒక విశిష్ట యోగి' – అన్న ఆంగ్ల గ్రంథంలోని పంక్తులకిది అనువాదము.)

శ్రీఅరవింద యోగిని గురించి – జనని – ఇలాగే అన్నది.

సకల మానవ జాతిని 'దరిద్ర నారాయణు'లను గురించి ప్రత్యేకించి కన్నీరు కార్చి, సమాజ పునర్ధురణ కోసం తపించిన స్వామీ వివేకానంద లాగానే బాబా కూడా తపించాడు.

ఒక వ్రేపల్లె వంటి పల్లెను మధురానగరంగా పరిణమింప చేసాడు బాబా. ఆయన శరీరంతో వున్న రోజుల్లో శిరిడీలో 400 ఇళ్లు, 2వేలమందికి పైగా జనాభా – విధులు లేవు. 2,3 అంగళ్ళున్నాయి. ఒక మరాఠీ బడి. ఏవిధమైన సౌకర్యాలు లేని కుగ్రామము. అన్ని గ్రామాల్లాగానే. అలాటి శిరిడి ఇవ్వాళ ఎలా వున్నదో చూస్తే తెలుస్తుంది. నయనానందకరంగా తిరుమల వైభవంలాగా – భూలోకవైకుంఠం చేసాడా తండ్రి.

శిరిడి నుండి కూడా ఒక మార్గమున్నదన్నాడు బాబా – ఆ మార్గమే –

1. గురురుపాయః : గురువే యోగసాధన

2. ఊగేమూగే : నీవు నిశ్చింతగా కూర్చో. అంతా నేనే చేస్తాను. రమణమహర్షి కూడా అన్నారు – 'సుమ్మా అరుప్పు... నిశ్చలంగా – ఏ చీకూ, చింతా లేక నీలో వుండు. సహజంగా బ్రతుకు – అని.

గురుః ఉపాయః– అంటే బాబాయే స్వయంగా గురువునన్వేషించిన కథ – గురువే సర్వస్వం – అన్న విషయం రెండు చోట్ల చెప్పాడు. రాధాబాయిదేశ్‌ముఖ్ – కథలో గురువంటే ఏమిటో చెప్పాడు. ఆయననెలా సేవించాలో చెప్పాడు.

'నా నుండి నా గురువు శ్రద్ధా – సబూరీలు మాత్రమే కోరినాడు. వారు ప్రేమమయ దృష్టితో చూచిన చూపే నాకు మార్గదర్శకమైనది. వారు నా చెవిలో ఏమంత్రమూ ఊదలేదు. నీ సర్వస్వము గురువునకే సమర్పించు. రేయింబవళ్ళు వారిని చూస్తూ వుండేవాడను. నా సర్వేంద్రియాలూ నా నేత్రాల్లో లీనమైనవి. వాటితో వారినే చూస్తూ వుండేవాడను. అదే నాకు శాంతినిచ్చినది. గురువే సర్వస్వం' ఇది సారంశం. ఇది దభోల్కరు శ్యామాకు చెప్పినది. దీనిని గురించి బాబా చెప్పిన విషయం – 'ఈ ఒక్క కథను జాగ్రత్తగా మననం చేయి. ఆత్మసాక్షాత్కారానికి ధ్యానమవసరం. దానివల్ల వృత్తులు శమిస్తవి. నిష్కామివై సమస్త జీవరాసుల్లో నున్న భగవంతుని ధ్యానించు (18–19 అధ్యాయాలు సచ్చరిత్ర)

32వ అధ్యాయములో గురువు నన్వేసించిన కథ చెప్పబడినది. అందులోనూ గురువునెలా సేవించాలో బాబా చెప్పాడు – 'వారి ప్రతిబింబము నా కన్నుల్లో లేకపోతే నాకు కన్నులు లేకపోవటమే మంచిదనిపించేది. వారినే చూస్తూ వుండేవాడిని. నాగురువే నాకు సమస్తం' – ఇలా సాగింది.

రెండు చోట్ల – గురువునెలా సేవించాలో చెప్పటం మనకు భోధ. బాబానెలా పేవించాలో చెప్పటమే కదా.

నాది చెవికొరికే సంప్రదాయం కాదని బాబా చెప్పినందున మంత్రోభోధ లేదు. ఈ యుగంలో వచ్చిన మహాత్ములెవరూ దానిని పట్టించుకొన్నట్లు కనిపించదు. అంతా – ఆత్మాన్వేషణ. ఆత్మశరణాగతి. గురుశరణాగతినే చెప్పారు. ఆ గురువు ఆత్మ కావచ్చు. అమ్మ కావచ్చు.

ఇదే గురురుపాయః అంటే – దీనినే బాబా నానా చందోర్కరుతో గీతాశ్లోక వివరణలో ప్రణిపాతంగా చెప్పాడు.

'తత్విద్ధి ప్రణిపాతేన' – పరిప్రశ్నేన సేవయా' అన్న దగ్గర

దీనినే జాగ్రత్తగా మననం చేయమన్నాడు బాబా. తన చరిత్ర వ్రాసిన దభోల్కరుతో

ఈ రాధాబాయిదేశ్ముఖ్తో చెప్పిన కథను విన్నాక బాబా – దభోల్కరుతో అన్నాడట.

'ఈ కథను ధ్యానించు, మననం చేయి నిధి ధ్యాసనం చేయి.

భగవంతుడు ప్రత్యక్షమౌతాడు' అని కథాతాత్పర్యము చెప్పటం నొక్కి చెప్పటములో బాబా మనకు బోధిస్తున్న అంశాలు.

1. చెవి కొరికే సంప్రదాయం కాదు.

2. గురువు – దైవం – ఆత్మ (రమణమహర్షి మాట)

1. న్యాయస్థానాధికారితో బాబా తనది కబీరు మతమన్నాడు కదా మతమంటేనే సంప్రదాయం. కబీరన్నాడట. –

'కాన్ పంకా గురు హాద్కా బెహాద్ గురుజౌర్ బెహాద్ కా గురు జబ్ మిల్ లహైఫికానాథీర్'–

"చెవిలో ఊదే గురువు చాలా స్వల్పంగా భోధిస్తాడు. అనంతాన్ని భోధించే గురువు వేరు. అలాంటి గురువు పరమాత్మానుభవం కలవాడు. వానిద్వారా నీకు ఆ అనుభవం కలుగుతుంది". ఇదే బాబా నాది కబీరు మతమన్నది.

2. ఊగేమూగే = సుమ్మా అరుప్పదు

భగవాన్ రమణులు ఆత్మవిచారణ మార్గం చెబుతూ ఇంకొక మార్గం చెప్పేవారట–

'నీలో నీవు సహజంగా వుంటే చాలు గదా' ఏమార్గమో ఎందుకు అని

సమాజమార్గమంటే – ఇంద్రియాల ద్వారా మనస్సును బైటకు పోనివ్వకుండా

– నీలోనే వుండటము – ఇదే ఊగేమూగే.

ఇది గురు సన్నిధానములో తేలికగా లభింస్తుందని బాబా ఆ కథ ద్వారా లోకానికి చేసిన బోధ – దీనినే 'కాశ్మీరశైవం' – అనుపాయమన్నది. వారు మూడు ఉపాయములు – సాధనములు చెప్పారు.

3. అణవోపాయం – నేను శరీరము అనుకోవటం సహజము కనుక దీనినుండి విడిపోయే ఉపాయం – నేను స్వతంత్రుడనన్న భావన.

2. నేను మనస్సును – అనుకోవటం నుండి విడిపోయే అపాయం శాక్తోపాయం – నేను శక్తి స్వరూపుడనని భావించటము మనస్సాధన.

1. శాంభవోపాయం –2. శాక్తోపాయం – 3. అణవోపాయములని.

1. శాంభవోపాయమంటే అణవోపాయంలో నేను శరీరాన్ని కాదు అన్న భావన ద్వారా దృఢతరం చేయటం. ఇది 3వ దానికి విరుద్ధం. జగత్తును శివమయంగా భావించటం – దీనినే శివదృష్టిలో ఇలా చెప్పాడు కర్త సోమానందుడు.

❀ ❀ ❀

# ఏకః – అవర్ణః 4

**“అస్మద్రూప సమావిష్టః స్వాత్మనివారణే**
**శివః కరోతు నిజయానమః శక్త్యాతత్మనే” –**

ఇది శివదృష్టిలోని ప్రథమశ్లోకము

శివుడే సకల జగద్రూపంలో భాసిస్తున్నాడు. సమస్కరించేవాడు (గ్రంథకర్త) సంస్కారం దానికి సాధనములైన వాక్కు, మనస్సు మొ॥వి. నమస్కారముతో తొలిగిపోయే విఘ్నాలు – నమస్కరించాలన్న ఇచ్ఛాశక్తి – అన్నీ శివస్వరూపాలే. అలా అంతటా వ్యాపించిన శివునకు (ఆత్మకు) నమస్కరించుగాక – అని భావం.

నమస్కరించేవాడు – నమస్కారం –లక్ష్యభూతమైన శివుడు – విఘ్నాలు – నమస్కారం చేయాలన్న సంకల్పం అన్నీ శివమయమే.

**అనుపాయం**

ఇవేమి లేకుండా – నీలో నీవుండటం – ఏదీ చేయనక్కర్లేదు – బాబా అన్నాడు కదా “నీకేం తెలుసునని చేస్తావు. నీవు నిర్లిప్తంగా వుఇఁడు. నీ మనస్సును నాకివ్వు – నేను సర్వం చేస్తాను” – ఇదే గురు శరణాగతి ఇదే బాబా తన గురువును సేవించిన పద్ధతిగా చెప్పాడు.

‘నే నూరికే వారిని చూస్తూ వుండేవాడిని. సర్వం దానంతట సిద్ధించినది’ అని రాధాబాయితో చెప్పిన కథలోని మాట.

దీనినే ఈ కాలంలో ఒక భక్తుడు శంకరానందుడన్న పాశ్చాత్యుడు – తన గురువైన ముక్తానందుని సన్నిధిలో పొందినట్లు ఇలా వ్రాసాడు.

‘నేను గురువుల ఆశ్రమంలో – బాబా (ముక్తానందులు) నూరికే చూస్తూండేవాడని. ఆయన చేసే ప్రతి సాధారణ చేష్టను గమనించేవాడిని. ఆ చేష్టలో దివ్యత్వముండేది. ఆయన వ్యక్తిగా కాక ఆత్మస్వరూపునిగా గోచరించటము గమనించాను. అందుకే ఆ చేష్టలు సామాన్యమైనవైనా అవి దివ్యకర్మలుగా తోచేవి.

ఇది గమనించటమే సాధనగా వుండేది నాకు – ఆ నిమజ్జనానుభవం వాక్కుల కందనిది. అనుపాయమంటే సాధన కాదు. సిద్ధాంతము కాదు. గురువుల దివ్య కాంతి పరివేషములో మునిగిపోవటము" –

ఇదే గురురుపాయః – అని శివసూత్రాల్లో చెప్పబడినది.

దాని వాఖ్యలో క్షేమరాజన్నాడు

'గురుర్యా పరమేశ్వరీ అనుగ్రహికా శక్తిః – అని అంటే పరమేశ్వరు అనుగ్రహశక్తియే గురువని. ఇదే శక్తిపాతమంటే ముక్తానందస్వామీ సన్నిధిలో భక్తులు కానివారికి కూడా కుండలినీ జాగృతి కలిగేదట – దీనిని గురించి శ్రీమదభినవులన్నారు – 'నిత్యమూ దగ్గరలో నీలో వున్న దానిని పొందటం లేదు – తెలుసుకోవటం లేదు. అది స్వయంప్రకాశం కనుక. దానిన అన్వేషించటము లేదు. దానిని మూసినదేదీ లేదు కనుక. దానిలో ప్రవేశించటము, మునగటమూ లేదు. దాని నుండి ఏదీ వేరుగా లేదు కనుక – నీవు అందులోనే వున్నావు కనుక. దీనినే రమణులన్నారు. సముద్రములో చేప దాహం కోసరము నీటిని వెతుక్కోవటము.

**పై వాక్యాలకు మూలం – తంత్రాలోకంలోని గుప్తపాదుల మాటలివి –**

1. **న స్వరూపలాభో నిత్యత్వాత్ – న జ్ఞాపితః స్వయం ప్రకాశత్వాత్ – న ఆవరణ విగమః – ఆవరణస్య కస్యచిత్ అపి, అసశ్రీభవాత్ –**

(కాశ్మీర శైవం – కమలాకర మిశ్ర పుట – 340)

అప్పుడు ప్రపంచమే యోగలక్ష్యమౌతుంది.

'అక్కడ బాధ ఆనందమౌతుంది. విషం అమృతమౌతుంది. ప్రపంచమే ముక్తి కనుక – అదే శంకర మార్గమని – ఉత్పలదేవులు తమ స్తోత్రంలో అన్నారట.

విజ్ఞాన భైరవమన్న తంత్ర గ్రంథములో చెప్పబడినది.

1. ప్రత్యంగుళమూ శివమయమే. ప్రతి సామన్య వ్యక్తి అనుభవంలో వున్నది. అతను లేనిదేమీ లేదిక్కడ.

**'సర్వత్ర భైరవో భావః సామాన్యేష్వపి గోచరః**
**నచ తద్వ్యతిరేకేణ పరోస్తీతి అద్వయా గతిః'–99.**

ప్రతివ్యక్తిలోనున్న నేనే శివుడు – కనుక ప్రత్యేక ధ్యానము లేదు. ఆనేను ఎవరు? – అన్న విచారణ మార్గమే శ్రీరమణులు చెప్పినది.

కనుక 'ధ్యానం – ఆత్మచర్చ – ఏకాగ్రత' మంత్ర జపాదులు లేవు. ప్రయత్నం లేదు. సాధన లేదు. దేనిని త్యజించటమూ లేదు. అంగీకరించటమూ లేదు. నీవు నీవుగా వుంటూ ప్రతీదీ ఆస్వాదించు. ఆనందంగా వుండు. ప్రతీదీ – ప్రతి దానిలోనూ పరమశివుడున్నాడు' – అని శ్రీగుప్తపాదులన్నారని శ్రీశంకరానంద అంటున్నాడు.

ఈ బావన నుండి విడిపోయి నేనొక ప్రత్యేక జీవిని అనుకోవటమెంత ఇంద్రజాలం, అదే నేను అంటే – నది సాగరంలో కలిసిపోక విడిగా వుంటే నది. కలిసిన పిదప అది సాగరం. కనుక అహం భావన ఆత్మసాగరం నుండి వేరు చేసే గట్టు. దానిని తెగగొట్టటమే సాగరంలో కలియటం.

విజ్ఞాన భైరవంలో 110వ ధారణగా చెప్పబడినది.

**'నమే బంధో, వ మోక్షోమే – భీతాస్యైతా విభీషికాః**

**ప్రతిబింబ మిదం బుద్ధేః జలేష్వివ వివస్వతః'–**

నాకు బంధమూ లేదు. ముక్తీ లేదు. ఆత్మవేత్తలు కానివారికివి భయహేతువులు. ఇదో అజ్ఞానం. ఈ విశ్వమంతా బుద్ధిలో ప్రతిబింబము – వీళ్ళలో సూర్యబింహములాగా –

ఈ బంధమోక్షాదులు యథార్థ వస్తువులు కాదు మనోవృత్తులు మాత్రమే.

(ఈ పై విషయమంతా – శంకరానందుల గ్రంథం కాశ్మీర శైవయోగమన్న గ్రంథంలోని అనుపాయమ'న్న అధ్యాయ సారాంశము)

నేననుకోవటం తప్ప అక్కడేమీలేదు. ఈశావ్యాస్య ఉపనిష్యత్తును – దాసగణుకు, పనిపిల్ల చేష్టలద్వారా బోధించటం గుర్తుకు తెచ్చుకోవాలి.

శ్రీరమణులు అన్నారు – ఒక పసివాడు – తన నీడను పట్టుకోవటానికి ప్రయత్నం చేసినట్లు నీ అయథార్థ ఆలోచనలు, అహంకారము నిన్ను బంధిస్తున్నదని. నేను వేరు కాదనుకోవటమే – సర్వమూ శివమయంగా ధ్యానించటమే – గురుమయంగా దర్శించటమే – ఈ అనుపాయ సారాంశము.

ఇందుకే బాబా ఆ కథనంతగా వాఖ్యానించటము. నా మార్గము విచిత్రము అనటమూ దీనికే. ఈ ఒక్క కథనే భావించటం – 'గురురుపాయః'–

'ఊగే మూగే' రెండూ ఒక్కటే. గురుదర్శనంతో – భావనతో – నీ మనోవృత్తులుపశమించి, నీవొక వ్యక్తి గా మిగలకపోవటం – ఆనంద – ఆత్మ – నిమ్మజ్జనం – అదే 'ఊగేమూగే' – అదొక సాధన కాదు. అనుపాయం. గురుసన్నిధే శక్తిపాతం ద్వారా నిన్ను ముక్తుని చేస్తుంది.

ఇందుకే బాబా గాడ్గిల్ అన్న భక్తునితో అన్నాడట–

ఆయన "నాకేమైన మార్గం చెప్పు బాబా అంటే" – బాబా అన్నాడు "నేను చెప్పేదేమున్నది. నీలోపల అంతరాత్మ నిత్యం చెబుతున్నది. అది విను చాలు' అని.

ఆ ఆత్మలో నీవు మునుగు చాలు. నీవుండవు. నీస్థానంలో బాబా, శివుడు, రమణులు, గురువుంటాడు. ఆగురువు బైటనే వుండనక్కర్లేదు. నీ ఆత్మయే నీ గురువు' – అని భావము.

ఈ అనుపాయమైన సహజస్థితి ఒక జెన్ బౌద్ధాచార్యుడిలా కవితారూపంలో అందంగా వర్ణిస్తున్నాడు.

'వాసనా చిహ్నం లేశమైనా – మిగిలించకుండా
నా స్వభావాన్ని యథేచ్ఛగా ప్రవహింపనిస్తాను.
డబ్బాలో పది రోజులకు సరిపడ్డ బియ్యమున్నాయి.
పొయ్యిలోకి కావలసిన వంట చెఱకున్నది.
ఈ మాయ – నిర్వాణాల గోల నాకెందుకు
ప్రేమా అదృష్టాల ధూళి సోకకుండా
గుడిసెలో కాళ్ళు బార చాపుకొని
వర్షం చేసే నృత్యం సవ్వడి వింటూ
పడుకుంటా–

(రేకాన్ – అన్న మహాయోగి రచన)

దేనిని గురించి ఆరాటం లేదు. కావాలని లేదు. వద్దని లేదు. లోకంలోని

అందాలను యథాతథంగా ఆస్వాదించటం - బాబా నానా చందోర్కరుతో మహమ్మదీయ వనితాముఖం చూచి చలించినపుడన్నాడు -

"నానా ఎందుకు భయపడుతావు. కన్నులు వాటి పనిని వాటిని చేసుకోనివ్వు. భగవంతుడు సృష్టించిన అందాలను యథాతథంగా ఆస్వాదించటానికే ఆ నేత్రాలు సృష్టింపబడ్డాయి'' అనటంలో మనస్సును చలింపజేయకుండా ఆస్వాదించమంటున్నాడు. నాటకాలను చూచే ప్రేక్షకునిలాగా వుండాలి. లోకమంతా భగవంతుని నాటకమే.

(ఇక్కడ రసానికీ - యోగానుభవానికీ ముడి పెట్టాడు అభినవగుప్తపాదులు)

ఏదీ త్యాజ్యమూకాదు, భోజ్యమూ కాదన్నాడు గుప్త శ్రీపాదులు పై శ్లోకాల్లో-

'న త్యాగ, న పరిగ్రహ భజ సుఖం సర్వం యథావస్థితః'-

ఉన్నది ఉన్నట్లుగా ఆస్వాదించు. త్యాగం లేదు. భోగం లేదు. ఇదే పై జెన్‌యోగి చెప్పినది.

❀ ❀ ❀

# సాధన - మార్గం

లౌకిక వాంఛాలుబ్ధమైన మనస్సులో బాబా/దైవం నిలువదు - అన్న భావం భోధిస్తుంది. 16-17 అధ్యాయాల్లో (సచ్చరిత్ర). ఒక ధనికుడు బాబా దగ్గరకు వచ్చి - బ్రహ్మమును చూపించమని అడిగిన కథ - బాబా 5 రూ॥లు అప్పుగా ఆఫలానా వాడినడిగి తెమ్మన్నాడెవరినో పంపి - వాడు దొరకలేదని తిరిగి రావటం 2,3 సార్లు జరిగినా ఈ వర్తకుడు తన దగ్గర డబ్బున్నా ఇవ్వకపోవటం - అప్పుడు బాబా చేసిన భోధ అంతా కఠోపనిషత్తు విషయం. 'సచ్చరిత్ర'లో ఈ విషయం చాలా దీర్ఘంగా చెప్పబడినది.

బ్రహ్మపదార్థం అంగడిలో డబ్బుపెట్టి కొనుక్కోదగ్గది కాదు. అది వ్యాపారం చేసే వస్తువు కాదని - బాబా చాలా చోట్ల వర్తకులు నన్ను బాధించారన్నాడు.

చివరకు శరీర త్యాగం చేసినపుడు ఆ రాత్రి పండరీపురంలో వున్న దాసగణుకు స్వప్నంలో కన్పించి - నన్ను వర్తకులు పీడించారు - నేను శరీరాన్ని వదిలిపెట్టాను - నీవు రేపు వచ్చి ఆ శరీరానికి చాలినన్ని బంతిపూలు కప్పు - అని చెప్పటం - దాసగణు అలాగే చేయటం - తెలిసినదే -

ఈ వ్యక్తులు ఎవ్వరు?

ఈ వర్తకమంటే ఏమిటి? అంగటిలో బెల్లం కొనటం (డబ్బిచ్చి) లాంటిది కాదు. టెంకాయ ఇచ్చి దేవుడా నా కష్టాలు తీర్చు అన్నట్లు - కాదు నీవివ్వటం దాని కోసం కాదు. అదెలా లభ్యం - శ్రద్ధా - సబూరి వల్ల

## శ్రద్ధ - FAITH

అంటే విశ్వాసం - నమ్మకం కాదు.

చైనా భాషలో ఒక మహాయోగి - సో సాన్ అన్న పేరుగల మహాత్ముడు - వ్రాసిన గ్రంథము పేరు -

'The Book of faith'- శ్రద్ధాగ్రంథము లేదా ఉపనిషత్తు - ఇదంతా కేనోపనిషత్తులాగా ఉంటుంది కనుకే - అందులో దీని వ్యాఖ్యానం 'ఓషో' అన్న తంత్రయోగి చాలా

అద్భుతంగా చేసాడు. దాని సారాంశం.

మన భాషలో చెప్పుకొంటే ఇలా వుంటుంది (ఇది ఈ రచయిత భాష)

ఒకచోట శ్రీరామకృష్ణ పరమహంస అన్నాడు – నీవు గాలిలో తేలే ఆకులాగా బ్రతుకు' – అని అది ఎటు తీసుకుపోతే అటుపోవటం తప్ప నీ యిష్టానుసారంగా వెళ్ళటం కాదు. "అది గాలిపాటు పై ఆధారపడి వుంటుంది. కష్టాలు సుఖాలు – ఆనందము, దుఃఖము – ఏది వచ్చినా భగవదిచ్ఛానుసారంగా వస్తున్నాయి తప్ప అన్యం కాదన్న పరిపూర్ణ భక్తి భావంతో జీవించడం – ప్రవాహంలో తుంగ కాడ – నీరు వస్తే ఆనందంగా పెరుగుతుంది. ఎండలో ఎండిపోతుంది. – వరదలో వంగిపోతుంది. అది మనోరహితస్థితి – మనస్సు వాంఛా లుబ్ధం – పై కథలో ధనికుని వంటిది. నమ్మకం – విశ్వాసం నీవు మనస్సుతో కల్పించుకొనేది. "నిన్ను నమ్మాను – నాకేమి ఇవ్వలేదు లేదా నమ్మినందుకు ఇది ఇచ్చావు కృతజ్ఞుడను' – ఈ రెండు మనస్సే ఇదే బాబా సర్కారు కథలో 'అందరూ తే – తే – ఇవ్వు – ఇవ్వు – అంటున్నారు – నేనేమో తీసుకుపోండిరా – ఇది మీ తండ్రిసొత్తు – బండ్లతో తోలుకొనిపొండి – అంటున్నాను. నేనేమి చెబుతున్నానో ఎవరూ పట్టించుకోవటం లేదు" అని.

ఇదే దాసగణుపైన అన్న మాటలు వర్తకులు నన్ను బాధించారు – అందుకు శరీర త్యాగం చేయవలసి వచ్చినది. అంటే సర్వజీవుల హృదయగుహలో వ్యాప్తించాను అక్కడ నన్ను ప్రార్థించు – అడుగు అని అర్థము. శరీర త్యాగమంటే – అంతేకాని విసుగుదలతో చచ్చిపోయాను ఇంకెవరున్నారు మసీదులో అడగటానికి అని అర్థం కాదు.

దైవ నిర్ణయానికి బద్ధుడై బ్రతకటము – శ్రద్ధ. అంటే మనస్సులో సంకల్పించటం కాదు. మనస్సును లేకుండా చేసుకోవటము – తుంగకాడ లాగ.

గాలిలో ఆకులాగ ఇది ఎఱుక తప్ప విశ్వాసం కాదు. అనుభవం తప్ప – తెచ్చిపెట్టుకున్నది కాదు. కళలో నీవు సహజస్థితిలో ఏభావం లేకుండా వుంటే – సినిమా కథతో పాటు నీవు పోతున్నావు తప్ప – ఎదురు తిరిగి ప్రశ్నించటం

లేదు.మనస్సే లేని స్థితి కేవలం ఉనికి. సహజస్థితిలో ఉండటం. నీవు నీవుగా ఉండటం కావ్య పఠన దశలో – సినిమా చూసేటప్పుడు – నీవు శ్రోతవు, ప్రేక్షకుడవు మాత్రమే. శ్రవణం అంటే శ్రోత తన సర్వమైన మనస్సును చెవిలో లగ్నం చేయటం – ఇతర శరీరం స్తంభించి పోతుంది. ప్రేక్షణం అంటే – ఆ మనస్సును, ఇంద్రియాలన్నన్నింటినీ – కన్నుల్లో లగ్నం చేయటం – చుట్టూ ఏమి జరగుతున్నదీ తెలియనంతగా లగ్నం కావటం – ఇదే ఏకాగ్ర బుద్ధి – అంటే అనేకాగ్ర మనస్సుతో వ్యవహరించే రంగస్థలం నాటక రంగం –ఏకాగ్రబుద్ధి విషయం – ఇదే బాబా తన గురువు వృత్తాంతములో చెప్పినది.

'నా ఇంద్రియములన్నీ తమ తమ స్థానాలు విడిచి నా కన్నుల్లోనే కేంద్రీకృతములైనవి. నా ధ్యానమంతా నా గురువుపైన లగ్నం చేసాను. నాకింకొక స్పృహలేదు. నా బుద్ధి – మనస్సులు స్తబ్దమై పోయినవి" అని 32వ అధ్యాయంలో 'సచ్చరిత్ర'లో చెప్పబడినది. ఈ నిశ్చలస్థితినే 'ఊగే–మూగే' అన్నది బాబా. నీవు చేయటం కాదు – కర్మవల్ల దైవం చిక్కదు. ('నైష్కర్మ్య' సిద్ధి అన్న అద్వైత గ్రంథం చెప్పినట్లు) నీ ఆలోచనల వల్ల అది రాదు. నీవున్నంతవరకూ అది లేదు. నీవులేని స్థితిలోనే అది సంభవిస్తుంది.

ఏకాగ్రబుద్ధి – ఆలోచనలన్నీ అణగిన స్థితిలో మార్గం – దీపం వెలుగుతుంది. నేనన్నది లుప్తమైతే ప్రయత్నం లేదు. సందేహాలు – సమాధానాలు లేవు. అప్పుడే శ్రద్ధావిర్భావం జరుగుతుంది. దాని రాకతో అంతా సిద్ధిస్తుంది. బంధంలేదు, ముక్తి లేదు. ఇది ఆ శ్రద్ధా గ్రంథం చెప్పినది.

(అంతా నిస్తబ్దసాగరస్థితి – నిరుణమనీ, శూన్యమనీ దీన్నే అన్నారు)

దీనిని వివరిస్తూ ఓషో అన్నాడు – "ఇతర మతాలు మతమంటే ఇవి నిషిద్ధాలు ఇవి గ్రాహ్యములు. ఈ పని చేయి – అది వద్దన్నవి. ఉపనిషత్తులు కర్మ విషయం చెప్పలేదు. నీవెలా ఉండాలో ఆ ఉనికిని చెప్పినవి" అని అంటూ' శ్రద్ధ అంటే – అవిజ్ఞేయ అప్రమేయ తత్త్వోన్ముఖంగా జీవించటం – ప్రయాణించటం – నాకది ఇవ్వు – ఇది వద్దని డిమాండ్ చెయ్యటం కాదు. అప్పుడు జీవితమంతా

ఆనందమయమే.

అడిగేవాడు లేడు – ఇచ్చేవాడు లేడు – అంతా ఏకమై పోయిన స్థితిలో – రెండు లేని దశలో – శూన్య స్థితిలో ఎవ్వరున్నారు? – అంతా అనంతమే – పరిధులు లేవు – అంటే కదా. నేను – నీవు అనుకోవటం" అని.

ఇది గీతలో చెప్పినది. విశ్వచక్ర చలనంలో దానితో పాటుగా తిరుగు. నిన్ను నీవు / లుప్తం చేసుకో – అదే త్రిప్పుతుంది – అని.

ఇదే కఠోపనిషత్తులో – 'తం శ్రద్ధా అవివేశ' – అనబడినది. నచికేతునితో శ్రద్ధ ప్రవేశించినది. – అని. ఆయనకపుడు గురువు – యముడు – లభించాడు.

ఇదీ బాబా చెప్పిన శ్రద్ధభావం – నీవడగటం కాదు. అదే సంభవిస్తుంది. ఎదురు చూడటం నేర్చుకో. "సాహిత్యంలో, రాజస్థాన్ చిత్రకళలో – కృష్ణుని కోసం రాధ ఎదురు చూడటం, నాయకాగమనం కోసం – తనను తాను అలంకరించుకొని, ఇల్లునలంకరించి, ఆయనకోసం ఎదురు దారులు చూడటం – అందమైన బొమ్మలుగా వచ్చాయి. కావ్యంలో ఇదే విరహోత్కంఠిత, అభిసారిక, విప్రలబ్ధ –అది నాయికావస్థలుగా చెప్పారు. వర్ణించాడు. చివరకాయన వచ్చాడు. 'ఈమే స్వాధీనపతిక' ఐనది. ఆయన తన కౌగిట బందీ అయినాడు – అని శృంగార రసావతారం వర్ణించబడినది. ఆయన రాకపై – వచ్చేదారిపై చూపు నిలపటం – ఇదే రాధ అంటే గోపిక అంటే – ఆయన ప్రధానం తప్ప నేను కాదు. నేను లోపించి ఆయన కోసం ఎదురు చూడటం – నిరీక్షించటము – నిరీక్షణమే జీవనంగా బ్రతకటం. నిరీక్షణయే నాటకం చూచేవాని ఒక సంఘటన.

వడలూరు రామలింగస్వామి అన్న మహాత్ముని చరిత్రలోనిది – వారి సేవకుడొకరు – పురుషోత్తమరెడ్డియారన్నాయన (బాబాకు అబ్దుల్లా లాగా వుండేవాడట) స్వామీ అపుడు 'మెట్టుకుప్పం' (వడలూరు దగ్గర – ఇది చిదంబరం దగ్గర) తమ నివాసమైన 'సిద్ధి వళగం'లో ఉన్నారు. వారొకనాడు శివానందమగ్నులై సమాధిలో వున్నారు. సేవకుడు తన విధిని నిర్వహింటం – గది శుభ్రం చేయటం లాంటిది కోసం తలుపు తీసాడు. స్వామి అపుడే శివదర్శనానుభవమయమైన కనులు విప్పారట.

ఆ దృష్టి(శక్తిపాతం) జరిగిన వెంటనే ఆ సేవకుడు సమాధిమగ్నుడైనాడట. ఆ నిశ్చేష్టత చూచి ఇతరులు స్వామీకి విన్నవిస్తే – అలాగే వుండనివ్వండి – అతడే లేస్తాడన్నారట – ఆ సేవకుడు 4,5 రోజుల పాటు అదే స్థితిలో వుండి నిద్రలేచినట్లు లేచాడట.

కానీ ఆ సమాధిస్థితి ఆయకు 4, 5 నెలల పాటు అలాగే వుండిపోయినదట.

ఈ యనస్వామికి నిత్యసేవకుడు కనుక గురువులనడిగాడట ఎప్పుడో – అంతకుముందు 'స్వామీ! నాకేమైనా సాధన చెప్పండి' అని వారన్నారట. నీవు నాలాగే వినయవిధేయతలు కలవాడివే. నీకేదైనా యోగప్రక్రియ చెపితే దాని నుండి నీకు కొన్ని సిద్ధులు కలుగుతాయి. అందువల్ల నీకీ సహజమైన వినయం పోయి గర్వం కలుగుతుంది. కనుక వద్దు. ఒకటి అభ్యసించు. నీతోపాటుగా వున్న సకల జీవులనూ సమానంగా చూడు – అన్నారట. అదే సాధనగా ఇది నీలో ఇంకిపోతే సమతాభావం – సర్వేశ్వరుడు సిద్ధించినట్లేనని. ఆయన స్వామీ వారి కోసం వచ్చే పోయే వారికి – ధర్మశాలా నిర్వహాకుడుగా వుంటూ అతిథి. సపర్యలు చేసేవాడట. అందరకూ సమానంగా శ్రద్ధాభక్తులతో ఆధరిస్తూ ఆ సమతాదృష్టితో చేసే సపర్యలు ప్రేమతో చేయటము వల్ల ఆయన తరించాడు.

ధర్మశాల – భక్తులకన్నదానం చేసే చోటు.

సత్యజ్ఞానసభ – అరుళ్‌పెరుం జ్యోతి – చోటు

ఆ రెంటికీ ఆయన అంకితమైపోయినాడు. ఇదే గురుసేవ. (అబ్దుల్లా – మసీదు – చావడి – బాబా నడిచే దారులు శుభ్రం చేయటం క్ష దీపాలు వెల్గించటం – మసీదులో – నందాదీపానికి చమురు పోయటం లాగా)

తన కర్తవ్య నిమగ్నత – గురుసేవా నిమజ్జనం – శ్రద్ధ. అక్కడ తాను లేడు. గురువే దైవమై వున్నాడు. అతని కరుణా వీక్షణం కొసం తపించటమే – సేవ. నిత్యకృత్యం. ఆ సేవే – తపస్సు – యోగం – ఆనిరుకృపావీక్షణ కోసం – ఆనిరీక్షణలో తానన్నదెల్లా లయించటము.

రాయలవారు గోదానిరీక్షణ వర్ణనమిలా చేసాడు –

"రాత్రులు నిద్రపోకుండా దుఃఖిస్తూ, కారే కన్నీరు ఎగమీటుతూ వుంటే

ఆ నీరు వెలిగే దీపం మీద పడి చిటపట మ్రోగుతున్నవి. నిట్టూర్పులూ విడుస్తూ వుంటే పొట్ట ఎగసిపడుతూ వున్నది. ఎవరైనా ఏమైనా అడిగితే – మనస్సు స్వామిపై లగ్నమౌతున్నది కనుక – అదిరిపాటుతో గద్గదస్వరంతో సమాధానం చెబుతున్నది. స్త్రీజన్మను దూషించుకొంటూ వున్నది. (స్త్రీగా పుట్టటం వల్ల కదా నాకీ విరహమనీ) నిద్రరాక పాన్పు మీద పొర్లాడుతున్నది" అని ఈ విధంగా చేసిన వర్ణనలో – నిరీక్షణ – విరహం కలిగే దు:ఖమే చెప్పబడినది. ఇదే తపస్సు. ఇంతకంటే తపస్సేముంటుందని భగవంతుడే ఆ తండ్రితో అన్నట్లు రాయలు వారు వ్రాయటం – ఒకసారి గురువులు శ్రీ కందుకూరు శివానందమూర్తిగారన్నారు. మీరంత యోగసాధన ఎలా చేసారన్న భక్తునికి సమాధానంగా – నిద్రలో చేసానని – ఈ నిద్ర. ఈ గోదాదేని నిద్ర. లోకంలో నిద్రపోయి. భగవంతునిలో మేల్కోవటం.

* * *

# సాధనలు
# పంచయజ్ఞములు

మన గృహస్థధర్మాలు మనుస్మృతి చెప్పినది. అదీ భారతాది మహా పురాణాల్లోనూ ఇతరాత్రా చెప్పబడినది. ఆ ఐదు యజ్ఞాల విషయము సచ్చరిత్రకారుడూ చెప్పాడు.

పంచసూనములంటారు. మనం చేసే పనుల వల్ల అనేక జీవరాసులు మరణింస్తాయి కనుక పాపనివారణార్థం పంచయజ్ఞాలు చేయాలి – అని

సచ్చరిత్ర – 9వ అధ్యాయము

1. బ్రహ్మయజ్ఞము 2. దేవయజ్ఞము 3. పితృయజ్ఞము 4. నరయజ్ఞము 5. భూతయజ్ఞము.

1. ఇది వేదం చదవటం చెప్పటం. ఆచరించటము. వేదమంటే విద్య. చదివినవాడు ఆచరించి పదిమందికి చెప్పటము. ఆచరణలేని బోధ వ్యర్థము. విన్నవాడు తరించాలంటే నీవాచరించి అనుభవించి ఇతరులనూ ఆచరించమనటం.

బెల్గాం నుండి ఒక భక్తుడు వచ్చాడు. అక్కడొక గురువు నిశ్చలదాసు 'విచార సంగ్రహం' చెబుతున్నాడు. విన్న ఆ భక్తునితో అన్నాడట. నీవు ఉద్యోగ విషయంగా ఉత్తరదేశము వెళ్తావు. అక్కడొక మహాత్ముడు నీకు గురువు కాగలడు' అని ఈయన వచ్చి బాబాను దర్శిస్తే పుస్తకపఠనం వ్యర్థము – అది మార్గము చూపించేది తప్ప గమ్యం చేర్చదు. గురుకారుణ్యంతో ఆచరణలోకి చదివిన చదువును పరిణమింప చేసుకోవాలి – అని బోధించాడు.

ఇది పండితులకు చెప్పిన మాట – వారు చదువుకొన్నారని గర్విస్తారు. తప్పుని చెప్పటమే ఆచరణలో లేని చదువు బోధించరాదని భావము.

ఇలాంటి కథలు సచ్చరిత్రలో వున్నాయి. అన్వయించుకోవాలి.

## దైవయజ్ఞం

గృహములో దేవతలనారాధించాలి. ఇలవేల్పును పస్తులుంచరాదు. నిత్యారాధనతో – నైవేద్య సమర్పణ చేయాలి. దానితో దేవతలు సంతోషించి, మనకు కావలసినవి అనుగ్రహిస్తారు. పాపక్షాళనం ద్వారా ఉత్తమగతిని కల్పిస్తారు. దీనికి సంబందిచిన కథ – అక్కల్ కోట మహారాజు భక్తుడు 9 అధ్యాయంలో (సచ్చరిత్ర) తార్ఖాడ్ కుటుంబకథలో దైవపూజ విషయం చెప్పబడినది. తల్లీ, కొడుకులు శిరిడీ పోతూ తండ్రికి బాబా దైవపూజనప్పగిస్తారు. ఆయన ఒకరోజు చేసి మర్నాడు మర్చిపోతే బాబా మసీదులో తల్లీ, కొడుకులతో అన్నాడు.

'తల్లీ' మీయింటికి బాంద్రా వెళ్లాను. ఏమైనా తినాలని. కానీ అక్కడేమీలేదు' – అని.

ఇది ఇలవేల్పునకు నైవేద్యము పెట్టటము – దైవయజ్ఞ విధానంగా చెప్పటమే. నేనొకసారి మా గురువుగారినడిగాను. "నైవేద్యం పెడితే పదార్థాలలాగే వుంటున్నాయి. దేవతలు తినటం లేదు కదా'' – అని – వారన్నారు. 'పదార్థములో సూక్ష్మద్రవ్యముంటుంది. అది తేజస్సు. దానిని వారారగిస్తారు – అని. మా యింట్లో అమ్మ వారికి నైవేద్యం పెట్టటం గ్లాసుతో నీరో – పాలో పెట్టటముంటుంది. అది తల్లి స్వీకరించిన చిహ్నాలున్నాయి. భక్తులకిది తెలుసు.

మరొక కథలో – ఒక భక్తునితో అన్నాడు బాబా నీ గృహదేవతలకు నైవేద్యం పెట్టకుండా మాడుస్తున్నావు తప్పని చెప్పటానికే నిన్నిక్కడకు పిలిపించుకొన్నానని –

గీతలో చెప్పాడు భగవంతుడు –

**'దేవాన్ భావయతానేన తద్దేవా భావయంతు వః।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ॥**

యజ్ఞం చేసి దేవతలను తృప్తి పరచండి. వారు మిమ్మల్ని సంతోషపెడ్తారు. ఈ పరస్పర స్నేహంతో, భక్తితో పరమును పొందగలరు.

విశ్వభ్రమణం సంక్రమంగా జరిగే విధానంగా చెప్పబడినది.

కరువు కాటకాలు వస్తే – వర్షాభావంతో కానీ ఇతర కారణాలవల్ల కానీ (నేటి వాతావరణ కాలుష్యం లాంటివి)

పూర్వకాలంలో రాజులు ఈ పనులు చేసేవారు. దానికిది నివారణోపాయంగా రాయల వారు తమ రాజనీతిలో ఇలా అన్నారు. ఈ ధర్మచక్ర భ్రమణం. సక్రమ విశ్వరథభ్రమణాన్ని గురించి ఒక పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రవేత్త వివరించి – ఇది చాలా అద్భుత విషయమన్నాడు.

యజ్ఞమంటే గీతలో అనేక రకాలుగా చెప్పాడు భగవంతుడు. "సర్వజీవకారుణ్యంతో చేసే ప్రతీ పని యజ్ఞమే"నని –

దైవానికి నైవేద్యమెలా పెట్టాలో కూడా బాబా చెప్పాడు. హేమద్పంతు కోటుకు సెనగలతుక్కొన్న విషయం తానే కల్పించి చేసిన బోధలో – (చూ. 24వ అధ్యాయము)

"నీవేది తింటున్నావో, ప్రక్కవాడికి ప్రేమతో పెట్టు. ఎవరూ లేకపోతే నీలో వున్న నాకు కర్పించి తిను" అని అంటే నీవెలా తినాలో చెబుతున్నాడు తండ్రిగా బాబా.

నాలోని వైశ్వానరాగ్ని – జఠరాగ్నిగా తానే తింటున్నాడు. ఇది మనకు తెలిసి జరగటము లేదు. కనుక ఆ దృష్టితో తిను. ఇది నైవేద్యరహస్యమని బోధ.

ఒకసారి రమణమహర్షి భక్తులతో అన్నారట – మిమ్ములను భోజనానికి ఆహ్వానించారు కదా! మరి నన్ను పిలువలేదే – అని మరలా వారే అన్నారట – ఐనా తినేది నేనేగా అని – అదే వైశ్వానరాగ్ని రూపంలోనున్న అన్నాదుడు. అన్నం తినేవాడైన అగ్ని. అతడే సృష్టికర్త, స్థితి లయాదులు నిర్వహిస్తున్నాడు. ఆ మహాగ్ని రూపమే మనం నేడు శిరిడిలో చూచే 'ధుని'. ఇదెందుకు బాబా అని ఒక భక్తుడడిగితే – "మీ పాపాలన్ని దహించటానికని జగత్పిత అన్నాడట" ?నందాదీపము' అదే.

## నరయజ్ఞము

## అతిథి అభ్యాగత సమారాధన

బాబాయే స్వయంగా అన్నం, పలావు వండి పెట్టేవాడని సచ్చరిత్ర చెప్పినది.

కదా. ఇది మనిషికి భోధ – నీవు ఇలాగే పెట్టాలి అని –

మనం సహజంగా అనుకుంటాము. బాబా వచ్చి మన యింట్లో భోజనం చేస్తే బాగుండునని కాని ఆవచ్చే – వచ్చిన అతిథీ బాబా అని అనుకోలేము.

దేవ్‌గారి ఉద్యాపనవ్రతం కథలో వచ్చిన అంశం చూచుకోవాలి.

ఆయన ఈ రోజు రమ్మని బాబాను ఆహ్వానించాడు. జోగ్ కాబోలు ఆవుత్తరం మసీదులో బాబాకు విన్పించాడు – ఆయన సమాధానం వ్రాయించాడు – అలాగే వస్తాను – నాతోపాటు ఇద్దరూ వస్తారని – వారు వచ్చారు. తిని వెళ్ళారు. దేవ్ – బాబాను నిందిస్తూ మరలా వ్రాసాడు – మాట తప్పినట్లు – ఆ ఈ కథ చివర బాబా అన్న మాటలు గుర్తించుకోదగ్గది.

'నన్ను పోల్చుకోలేనివాడు నన్నెందుకు ఆహ్వానించాలి. నాతోపాటు ఇద్దరూ వస్తారని చెప్పానుకదా. ముగ్గురము వచ్చాము కదా' – ఈ పోలిక సర్వమానువులు జీవులు – తానే ఎవరు వచ్చినా అతను బాబాగానే సత్కరించాలని చెప్పిన కథ.

అలాగే బాబా తర్వాత అంత మహాత్ముడైన ఉపాసనీ బాబా – ఎవరిని గురించి ఆయన శిష్యుడైన మెహర్బాబా – 'నా గురువు కరుణించిన ధూళికణం కూడా ముక్తి పొందుతుంది. – అని అన్నాడో అలాంటి ఉపాసనీ – బాబాను అతిథిగా ఆహ్వానించాడు. బాబా గొర్రెలకాపరిగా, కుక్కగా, మరొకరుగా మూడు రోజులు వరుసగా వెళ్ళాడు. ఈయన వారిని కసిరాడు. వారు అబ్రాహ్మణులు తన దగ్గరకు రాకూడదని – బాబా సరే – తాను వచ్చాను వచ్చినవారు తానేనని చెప్పటం జరిగినది. ఇందులో తాను వర్ణవ్యవస్థకు అతీతుడన్న విషయం.

అతనికి బోధ. బాబా అవర్ణం.

బాబా వర్ణాతీత దశలోని కేవలాత్మ అతడు బ్రాహ్మణుడు అతనిలోని జాత్యహంకారము పోగొట్టే పని చేసాడు బాబా ఆత్మ సర్వజీవుల్లో వుంటుందని – అతిథి అంటే మనిషే కానక్కర్లేదు. కాకబలి వేయించాలని. హేమత్పంతుతో తానే అన్నాడు కదా. సర్వజంతువులు తానే విశ్వమంతా తన శరీరమేననీ అన్నవాడు ఏ రూపంలో వచ్చినా తానే.

ఒకసారి రమణమహర్షి 'ఉడుతకు జీడిపప్పు తెమ్మన్నారు. ఆ ఉడుత తన తొడపై నున్నది. దాని ఆకలిని గమనించిన మహర్షి అలా అన్నాడు. వంటశాల నుండి అవి రాలేదు – వారన్నారట–

"ఓహో! ఇవాళ పండుగ కదా. మీకు పాయసంలోకవి కావాలి. వీరికి (ఉ డుతకు) – వారు సర్వజీవులను అలాగే పిలిచేవారట) అక్కర్లేదు. మీరు శరీరాలు చూచి వేరనుకుంటున్నారు. లోపలి ఆత్మను చూడటం లేదు అని. ఇదే బాబా అన్నది. తానింకా ఒకటి రెండు రోజుల్లో శరీరం త్యజించబోతూ – లక్ష్మీబాయితో తన ఆకలి విషయం చెప్పగా ఆమె రొట్టెలు తేవటం, బాబా కుక్కకు వేయటం చదువుతున్నాం. అక్కడ బాబా మాటలు నిత్యం మననం చేసుకోవాలి.

"అనవసరంగా విచారిస్తున్నావు లక్ష్మీ! కుక్క ఆకలి తీర్చటం నా ఆకలి తార్చటమే. ప్రాణాలు వేరైనా ఆత్మ ఒక్కటే. సర్వజీవులలో ఆకలి (జఠరాగ్ని – వైశ్వానరాగ్ని) ఒకటే. ఎవరైతే ఆకలితో ఉన్నవారికి భోజనం పెడతారో – వారు నాకు పెట్టినట్లే" ఇంతకంటే జీవకారుణ్యమేముంటుంది.

ఇందుకే 'శ్రీలీలాసమీధి'లో అతడు కరుణకు 'అపరతథాగతుండు'. ఆయన కరుణలో బుద్ధావతార మనబడినది. ఈ జంతువుల కథలు సచ్చరిత్రలో చాలా చోట్ల వస్తాయి. అదే భూతయజ్ఞం.

పులికథ – కుక్కలకథ – కప్పలకథ – అన్ని జంతు, జీవ, విశ్వ సమారాధనమే. జోగ్ భార్యతో బాబా అన్నాడు.

'ఈ రోజున ఒక గేదె నీయింటి ముందుకు వస్తుంది. దానికి బొబ్బట్లు, నేయిపూసి అర్పించు' – అని. ఆమె అలాగే చేసింది. అది తినగానే మరణిస్తే జోగు భార్య భయపడి బాబా దగ్గరకు వస్తుంది. ఆ తండ్రి అన్నాడట –

"భయం లేదు. దానికా కోర్కె వున్నది. అది తీరగానే మరణించింది. నీకేమి సంబంధం లేదు దాని మృతికి విచారించకు" అని. గేదెకు బొబ్బట్లు కోరిక ఏమిటో మరి? – సర్వాంతర్యామి బాబాకు తెలియాలి. సకలజీవరాసుల్లో వున్నవాడు కనుక.

## భూతయజ్ఞము

ఇక స్వామి వివేకానంద దరిద్రనారాయణుని ఆదరించమని ప్రపంచానికంతా బోధించాడు. విగ్రహానికి నైవేద్యం పెట్టాలి. మనిషిలోని, జంతువులోని దైవానికి నైవేద్యం పెట్టాలి. ఈ నర, భూత యజ్ఞ సమారాధన జాతిలో నేటికి వన భోజనాదుల రూపంలో, వృక్షారాధన రూపంలో నిలబడి వుండటం - ఎంత ఆశ్చర్యకరమైన విశ్వకారుణ్య వాదం, మనకు తెలిసినా, తెలియక పోయినా అది సత్య.

**"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః, పచామ్యన్నం చతుర్విధమ్"**

అన్న గీతా శ్లోకానికి కొత్త అర్థము చెప్పారు సద్గురు శ్రీకందుకూరు శివానందమూర్తిగారు - "ఇక్కడ మానవుల అన్నమే అనుకోకూడదు. భక్ష్య, భోజ్య, లేహ్య పానీయాదులు - సర్వ జీవరాసులకూ సమానవే. ఆ మహాగ్ని సర్వజీవరాసుల్లోనూ వున్నది" అన్న వాఖ్యానమూ దీనికి సంబంధించినదే.

ఈ దృష్టితో బాబా చెప్పిన ఈ మాటలు నిత్యం మననం చేసుకోదగ్గవి. 19అధ్యాయంలో చూచుకోవాలి. మన ప్రవర్తనను గూర్చి బాబా ఉపదేశమది. 'ఏ సంబంధము లేనిదే నీయింటి కెవరూ రారు. జంతువు వచ్చినప్పటికీ నిర్దాక్షిణ్యంగా తరినమి వేయద్దు. ఆదరంతో చూడు. దాహం గలవారికి నీరివ్వు. ఆకలితో వచ్చినవారికి ఆహారం పెట్టు. బట్టలు లేనివారికి బట్టలివ్వు. నీయింటి వసారా ఇతరులు కూర్చోవటానికి ఆశ్రయం కల్పిస్తే చాలు. భగవంతుడు నిస్సందేహముగా అనుగ్రహిస్తాడు. ఇచ్చే మనస్సు నీకు లేకపోతే మానివేయి. కానీ వారిని కసురుకోవద్దు, తరిమి వేయవద్దు.' 'ఈ అధ్యాయం చదువుకోవటం కాదు ఆచరణలో పెట్టాలి'- ఇంతకంటె భగవారాధన - ఆత్మారాధన - దైవదృషింట వేరే ఏమీ లేదు.

మనిషి సహజస్థితి ఇతరులపై నిందారోపణ - లోభాది గుణాలుండటము - ఇది మనోలక్షణం. అది నిత్యం అవతలి వారి గురించి వ్యతిరేకంగానే ఆలోచిస్తుంది. కనుక ఆధ్యాత్మిక సాధనకిది ఆటంకము.

మనిషి ఎలా ప్రవర్తించాలో చెప్పిన 19వ అధ్యాయం చివర్లో ఎవరో

మరొకరిని నిందిస్తూ వుంటే బాబా వానితో 'నీవల్ల అతనికి పాపక్షాళనం జరుగుతుంది. సబ్బుతో మురికిలాగా – ఆ పాపం నీకు వస్తుంది. దీనికోసం శిరిడీ రావాలి – అన్న భోధను గుర్తుంచుకోవటం చాలా మంచిది.

రమణమహర్షి అన్నారట–"నిన్ను నిందించే వాడు నీకు మిత్రుడు. ఎందుకంటే నీవంటే వానికి శరీరమే కదా– ఆ శరీరం ఆత్మస్వరూపుడవైన నీకు శత్రువు. నీ శత్రువును నిందించే శత్రువు నీకు మిత్రుడు కనుక వాడు నీకు మేలు చేస్తున్నాడు" – అని.

ఒక చోట బాబా అన్నాడు – "నిన్ను ద్వేషించే వారిని గురించి నీవేమీ అనవద్దు. నన్ను స్మరించు. ఇలా చేయక వానిని ద్వేషిస్తే నాకు సమ్మతం కాదు" – అని. ఈ మాటలు పై రమణుల మాటలొకటే.

తాత్పర్యమేమంటే అందరు అందరితో ప్రేమగా వ్యవహరించటం. దీనివల్ల సమాజం విశ్వమంతా శాంతిమయమౌతుంది. బ్రహ్మజ్ఞానం కోరి వచ్చిన ధనవంతుని కథ 16,17 అధ్యాయాల్లో వున్నది. బాబా చెప్పిన మాటలు – "నీవు లోభగుణం వదలనంతవరకూ బ్రహ్మజ్ఞానానికి యోగ్యుడవు కావు" అని.

కాబట్టి పరనింద – ధనాది లోభగుణాలు పై దానికి ప్రత్బంధకాలు. దైవసాధనకివి ఆటంకాలు.

వ్యక్తి తన మనస్సును క్షాళించుకోకుండా దైవానుగ్రహాన్ని అభిలషించటము వ్యర్థమని భావము.

తర్వాత అధ్యాయంలో 20లో ఈశావాస్య విషయం రాబోతున్నది.

అందులో మొదటి మంత్రం –

"ఎవరి ధనాన్ని ఆశించవద్దు. అయినా ఆ ధనమెవరిది?" –

(అంతా ఈశ్వరునిది తప్ప) అని ప్రారంభమై, చివరి మంత్రంలో శరీర త్యాగంచేసిన ధన్యాత్ముడు అగ్నిని ప్రార్థిస్తాడు –

'అగ్నే' సుపథారాయే' అని – అంటే

"ఓ అగ్నిదేవా! ఆత్మ ధనాన్ని పొందే దివ్యమార్గం చూపించు" – అని.

ఇది ముగింపు. లోకంలో ధనం కాదు. ధనమంటే దైవము, ధనము దానికోసం ప్రార్థించు.

దీనినే బాబా భక్తులతో అన్నది –

“ఈ అగ్ని మీ పాపాలను దహించటం కోసం, మీ లెక్కలన్నీ అల్లా కర్పించాలి. అనీ” అన్నాడు.

ఈ 16–17 అధ్యాయాల చివర బాబా వాక్కులు ఉపనిషత్ మంత్రతుల్యములు.

‘ఫలాపేక్షకల వాడు, విరక్తుడు కానివాడు ఆత్మజ్ఞానానికి అర్హుడుకాదు.

నా ఖజానా నిండుగా వుంది. కావలసినంత ఇవ్వగలను. కానీ వాని యోగ్యతను బట్టి–అని పైన చెప్పిన పరనింద వదలి – సర్వజీవకారుణ్యంతో అతిథి, అభ్యాగత సేవలతో దైవారాధన చేయటం వంటివి. దీనితో స్నానంతో శరీరం శుభ్రపడినట్లు – మనస్సు శుభ్రమై అహంకారం నశించిపోతుంది. ఈ నిరహంకార చిత్తవృత్తి ఏర్పాడటానికే ఈ యజ్ఞవిధానం కర్తవ్యమైనది. ప్రతివ్యక్తి ఆచరించవలసినదిదే.

సచ్చరిత్ర ఒక అమృత సరస్సు. వ్రాసినది మహానుభావుడు. అతని నిరహంకార చైతన్యము లోనికి బాబా ప్రవేశించి తన కథ తానే వ్రాసుకొన్నాడు. ఇందులో 16–17 అధ్యాయాలు సాధనకు చాలా తోడ్పడేవి, కనుక గొప్పవి.

## దైవయజ్ఞం

దైవమంటే ఏమిటి? ఎలా వుంటుంది? ఆరాధన అంటే ఏమిటి? దీని తాత్పర్యమేమంటే ఇది దైవ దైవం. ఇదవతారం! ఈ చిహ్నాలని బట్టి – కనుక ఆరాధించాలి. భక్తుని లక్షణాలేమిటి? అసలు సేవా విధానమేమిటి? నిత్యజీవితంలో ఎలా బ్రతకాలి? తన బ్రతుకు తాను బ్రతుకుతూ – భగవత్సేవ ఎలా చేయాలి? ఈ రెండింటికి లంకె ఎలాగు ఇవన్నీ సాధారణ వ్యక్తి ప్రశ్నలు, దిగినదాకా లోతుతెలియదు? ఒడ్డున వున్న వాని ప్రశ్నలివి?

❋ ❋ ❋

# ఆరామ – మహిమా – భ్రాంతి

“అంతా ఆయన ఆరామం చూస్తూ విస్తుపోతున్నారే తప్ప – ఆ యజమానిని ఎవరూ గుర్తించలేదు” అని బృహదారణ్యకోపనిష్యత్తులో ఒక మంత్రమున్నది. దీని కర్థమేమిటి?

ఆరామమంటే విశ్రాంతి స్థానం – ఉద్యానవనం – సౌధంఅంటే తాత్పర్యం – సృష్టి.

ఈశావ్యాసంలో ప్రథమ మంత్రమున్నది కదా–

‘ఈశావ్యాసమిదం స్వరం’ – ఇదంతా ఈశ్వరునకు ఆవాసం – నివాసం లేదా వస్త్రం. దిగంబరుడైన ఆ నిర్గుణునకిది అంబరం, వస్త్రం. ప్రతిపదార్థగతంగా – పైనా క్రిందా – ఆయన చైతన్యరూపంలో ఆవరించి అణుగతంగా స్థిరంగా వున్నాడు. కానీ జీవుడు ఇంద్రియలోలుడై విషయ భ్రాంతితో లోకానుభవం పొందుతున్నాడే తప్ప – అయ్యో! ఇదంతా నా తండ్రిది కదా అని ఆయనను స్మరించడం లేదు. ఇందుకే అదే మంత్రములో

“తేన త్యక్తేన భుంజీథ – మాగృధః కస్యచిద్ధనం”–

ఈ మాటలు వెంటనే పొదుగబడి వున్నాయి.

ఆయనను – ఆత్మను వదలి, అనుభవించవద్దు. ఆయన కర్పిస్తూ అనుభవించు.

‘మా గృధః కస్యచిద్ధనం’ – ఎవరి ధనాన్నీ స్వీకరించవద్దు. అంటే ఆయనను వదిలి – ఆయనది కాదన్నట్లు అనుభవించవద్దు. అయినా ఇదంతా ఎవరిదని అనుభవించటానికి?

ఇదే బాబా సచ్చరిత్ర వ్రాసిన కవితో అన్నది. “ఎవరూ లేనప్పుడు – ఎవరి కర్పించి తింటున్నావు? ఎవరైనా వుంటే సరే వారికిస్తున్నావు. ఎవరూ లేకపోతే ఏం చేస్తావు? నీలోపల నున్న నా కర్పిస్తున్నావా?” – అని ‘తేన త్యక్తేన భుంజీథా’ – ఇదే గీతలోనూ అన్నాడు. అలా తినేవాడు ‘అఘాయువు’ – నష్టప్రాణి అని.

ఎవరో మహమ్మదీయవనితాసౌందర్యం చూచి చలించినపుడు – జగన్నాథుడు అన్నాడు.

"నానా ఎందుకాయస పడుతున్నావు. కన్నులను వాటి పనిని వాటిని చేసుకోనివ్వు. సృష్టిలోని అందర్ని చూచి – కర్త చాతుర్యాన్ని స్తుతించటానికే భగవంతుడు సృష్టిని అందున్న అందాలనూ చూచే కన్నులనూ సృష్టించాడు. ఇంద్రియాస్వాదన చేయటంలో తప్పులేదు. కానీ ఆయనను గుర్తుంచుకో" 'తేన త్యక్తేన భుంజీథా' – అంటే భావమిది.

ఒక కళాస్వాదనలాగా – లోకానుభభవం పొందు. సృష్టి అంతా ఆ మహేశ్వరుని లీలానాటకం – నాట్యంగా అనుభవించు. కానీ దాన్ని చూస్తూ నిన్ను నీవు మరచిపోవద్దు–

అని ఈశావాస్యాన్ని పరమార్థాన్ని భోధించాడు ఆ తండ్రి.

ఈ సృష్టి ఆయన మహిమ. దీపం వెలుగులో మిర్మిట్లు గొలిపే దీపాన్ని మరచిపోవద్దు. ఆ వెలుగు ఎక్కడ నుండి వస్తుందో – ఎక్కడకు పోతున్నదో ఆదారి ఏమిటో – ఆలోచించి నడువు.

అపుడది మార్గదర్శకమౌతుందని భావం.

బాబా మహిమలే ఆ ఆరామం. ఆయనను మరచిపోయే ప్రమాదం కల్పిస్తాయి. వెలుగులు – మహిమలు.

దీనిని చెప్పే ఉదంతమే క్రిందిది.

దాసగణు మొదటిగా సాయిచరిత్రను వ్రాసినవాడు. ఆయన చాలా విచిత్ర శయ్యా వృత్తాంతాన్ని తాను చూచినది చూచినట్లు వ్రాసాడు.

'బాబా శయనించే విధానం విచిత్రం. జానెడు వెడల్పు నాల్గు మూరల పొడవున్న బల్లను మసీదు పట్టీలకు వ్రేలాడదీసి బల్ల నాలుగుమూలలా ప్రమిదల దీపాలు పెట్టి – దానిపై శయనించేవాడు. మసీదా పాడుబడి – గోడల వెచ్చులూడుతున్నాయి. వ్రేలాడదీసినది సన్నని గుడ్డ పీలికలు – దానిపైన పండుకోవటం – ఇది వింత చర్య కనుక రాత్రుల్లో జనం చూడటానికి విరగబడి రావటం వల్ల

బాబా ప్రశాంతికి భిన్నంకాగా దానిని విరిచి ధునిలో పారవేసాడు –

దాసగుణు చెప్పినదింతే. తర్వాత ఇంకా సచ్చరిత్ర కారుడు చెప్పిన వృత్తాంతమింకొకటి కలుపుకోవాలి దీనికి. చాలాకాలం గడచిపోయింది. బాబా ఆ బల్లను ప్రస్తావిస్తే దీక్షిత్తు అన్నాడు– మరలా చేయిస్తానని – విన్న బాబా అన్న మాటలు ఈ శయ్యా విధానంలోని యోగావస్థను – సమాధిస్థితిని వివరిస్తుంది. దీనికోసమే ఆవృత్తాంతము కల్పింపబడినది. బాబా మాటలు – మహల్సాపతిని క్రింద వదలి నేనే పైనెలా పండుకొనేది? – దీక్షిత్తు – ఆయనకూ ఒక బల్ల తెస్తాను – బాబా – వాడెలా పండుకోగలడు – నేను నిద్రించేటప్పుడు నా గుండె పై చేయిపెట్టి చప్పుడు విను. వాడు కునికిపాట్లు పడేవాడు. వెంటనే నాకు తెలిసేది. వాడి చెయ్యి బరువెక్కేది. అలాంటి వాడు పైన మేలుకొని ఎలా నిద్రించగలడు' – అని – దీనికోసం ఆ గోలంతా – జనం ఎగబడితే తప్పేముంది. దానినీయన విరగ్గొట్టి పారవేయడం దేనికీ? – మరల దానిని ప్రస్తావించటందేనికట!

అంటే ఒక మహా యోగి నిత్యం మన మధ్య మనతో వుంటూనే – తింటూ – నిద్రిస్తూ తాను తన పై స్థితిలో – ఆత్మస్థితిలో ఉండగలడని చెప్పటం కోసం.

మహాత్ములచర్యలకర్థాలు, ఆయన దయవల్ల తెలియాలే తప్ప భౌతిక మనస్సులకర్థంకాదు.

గుండెలసవ్వడి విషయం – వేరొక చోట చెప్పబడినది కదా 'ఆయన శరీరంలోని ప్రత్యణువూ, కణము' – అనాహతధ్వనిని విరజిమ్ముతూ వుండటం – నేను విన్నాను' – అని సాయిశరణానందులన్నారు.

పై సంఘటనలో 1వ అంశం – 2వ అంశం లేకపోతే వ్యర్థము. బాబా దయతో మనకా పరమార్థం చెప్పటానికీ దీక్షిత్తు దగ్గర దానిని ప్రస్తావించి వివరించాడు. ఉబుసుపోక కాదు. లేకపోతే అదొక గారడీ విద్యగా మిగిలిపోయేది. (స్వామి నరసింహస్వామీజీ – బాబా కథలు – TIMES OF INDIA – పత్రికలో ప్రకటిస్తే చదివిన వారన్నారు – ఇవన్నీ గారడీ విద్యలే కదా – అని స్వామీజీ అన్నారట మరి శ్రీకృష్ణుని లీలలకు అర్థమేమిటి? – అవన్నీ ఆయన సహజస్థితిని చెప్పేవి –

అని మరలా స్వామీజీ అన్నారట 'ఇవీ అంతేనని'–)

జనం మూగినంత వరకు మొదటి భాగం సంఘటనకు పోలినదొకటి శ్రీరాం అన్న మహాయోగి వ్రాసిన–

హిమాలయ యోగులన్న గ్రంథంలో వుంది. ఆయన బాబా వంటి మహాగురువును సేవిస్తూ హిమాలయాల్లో గంగ ఒడ్డున సాధన చేస్తూ వుండేవాడు. ఆహారం లేక సొమ్మసిల్లి పడిపోయాడట – ఒకనాడు. అంతలో గంగలో కెరటాలపైన ఒక బంగారు గాజులున్న దివ్యహస్తమొకటి పైకిలేచి బంగారం గిన్నెలో పాయసమిచ్చి – అదృశ్యమైనదట. ఆ గంగాదేవి అనుగ్రహరూపమైన పాయసం తిని, ఆయన ఆ గిన్నెనలా దాచిపెట్టుకుంటే – జనం దానికోసం రావటం మొదలు పెట్టారట. గురువు గారది చూచి

'రామా! దీనిని తిరిగి గంగామాతకే అప్పగించు' అంటే వారలాగే చేసారు.

ఇదే బృహదారణ్యకం చెప్పినది. అంతా అంచుల్ని చూస్తున్నారు. ఆయనను గమనించలేదంటే ఇదే. బాబా ఎవరో చూడకుండా ఆవించ చర్యను చూడటానికి వస్తే బాబా విరగ్గొట్టిన వైనానికర్థము.

బాబా మహిమలలో పడి కొట్టుకొని పోకుండా వాని జన్మస్థానం చూస్తూ ఆ మహిమలన్నీ వెలుగునకు గమ్యమేమిటో అన్వేషిస్తూ – తాను లోపించి ప్రయాణించటం –

క్షురస్య ధార – పంథా – ఇదే బాబా ఆ మార్గం క్లిష్టమంటూనే తనవైపు చూస్తూ పొమ్మన్నాడు. ఆ మార్గదర్శకం 'నందాదీపం' – మంత్రం బాబా నామం. యంత్రం బాబా పాదంగా ఆత్మనే ఉయ్యాలగా చేసి అక్కడ శయనించిన వటపత్రశాయిని ధ్యానిస్తావో – అన్వేషిస్తావో – యశోదవై జోలపాడుతావో, తటస్థంగా వుంటూ, ఊగేమూగే తపస్సు చేస్తావో, బాబా సంకల్పం, నీ యిష్టంగా మసలుకోవటమే కర్తవ్యం – అన్వేషణం – బాబా గురువుకోసం వెతకటము నాయికగా, గోపికగా – కృష్ణాన్వేషణం చేయటం – ఆ చేయటమన్న కర్మయే ధ్యానంగా పరిణమింప చేయించటమే తపస్సు. తటస్థంగా వుండటమంటే లోకవైచిత్రిని ప్రేక్షకునిలాగా – గమనిస్తూ ఆస్వాదించటం

– రసాస్వాదనలాగా. చిత్రలేఖన – శిల్పానుభవం పొందే అహం రహిత వ్యక్తి దశను పొందటం. ఆ దశలో అనుభవం నీది, వ్యక్తిగా నీది కాదు – విశ్వజనీన పురుషునిది – బాబాది – ఇదే బాబా అన్నది – నా ఆనందస్థితిని ధ్యానించు లేదా నారూపాన్ని ధ్యానించు – ఇదీ – ఆ ఆనందస్థితికి చేరుస్తుంది చివరకు –

## ఇంతకూ బాబా అంటే ఎవరూ?

దత్తుడు – కృష్ణుడు – రాముడు – అమ్మ ఏ పేరు పెట్టినా, ఏ రూపం చూచినా – అంటే ఏమిటన్న ప్రశ్న మిగులుతూనే వుంటుంది.

రమణ మహర్షి – కృష్ణ భక్తునితో అన్నారట 'మీరు కృష్ణుడంటున్నారు? – ఆయన ఎవరు? – యశోదానందుల బిడ్డ. దేవకీ, వసుదేవులు కన్నవాడు? – కాదు అది కేవల భౌతిక సత్త. మరెవ్వరూ – ఇదే ప్రశ్న అడిగి భక్తుడు చూస్తుండగానే – రమణుల ఆకారమదృశ్యమై ఆ స్థానంలో ఒక తేజోమండలం తోచిందట. మరల రమణమూర్తితోచి – అపుడు రమణులన్నారు –

'ఆ వెలుగు కృష్ణుడంటే' – నని.

బాబా అంటే ఆ వెలుగు – అదొక నిత్యం మండే ధుని – అగ్ని మండలం– 'ముండకోపనిషత్తు'లో చెప్పబడినది.

**'తదేతత్ సత్యం –యథా సుదీప్తాత్ పావకాత్**
**విస్ఫులింగాః సహస్రశః – ప్రభవంతే నరూపాః**
**తథాక్షరాత్ వివిధాః – సోమ్య భావాః**
**ప్రజాయంతే తత్ర చైవాపి యాంతి' – (21–1)**

ఇదే సత్యం. ప్రకాశవంతమైన అగ్ని కుండం నుండి వేలు, లక్షలు అదే రూపం కలిగి రవ్వలు సంభవించినట్లు – బుద్ధిమంతుడా! నాశనంలేని వివిధ సంభూతులు వస్తూ, తిరిగి అక్కడకే పోతూ వుంటాయి.

నిప్పు కొలిమిలో ఎగసిపడే రవ్వలు – తిరిగి అందులోనే లీనమై సకల జీవులు (భావాలని మంత్రంలోని మాట) దానినుండి ఆ మహాగ్ని వంటి పరమాత్మ

నుండి పుట్టి తిరిగి అందులోనికి ప్రయాణిస్తవి. ఈ రాకపోకలకదే జన్మస్థానం. ఆ మహాగ్ని కుండమే 'ధుని'. అందలి వెలిగే 'నందాదీపం'.

అది మనకు దారి చూపించుగాక.

❊ ❊ ❊

## 'అజాయమానో – బహుధావిజాయతే'

'జన్మ కర్మచ మే దివ్యం'

'జన్మలేని వాడనేకంగా జన్మించాడు'

నా జన్మ – కర్మా – దివ్యమైనది.

అంటే ఏమిటి?–

జన్మలేనిది ఆత్మ. అనేకం కావాలంటే వస్త్రంలాంటి శరీరంతొడుగు కొని – ఇంట్లో నుంచి బైటకు – వేషధారియై వచ్చినట్లు రావటం – ఇంట్లో నిరాడంబరముగా వున్నవాడు – బయటకు దొరబాబులాగా వస్తున్నాడు. నిద్రలో (నేను) లేనివాడు – మెలకుతో అనేకమౌతున్నాడు – వ్యవహారాలు చేస్తూ –

నా జన్మ, కర్మ దివ్యం అంటే మర్త్యం కానిది అమర్త్యం అంటే మృత్తు – మట్టి – నేల కానిది. ఇది త్రిదశలు కలది (Three Dimensional) దిశాబద్ధమైనది. కొలతలకందేది.

ఒకటి అంటే రెండు కానిదని అర్థము. తల్లి అంటే తండ్రి వుంటేనే దానికర్థము. తూర్పు – పడమర ఇలాగా మన శబ్దం, దేశకాల శరీరబద్ధము. కేవలం శబ్దం కాదు. అంటే సాపేక్షం – తప్ప నిరపేక్షం కాదు. ఇదే మాయ అంటే ప్రమాణబద్ధమైనది. వానిది అఖండం, అప్రమేయం అనిర్దేశ్యాదిగా చెప్పబడినది.

ఆ మహా – అఖండ – అప్రమేయతత్త్వం – దేశ, కాలశరీరబద్ధం కావటం పేరే జన్మ – సృష్టి. కృష్ణుడు చెరసాలలో పుట్టినాడంటే – ప్రమాణాల కందని తత్త్వం – ప్రమాణాలకు లొంగి నీదగ్గరకు రావటము –

ఇది మర్త్యము అంటే 'బహుధా విజాయతే' అంటే తాత్పర్యం ఆత్మకు శరీరం – దీనికి దేశం. దీనికి కాలం. ఆవరణలు, దిశలు, వస్త్రాలు ఈమూటిలో ఆవరింపబడటం సృష్టి.

దాసగణు తన బాబా చరిత్రలో వ్రాసినది.

అందరూ ఆయనను 'సాయిబాబా' అని అంటారు. ఆయన సదా

సచ్చిదానందంలో మునిగి వుంటారు. ఆయన పుట్టుపూర్వోత్తరాలెవరికీ తెలియవు. మీరేమైనా – నన్నా వివరాలడిగితే నేనే మాత్రమేమి చెప్పగలను. ఎవరైనా బాబాను ఈ ప్రశ్నడిగితే వారు ఈ విధంగా అంటారు.

"ఆకాశంలో మేఘాలు గర్జించగానే భూమి పై వర్షం పడినట్లు నేను జన్మించాను. నాకూరూ – పేరూ లేదు. నేను నిర్గుణుడను. కర్మబంధము వల్ల పిండరూపుడనై ఈ దేహాన్ని ధరించాను. సర్వదా నాపేరు దేహం. నా ఊరు ఈ చరాచర విశ్వం. బ్రహ్మమే నా తండ్రి. మాయ నా తల్లి. వారి కలయిక వల్ల నాకు ఈ రూపం ప్రాప్తించినది" – అని (ఇందులో బ్రహ్మము బ్రహ్మ కాదు. మాయ అంటే విశాలమైన ఎల్లలు లేని ఆత్మకు – రూపంలేని ఆత్మకు – రూపం కల్గించే శక్తి మాయ – వర్షధారలన్న మాటకు చాల అర్థాలున్నాయి)

ఇంకో సారి "మా అమ్మ నన్ను కన్నానని మురిసిపోయినది. ఆమె నన్నెప్పుడు కన్నదీ" అని.

దీనిని బట్టి – ఆయనకమ్మా, నాన్న మనకులాగా లేరా? శ్రీరామ శ్రీకృష్ణులకు లాగానే వున్నారని భావించారు కొందరు.

ఇది సాధారణంగా ఎవరికైనా కలిగే ఆలోచనే కనుక.

ఐతే ఆయన వాచా ఎక్కడా ఎందుకు చెప్పలేదు.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ – అని కదా అన్నారు. ఆచార్య విషయంలోనూ ఎన్నో కథలు చెప్పాడు బాబ – ఎందుకు చెప్పినట్లు?

'హేపాయ్ పురాతన్ పార్' అన్న గ్రంథంలో బహుజన్మ వృత్తాంత రహస్యమిలా చెప్పబడినది.

వడలూరు రామలింగస్వామి మహాయోగీశ్వరుడు. శ్రీ అరవింద మహాయోగి ఆగమనాన్ని ముందుగానే సూచించి, మృత్యురహిత శరీర సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి దానికి సంకేతంగా తాను యోగశక్తి చేత తన శరీరాన్ని అదృశ్యం చేసి గుప్పెడు బూడిదగా మారిపోయిన దివ్యాంశం. వారి చరిత్రకారులు దృష్టాంతపూర్వకంగా గ్రంథస్థం చేసారు. వారి సిద్ధాంతాలను – శ్రీమాత – అరవిందుల యోగదృష్టినీ

సమన్వయిస్తూ–

ఆరామలింగస్వామి అన్నారు –

సృష్టి ఐదు రకాలుః మైథున సృష్టి మొదటిది. మహాపురుష ఆశీస్సు ద్వారా – (సంకల్పం ద్వారా), స్పర్శద్వారా మాతృగర్భంలో సృష్టి రెండో మూడో సృష్టి,

నాల్గవదిః శంభు ప్రకార సృష్టి. మాతృగర్భంలో పావుగంటలో శిశు సృష్టి జరగటం (వాసాదుల జన్మలుదాహరణ)

దీనిలో రెండవది అసాధారణ సృష్టి, పరమాత్మ తనంతతానుగా శరీరాన్ని తొడుగుకొని రావటం, శివుడు వెలిసాడన్నట్లుగా ఇది స్వయంభూతం.

విభుసృష్టిః మహాత్ముని వీక్షణాదుల ద్వారా ధూళికణాన్ని మానవ వ్యక్తిగా సృష్టంచటం. (దీనికి అనుశాసన పర్వంలో వ్యాసుడు ఒక పురుగును రాజుగా పరిణమింప చేసిన కథ వున్నది.)

ఉపాసనీబాబను గురించి శిష్యుడు మెహర్బాబా ఇలాంటి మహాత్మునిగానే చెప్పాడు. ఆయన కృపావీక్షణం చాలు – మట్టికణం తరించటానికి.

ఈ పంచప్రకారసృష్టుల్లో లోకానికి తెలిసిందొక్కటే. ప్రాచీన మన్వంతరాల్లో మైధున సృష్టి లేదు. క్వలం సంకల్పం మాత్రం చేతనే సృష్టి చేయుటవే వుడేదనిపురాణవచనం. బ్రహ్మ మానసపుత్రులన్న మాట తెలిసినదే. అంటే సంకల్ప సృష్టి అన్నమాట. దీనిని గురించి శ్రీకృష్ణ అన్న గ్రంథములో సద్గురువులు శ్రీకందుకూరు శివనందమూర్తిగారు చెప్పారు–

ఇవన్నీ అవాస్తకాలు కాదు. అసత్యాలు కాదు. చెప్పినవారు మహాత్ములు, మహాయోగులూ కనుక.

(ఈ రామలింగస్వామిగారి సిద్ధాంతమే తర్వాత శ్రీఅరవిందులు చేసిన యోగసాధన.

వారు చెప్పిన మహాపురుషావతరణం. దాని కోసం తాము సంకేతంగా వడలూరులో నిర్మించిన మహాదేవాలయం సత్యజ్ఞాన సభామందిరము (1872లో నిర్మించినది.)

ఇదంతా శ్రీఅరవిందుల విజ్ఞానమయ పురుషావతరణ–

(SUPRA - Mental Divine) సంబంధంగానే పండితులంటున్నారు. ఆ సత్యజ్ఞాన సభామందిర నిర్మాణం జరిగిన సంవత్సరమే (1872 జనవరి) శ్రీ అరవింద మహాయోగి జన్మించారు 1872.

వీరు దక్షిణదేశానికి వచ్చి తాను చెప్పిన యోగాన్నే స్థాపిస్తారు. కొనసాగిస్తారని ముందుగానే రామలింగస్వామి చెప్పారు.

రామలింగస్వామిగారు చెప్పిన శంభుప్రకారసృష్టి (రెండవది) పరమేశ్వరుడు తానై స్వయంభూతుడు కావటమన్న విషయాన్ని 'శ్రీఅరవింద మహాయోగి'– పృథ్వి మీద విజ్ఞాన పురుషావతరణమన్న 'The Supramental manifestation upon Earth'– అన్న గ్రంథములో వీరూభావించారు.

'జోతిర్మయ దేహ మన్నమాట ఋగ్వేదంలో నున్నదే. వైష్టవం చిన్మయ దేహమన్నదీ ఇదే. మహాత్మ తనంత తానై, మాతృగర్భావసరం లేకుండా అవతరించటానికి యోగ – దివ్య సిద్ధాంతమున్నది. భవిష్యత్తులో అది జరుగుతుంది – అని (47వ పుట – పై గ్రంథం) సుధీర్ఘంగా వివరించారు.

బాబా అన్న పురుష ప్రకృతి సంయోగము వల్ల తాను జన్మించానన్న మాట దీనికి సంబంధించినది కావచ్చు. రెండవ అంశం 'మా అమ్మ నన్ను కన్నానని పొంగి పోయినది. ఆమెనన్నెప్పుడు కన్నది. అన్నమాట కర్థమేమిటి?

**బహుశః**

శ్రీరామలింగస్వామి తమ జన్మవృత్తాంతాన్ని తామే వివరిస్తూ చెప్పారట–

'తమ తల్లికి ఎవరో తెలియని శైవసాధువు – మహాత్ముడు విభూతినిచ్చి. ఆశీర్వదించాడని – తన తల్లి, తండ్రుల శుక్లశోణితాంశాలను నిర్మించుకొని, పిండమేర్పాటు చేసుకొన్నాననీ, తమ యిష్టాసారంగా గర్భప్రవేశం చేసినట్లు, జన్మించినట్లు చెప్పారు. (చూ. అరుళ్‌పెరుంజ్యోతి – తులసీరాం రచన)

ఇదే బాబా కూడా చేసుకొని యుండవచ్చు. తమ జన్మను గూర్చి – తామే అంతా ఏర్పాటు చేసుకొని వుండవచ్చు గదా!

జామ్నేరు చమత్కారములో జట్కాబండినీ, గుర్రాలను నిర్మించుకొన్నవాడు – అనేక చోట్ల –ఒకేసారి వ్యక్తమైనవాడు, సిద్ధుడై – దూరాన వున్నవారిని కాపాడిన వానికి ఈ జన్మ అసాధ్యమా? – పంచభూత నిర్మాణమెలా చేసాడో అలాగే తానై శరీర మన్న కఫ్నీని వేసుకోని రావచ్చు కదా.

పైగా చాను చాంద్‌పాటిల్‌తో శిరిడి వచ్చినట్లు చెప్పిన వృత్తాంతముతో తన పేరు 'నా సత్య' అని చెప్పాడని దాసగుణ చరిత్ర పీఠికలో శ్రీశరత్ బాపుజీగారు వ్రాసి – క్రింది జ్ఞాపికలో దాని వివరణమూ ఇచ్చారు. అశ్వినీ దేవతల్లో ఒకరి పేరది – అని చాంద్ పాటిల్ గుర్రం కథా – ఈ అశ్వదేవతలకు ముడిపెట్టి బాబా అలా అన్నాడు.

న + అసత్య – అసత్యం కానిది – సత్యం అని అర్థము. మసీదులో ఫకీరెప్పుడు అబద్ధమాడడని కదా – బాబా వాక్కు.

తన జన్మ వృత్తాంతములో అసత్యము చెప్పాడని ఎలా అనుకోవటం – అదేదో వేదాంతవిషయముగా వ్యాఖ్యానించటం – బాబా బాబా కూడా అందరిలాగానే సమర్థించుకోవటం – చాలామంది వ్రాసిన విషయుమే తప్ప లోతుగా విచారించినవారు లేదు. అందుకని దీర్ఘంగా ఇది చర్చించవలసి వచ్చినది.

❋ ❋ ❋

# ఇంతకూ
# బాబా అంటే ఎవరూ?

అబ్దుల్లా అన్న భక్తుడున్నాడు కదా. మసీదు పూడ్చిశుభ్రం చేసేవాడు అలాగే బాబా నడిచే దారులన్నీ శుభ్రపరిచేవాడు. ఇతడు మొదలుగా అమీరుద్దీన్ అనే ముస్లీం ఫకీరు దగ్గర సేవ చేస్తుండేవాడట. ఒక నాడు రోజున 1889లో ఆయన కలలో కన్పించి, బాబా అబ్దుల్లాను తన దగ్గరకు పంపమని రెండు మామిడిపళ్ళిచ్చాడట. తెల్లవారి లేచేసరికి మామిడి పండ్లున్నాయి. సరే అబ్దుల్లా బాబా దగ్గరకు శిరిడీ వచ్చాడు. అతడు రాగానే బాబా అన్నాడట – నా కాకి వచ్చిందని. ఇతడే పిళ్ళే కథలో అతని వారి కరుపుమీద కాలువేయగా ఆ పుండు పగిలి అతనికి  స్వాస్థ్యం చిక్కినదని సచ్చరిత్రకారుడు చెప్పాడు. ఆ అబ్దుల్లా వ్రాసుకొన్న డైరీలో  ఉర్దులో ఉన్నాయట – అవి ప్రకటింపబడనే లేదట. అందులో బాబాను గురించి చాలా విషయాలు చెప్పాడట. 'బాబాకు మహమ్మదీయ – సూఫీ మతశాఖలన్నీ క్షుణ్ణంగా తెలుసు. ఆ మతం ఆనుపానులన్నీ ఆయనకి కరతలామలకం. ఖురాన్ తెలుసట. మహమ్మదు వంటి వారి చరిత్రలు, మహమ్మదీయ మత సంప్రదాయం అన్నీ తెలుసునట. అలాగే గీత, ఉపనిషత్తులు, వేదం సద్గురువుల ప్రవక్తల చరిత్రలు, ప్రాకృత భాషలో వున్నవీ ఆయనకు తెలుసు. వాటిని వివరించేవాడట బాబా. బాబా విజ్ఞాన సంపద చాలా అద్భుతమైనదని చెబుతూ – అన్నాడట.

అబ్దుల్లా స్నేహితులారా! బాబా అంతరంగం లోతెవరకు తెలుసు? బయట కన్పించే ఆయనను గురించి మనకేమీ తెలియదే! ఆయన లోలోపల వేదం, ఖురాన్, గీతలాంటి వాటిని నిత్యం మననం చేసేవాడు. ఆయన సాయిబాబా అంటే మసీదు పేరు ద్వారకామాయి. వేషం ఫకీరు – చెవులు కుట్టుకొన్న లక్షణాలున్నాయి. (ఇది హిందూమత సంప్రదాయం) – ఆయన ఎవరో ఎవరికీ తెలియదు. ఆయన లీలలు అద్భుతం. అమీర్ భాయి బాబాను గురించి వ్రాస్తానంటున్నాడు. ఆయనకు బాబాను గురించి ఏం తెలుసు గనుక – ఇలాంటి విషయాలాగ్రంథములో వున్నాయని సాయిబాబా – విశిష్ట సద్గురువు అన్న ఆంగ్ల గ్రంథకారులు 'SAI BABA OF SHIRIDI - A Unique Saint'

40,41 పుటల్లో సుదీర్ఘంగా చెప్పారు. నిజానికి ఏ గురువు ఏ శిష్యునకర్థమైనాడు గనుక శ్రీరమణమహర్షిని గురించి మురుగనార్ – కావ్య కంఠగణపతి ముని వంటివారు ఇలాగే అన్నారు. స్వామివేకానంద అంత మహాత్ముడు – తన గురువు తనకేమి అర్థం కాలేదన్నాడు.

పాండిచ్చేరి జనని అరవిందులతో కలిసి మహాయోగం దీర్ఘకాలం చేసిన విశ్వజనని అన్నది.

'ఇంతకాలం వారితో కలిసి వున్నా ఆయన ఏమీ నాకర్థము కాలేదు అన్నదంటే ఉపనిషత్తులు పరమాత్మ వర్ణన చేసినట్లు కదా.

'ఇతి శుశ్రమ – యే నః తత్ వ్యాచ చక్షిరే' – అని కేనోపనిషత్తులోని మాట.

'మా పూర్వులిలా చెప్పారని వింటున్నాం' – అని భావము.

అంటే అదేమిటో చెప్పలేనిది – శబ్దానికందనిది. అనుభవైకవేద్యమని తాత్పర్యం. అది తర్కించదగ్గది కాదు. అనుభవించదగ్గదని – ఆ వ్యాక్యానికర్థం చెప్పారు శ్రీ శంకర భగవత్పాదులు.

బాబా అంటే 'సత్ – అతి ఉపాసితవ్యం' – (కంఠం) ఇన్నదని ఉపాసించు – అంతే. తర్కించవద్దు. దానికి మార్గం – సాధన – యోగం – ఉపాసన.

ఇంతకూ బాబా అంటే ఎవరు? ఎవరో? మెహర్బాబా – గురువు ఉపాసనీ – ఈయన గురువు సాయిబాబా. ఆ ఉపాసనీ దగ్గర మెహర్బాబా కొన్నేండ్లున్నాడు. ఆయనను గురించి వ్రాస్తూ మెహర్బాబా అన్నాడు.

'నా గురువు కటాక్షం ఒక మట్టి కణం మీద పడితే అది ముక్తి పొందుతుందని' – అలాంటి గురువు మెహర్బాబా కొకసారి నమస్కరించి, ఆయన చేతులు పట్టుకొని మెహర్ నీవు సాక్షాత్తు పరమాత్మవు అన్నాడట. ఈ మాటలు మెహర్బాబాయే అన్నాడు. అలాంటి మెహర్బాబా 'GOD SPEAKS' అన్న బైబిలు వంటి మహాగ్రంథం వ్రాసి దానిని అంకితం చేస్తూ అన్నాడు.

ఇంతకూ బాబా అంటే ఎవరూ?

దీనికి ప్రమాణం – సచ్చరిత్ర మొదటిది.

రెండవ ప్రమాణం – బాబా (శిష్య) గురు పరంపర.

ఉపాసనీ మహారాజు – మెహర్బాబా రచనలు. మాటలు ఇవి ప్రత్యక్ష ప్రమాణాలు.

పరోక్ష ప్రమాణాలు – పూజ్యులు శ్రీ నరసింహస్వామీజీ రచనలు. ఇవీ బాబా శిష్యులు – భక్తులు.

ఆ 1934–40 నాటికి సజీవులైన వారిని కలిసి సేకరించిన ఆధారాలననుసరించి వ్రాసినవి తప్ప ఊహాపోహలు కావు. ప్రత్యక్ష ప్రమాణాలే కాని రచన 1955 నాటికి గాని అచ్చుకాని కారణంగా పరోక్షము.

**సచ్చరిత్ర ః–**

హేమద్పంతు బాబా దగ్గర 9 ఏండ్లు కూర్చుని – ఆయన చుట్టూ వున్న భక్తులనుండి విన్నవీ – తాను కన్నవీ మధురంగా రచించిన బాబా భాగవతమే – సచ్చరిత్ర. అది మరాఠీలో చాలా మధుర కావ్యమని నరసింహస్వామీజీ వ్రాసిన మాట. అంతకంటే ప్రమాణ మన్యమేమీలేదు.

ఆధునిక యుగంలో వచ్చిన అవతార పరంపర పంచబ్రహ్మలు. శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీఅరవింద, భగవాన్ రమణమహర్షి, బాబా (ఉపాసనీ–మెహర్బాబాలు) వారి వారి శిష్య పరంపర వ్రాసిన గ్రంథాలే వారెవరో తెలుసుకోవటానికి మనకాధారాలు.

ఆనాటి రామాయణం భారతాలెలాంటివో – అలాంటివే ఇవీ.

సచ్చరిత్రలో ప్రతి అధ్యాయము ప్రారంభాల్లో నడుమ, చివర ఆది మధ్యంతరహితుడైన బాబా భగవంతుని గురించి ఎంతో వ్రాయబడటం చూస్తున్నాం. నిత్యంపారాయణం చేస్తున్నాం గదా. అవన్నీ ఒకచోట చేర్చి చదువుకోవాలి. చదివి, మననం చేస్తే బాబా ఎవరో మనోయవనికపై, పలక మీద ఒక రంగుల చిత్రమేర్పడుతుంది. ఆ చిత్రమే బాబా శబ్ద చిత్రం. ఛాయచిత్రం. వర్ణచిత్రం. ఎన్నెన్ని కోణాల్లో ఆ గ్రంథం బాబాను గానం చేసిందో ఆశ్చర్యం వేస్తుంది. వాటిని అర్థం

చేసుకోవాలి. ఇది మన పని. అర్థాన్ని మననం చేయాలి. అది ధ్యానం వల్ల కానీ సాధ్యం కాదు. ప్రతి అధ్యాయములో వానిని వ్రాయనక్కర్లేదు. పాఠకులు చదువుకోవాలి. కొన్ని మాత్రం వ్రాయబడుతున్నవి.

అసలీ గ్రంథం హేమత్పంతం ఎందుకు వ్రాసినట్లు?– ఎవరు వ్రాయమంటే వ్రాసినట్లు! ప్రేరణ కారణమేమిటి?

1910లో ఎప్పుడో బాబాను దర్శించాడు. అదీ సాయం సంధ్యలో – శివుని – ధూళి దర్శనం చేసాడు. మర్నాటి ఉదయం దృశ్యంతో తెరలేవగా మసీదు – అక్కడ బాబా తిరుగలి విసరటం – భక్తులు మూగటంతో నాటకం ప్రారంభమైనది. బాబా గోధుమలు విసరటం దేనికి?–

అంటే నల్గురు పాత్రలైన స్త్రీలు బాబా నీవలకు జరిపి తామే విసరుతూ అనుకున్నారు.

'పిల్లాజెల్లాలేని బాబాకీ పిండితో ఏం పని? మనకివ్వటానికి కాబోలు–'నని. కానీ బాబా చేసినదేమిటి? ఆ పిండిని పొలిమేరల్లో చల్లమని. ఎందుకట? మరొక పాత్ర చేత అనిపించాడు – నాటక రచయిత దభోల్కర్. – 'ఊళ్ళో వ్యాధి నివారణకు'అని

దానికీ, దీనికి సంబంధమేమిటి? ఈ ప్రశ్న – జిజ్ఞాసతో రచనా వాంఛ ప్రేరణతో జరిగింది.

అదృష్ట (కనిపించని) కారణ – కార్యసంబంధాన్వేషణ – తాత్పర్యం – భావం వివరించటానికే ఈ రచన అవతరించినది.

ఆ కారణ బిందువు – కథావృత్తాంత చక్రనాభి–

'బాబా!'

ఆ పేరు మనం పెట్టుకొన్నదే తప్ప ఆయన కూరు, పేరూ లేదు. చుట్టపక్కాలు లేరు. ఎవరో, ఎక్కడనుండి వచ్చాడో ఎందుకు శిరిడినే రంగస్థలంగా ఎన్నుకొన్నాడో – అంతా అగమ్యగోచరం. ఇదంతా నేపథ్యంలోనే, తెర వెనుకనే – గుప్తంగా ఉండిపోయినది. ఆయన చెప్పలేదంతే. ఎందుకు? – ఎందుకో భక్తుడు భావించాలి

– తత్త్వాన్వేషణ తత్పరత ఒక్కటే – భక్తి ఒక్కటే మార్గం. అది శబ్దానికందదు. కానీ చెప్పదు రచయిత అన్నాడు. ఆయన ఎవరో, ఆయన చేష్టల కర్థమేమిటో చెప్పలేం. కాని చెప్పాలనిపిస్తున్నది. మౌనంగా ఎవరో వుంటే బాగుండునని అన్పించినా"– అని ఒకచోట సచ్చరిత్రలోనే అన్నాడు.

ఆత్మ మౌనవ్యాఖ్య పరబ్రహ్మ స్వరూపమని భావం. కానీ ఎన్ని మతాలు, గ్రంథాలు, సిద్ధాంతాలు వచ్చాయి. పరమాత్మను చెప్పటానికనీ – అన్ని కలిపి చూస్తే తెలిసిందేమిటి? ఏమీ తెలియదని. లోపల ధ్యానానికి, సమాధి కందుతుందని. ఐతే ఇన్ని గ్రంథాలు దేనికి? – 'అన్వేషణ మార్గసూచకాలైన బాణం గుర్తులు – దారిచూపే రాళ్ళు – బల్లలు' – నని తెలుసుకోవటానికా! చిత్రంగా వున్న సత్యమింతే. ఈ సచ్చరిత్ర ఇంతే–

2వ అధ్యాయం చివర మార్గదర్శకుడు లేనిదే అడవిలో దారి తెలియదు' అని చెప్పి దానిని వివరణగా బాబా గురువునెలా అన్వేషించాడో ఒక అధ్యాయంలో నలుగురు మిత్రులు కలిసి, అడవిలో వెతకటం, బంజారాదారి చూపటం, గురువుగారు ప్రత్యక్షం కావటం చెప్పాడు కవి.

ఆ నల్గురెవరు – నాలుగు వర్ణాలవారు, నాల్గు దిశలుగా నన్ను దేశవాసులు – మానవజాతి అంతా – అడవి అంటే – దేశ, కాల, వ్యక్తుల సమూహం. శబ్దరాశి గ్రంథాలు. అన్నీ అరణ్యాలే. జీవితమంతా వెతుకులాట./ యోగ రంగస్థలం. ఆ అన్వేషణ కలవానికి గురువు (దైవం). ఆచూకీ తెలియదు. ఎందుకంటే ఆయన బైట లేడు కనుక. నీలోనే వున్నాడు కనుక – వెతికితే తెలిసిన సత్యమిది. ఆ అడవి పేరు మనస్సు. అది చిత్రించినదే బయటి విశ్వం. ఎవడి లోకం వాడిది అంటే అర్థమిదే. ఆ మనస్సు కల్పించినదీ శబ్దం – గ్రంథం, మతం అంతా. దీనిని 'కాశ్మీర శివాద్వైత గ్రంథాలు' – ఇవన్నీ పరమేశ్వరుని భూమికలు. నాటకంలో పాత్రధారులు – అని చాలా అందముగా అన్నాయి.

జగత్తు ఒక లీల – క్రీడ – నాటకమని భావం. దానిని భావించాలి. మననం

చేయాలి, ధ్యానించాలి. అపుడు మానవుల నడుమ కయ్యాలు – ద్వేషాసూయలు, స్వార్థం లేని బ్రతుకేర్పడుతుంది. సినిమా చూచినట్లు చూడటం – ప్రేక్షక పాత్ర వహించటం – ఇంతకంటే యోగమేముంటుంది బాబా కూడా ఇదే అన్నాడు – (చందోర్కరు బాబా ప్రక్కనే వున్నాడు. ఎవరో మహమ్మదీయ స్త్రీలు వచ్చి, బాబా దర్శనం చేస్తూ ఒకామె ముసుగు తీస్తే చందోర్కరు 'అబ్బా! ఎంత బాగుంది ఈమె అనుకోగానే గ్రహించిన బాబా చెప్పిన మాటలు – "నానా ఎందుకాయాస పడుతున్నావు. భగవంతుని సృష్టి చాలా అందమైనది. అది చూసి ఆనందించటానికే నీకు నేత్రాలున్నాయి. ఆనందించటములో తప్పు లేదు" – అన్న మాటలు కళాదర్శనం చేయమని బోధించటమే కదా! కామ భావాన్ని శృంగార రసానుభవంగా, కావ్యంగా, అనుభవించమని చెప్పటమే కదా. ప్రతి మానసిక వృత్తినీ కావ్యభావనగా అనుభవించవచ్చు. కావ్య బోధ ఇదే. యోగాభ్యాసమే. నీకిచ్చే శిక్షణ అదే. లోకం, కావ్యంగా, నాట్యంగా, కళగా అనుభవించు. అపుడు కామ క్రోధాదులు రసాలుగా పరిణమిస్తాయనటం కదా!)

3వ అధ్యాయం – 'ప్రేమతో నానామాలు జపించిన వారిని కాపాడుతాను.

వారికి భక్తి ప్రపత్తులు పెంచుతాను. అంతులేని ఆనందం కల్గిస్తాను – ఇత్యాది అధ్యాయ ప్రారంభములో బాబా స్వయంగా చెప్పినట్లు వ్రాయబడినది. కాబట్టి భక్తి శ్రద్ధలతో ఈ కథలు వినండి – అన్నాడు బాబా. గ్రంథ ప్రయోజనం, ఫలశ్రుతి ఇదే.

4వ అధ్యాయంలో – సాయి రూపురేఖలన్న విషయంలో కథకుడు వివరిస్తున్నాడు – బాబా అంటే ఏమిటి? వారందరకు ప్రభువు. సమత వారి నైజం. నిత్య సమాధిస్థితులు. సహజ సమాధిలోనే వుంటూ – లోక వ్యవహారాలు చేస్తూనే – భక్తావనం చేస్తూనే – ఒక చోటవున్న – ప్రపంచ స్థిలిగతులన్నీ వారికి కరతలామలకమే – నన్న వాక్యాలు చూస్తే – ఆయన ఉపనిషత్తుల్లో చెప్పిన పరబ్రహ్మతత్త్వంగా గోచరించకపోదు – 'ఈశావాస్య ఉపనిషత్తులో చెప్పబడినది. అది కదలదు. కదలుతుంది. మనస్సు కంటే వేగం కలది. దేవతల కంటే ముందు

పరుగెత్తుతుంది. తన ఆత్మనే విశ్వంలో – దీనిలో తనను చూచుకొనేవాడు మహాత్ముడు. 'ఇలాంటివి బాబా దర్శనమే మాకు యోగం – వేదపారాయణమన్న మాటలూ వున్నాయి' – అంటే

'గురురుపాయ:' – గురుచరణ సాన్నిధ్యమే భవతారకమని తాత్పర్యం. ఇదే విషయం బాబా 17వ అధ్యాయంలో రాధాబాయి – అన్న ముసలమ్మకు చెప్పిన తన గురుదర్శనం – విషయం. 140వ పుటలో చెప్పినది చూస్తే 'గురు సానిధ్య – మహిమ' తెలుస్తుంది. గురువే యోగసాధన – ఆయన దగ్గర కూర్చోవటం, చెప్పినది వినటం, దర్శన, శ్రవణ మననాదుల ఫలమంతా గురువే. ఆయన కటాక్షం తరించటానికని – గ్రంథాల్లో చెప్పబడినది కదా!

6వ అధ్యాయం – మరలా గురువే సర్వస్వమని చెప్పబడినది. భవసాగరంలో ఆయన సరంగు. పడవ నడిపేవాడు. ఆయన కరస్పర్శ వాసనామయమైన సూక్ష్మశరీరాన్ని దహించగలదు. ఆయన దర్శనం చాలు. చూడగానే ఆనందం పొంగి పొరలుతుంది. ఆయనే రాముడు, కృష్ణుడుగా – తమ లీలలను తామే విన్పిస్తున్నట్లు తోస్తుంది.

ఇలాంటి వాక్యాలు – ఇతర గురువులను గురించి వారి భక్తునిలాగే అన్నారని చదువుతున్నాం – అదే అధ్యాయములో బాబా మాటలు వ్రాయబడినవి. నా భక్తుని యింట్లో అన్న వస్త్రాలకు లోటుండదు. భక్తుల యోగ, క్షేమాలను వహిస్తాను' – ఇవన్నీ దైవం మానవునకిచ్చే అభయవాక్యాలే కదా!

7వ అధ్యాయంలో బాబా అద్భుతావతారంగా చెప్పబడినది. హిందూ – మహమ్మదీయ సమన్వయంగా చెప్పబడటం గమనించాలి. ఆయనది విశ్వ కుటుంబము. విశ్వమంతా ఆయన ఇల్లేనట.

ఈ సమన్వయవాదం శ్రీరామకృష్ణ పరమహంసతో ప్రారంభమై శ్రీరమణ మహర్షి దాకా సాగినది. రామకృష్ణుల శిష్యులొకరు ఈ సమన్వయవాదాన్ని ఒక చిత్రంగా గీయించి పరమహంసకు చూపిస్తే ఆయన అన్నారట 'భవిష్యత్తునకు మార్గదర్శకమైన జ్యోతి కాగలదు' – అని. దానినే వివేకానంద స్వామి వ్యాప్తం చేసి

ప్రాచ్య, పాశ్చాత్య సమన్వయ వాదాన్ని విశ్వమంతా ఒకే కుటుంబమనీ, ఒకే మతమనీ, వాదాలను సృష్టించి వ్యాపింపచేసాడు.

ఈ విషయాలకు రోమోరోలా వ్రాసిన వివేకానంద జీవిత చరిత్ర చూచుకోవాలి. ఈ సమన్వయమే ఇహ, పరలోక సమన్వయ వాదమైన – పదార్థ – ఆత్మ శరీరాత్మ సమన్వయవాదంగా శ్రీ అరవిందమహాయోగి దివ్య జీవనమన్న గ్రంథములో ప్రతిపాదించారు.

మహారాష్ట్రం మహ్మదీయ పాలనలో వున్న దేశం. సూఫీమత వ్యాప్తి కలది. ఇందుకే బాబా అన్నాడు 'జైసాదేశ్ – వైసావేష్' అని. మెహర్బాబా ఈ సూఫీ మతాన్ని పునరుద్ధరించినట్లు ఆయన రచనల ద్వారా తెలుస్తున్నది.

ఈ సమన్వయ వాదం చాలా మహత్తరమని భావించదగ్గది. వ్రాయదగ్గది. పరమహంస సర్వమతానుభావాలు పొంది – అన్నమాట –

'నీవు జలమన్నా, పానీ అన్నా, నీరన్నా, వాటరన్నా – అన్నీ ఒకే పదార్థాన్ని చెప్పినట్లు – అల్లా అన్నా, క్రీస్తు అన్నా, కృష్ణుడన్నా, ఆత్మ అన్నా, బ్రహ్మమన్నా అన్నీ ఒకటే. వస్తువును చెప్పే వేర్వేరు మాటలు – అని'

ఇదే బాబా మసీదులో వుండి హిందూమతాచారాలు, మహమ్మదీయ మతాచారాలు – పాటించటంలో పరమార్థం. భగవంతునకు కులం, మతం లేదు. ఊరు లేదు, పేరు లేదు. ఏమీలేని నిర్గుణ పరమాత్మ. ఇదే బాబా అంతే తన సంగతిని తెరలో దాచటానికిదే అర్థము. భక్తునకు బాబా ఈ భౌతికమైన తృణజాలం, భగవంతునకెందుకు? మైల, మ్లేచ్ఛ, అస్పృశ్యాది గడ్డీగాదం నుండి ఈ యుగావతారాలు మతాన్ని, మనిషిని వేరు చేసాయి. ఇందుకే వీరంతా ఏ మతశాఖలకూ స్థాపించలేదు. తత్త్వ విచారణ చేసారు. ఆయన విష్ణువు, శివుడు ఇత్యాది నామాలు పెట్టలేదు. మతానుభవం వేరు – ఇవి వేరనే చెప్పారు. స్వామీజీ ప్రసంగాలు రమణమహర్షి ప్రబోధాలూ, చూచిన వారికే తెలుస్తాయి. వీని పరమార్థం. మతమంటే క్రతువులు, పూజలు, పంచామృతాభిషేకాలు కావు. అవి పురోహిత సంస్కృతి పరిధిలోనివి. విప్రసంస్కృతి వేరు. అది వేదర్షి సంప్రదాయం. బాబా

వంటి ఆధునికావతారాలు ప్రవర్తింపచేసినది కేవలం తత్త్వ విచారణ – భక్తి ఇదే.
"నాకు పూజాతంతుతో పనిలేదని"
బాబా అన్నదిందుకే.

## 10 – వ అధ్యాయము

## 89

బాబాకు ఇంద్రియ స్పృహ లేదు. అనుభవిస్తున్నట్లు కన్పిస్తున్నదంతే. వారికి రుచిలేదు. భావవికారాలు లేనివారు (కామ క్రోధాదులు లేనివారు. వారు ముక్తులు. పరిపూర్ణులు ఇది రచయిత చెప్పిన దాని సారాంశము. దాని క్రింద నానావలి కథ.

11వ అధ్యాయములో సిద్ధిక్ పాల్కే వృత్తాంతం వస్తుంది. దీని భావమేమిటి –

బాబాకు దేహమున్నా తాను వేరే ఆత్మ స్వరూపునిగా వున్నాడని. లేకపోతే దీపావళి నాడు ధునిలో చేయి పెట్టడం – కాలటం – వైద్యం చేయించుకోకుండా అల్లాయే నా వైద్యుడనటం. అన్నం, పలావు వండుతూ, చేతితో కలబెట్టడం, – వంటి వృత్తాంతాలు దేనికి చెప్పినట్లు. కేవలం తానాత్మ స్వరూపుడను – అని నిదర్శన పూర్వకంగా చెప్పటం కాకపోతే, మాటలనటం కాదు. బోధ అంటే అనుభవపూర్వకంగా – అనుభవం ద్వారా – చెప్పటం ఇలాంటి చోట్ల బాబా పరిపూర్ణ జ్ఞాని – సిద్ధుడు. నిత్యాత్మమగ్నుడని తెలియటం లేదా? ఎక్కడోవున్న కమ్మరి కొలిమిలో పిల్ల పడటం, తానా కొలిమిలో చేయి పెట్టి లాగటం – ఇదెలా సంభవం – తాను విశ్వమూర్తి కాకపోతే? మెహర్బాబా చెప్పారు. "తాను విశ్వజీవుల దు:ఖతాపాదులననుభవించాను. దానికి తట్టుకోలేక తలను రాళ్ళకేసి బాదుకొనేవాడిని. అందుకే తలకు గాయం కాగా గుడ్డ పీలిక కట్టుకొన్నాను" – అని. ఇది విశ్వాత్మ స్వరూపుని విషయం. విశ్వంతో తాదాత్మ్యం పొందటం. ఇదే దైవ లక్షణం. బాబా అన్నాడు కదా – సమస్త విశ్వం తన శరీరం, ప్రతి జీవీ తానేనని – విశ్వంలో తానొక ప్రత్యేక వ్యక్తిననుకొనేవాడు చేయలేడు.

శ్రీరమణ మహర్షిని చదివిన వారికీ తెలుస్తుందీ విషయం స్పష్టంగా వారూ అన్నారు – దేహంతో ఆయా కార్యాలు చేస్తున్నట్లు లోకానికి కన్పించినా – జ్ఞాని కలాంటి అనుభవముండదు.

తనను నానా గద్దె దిగి పొమ్మనగానే పోవటమేమిటి?

జవహర్ ఆలీ బాబాను తన శిష్యుడంటే అలాగేనని వానిని గురువుగా సేవించటమేమిటి? – ఇదంతా బాబా విశ్వాత్మకతకు నిదర్శనమే–

సిద్ధిక్ ఫాల్కేను బాబా ఆరు నెలలపాటు మసీదులో రానివ్వకపోవటం దేనికి? అతనిలో 'అహం' ఎక్కడో మిణుకు, మిణుకుమంటున్నది. తాను ఖురాన్ – చదివినానని – మక్కా యాత్ర చేసానని – ఈ మాటలు బాబాయే అన్నాడు. దీనిని అణగార్చటం కోసమా పని చేసాడు బాబా. అంతే కానీ 'నీలో అహమున్నదిరా – అది పోగొట్టుకొని నా దగ్గరకు రా' – అని పండితునిలాగా బోధించలేదు. బోధ అంటే చెప్పటం కాదు. జ్ఞానోదయాన్ని కల్గించటం బోధ అంటే జ్ఞానం తప్ప వల్లించటం కాదు (వేదాదులను).

రమణ దర్శనం చేసినవారనే వారట. స్వామీ 'ఎన్నో ఏండ్లుగా రావాలనుకొన్నాను'. ఎంతో జప, తపాదలు చేసాను. కానీ ఇప్పటికి కుదిరిందంటే వారనేవారట – 'అవి చేసిన ఫలితమే ఇది' – అని. బాబా కూడా అనేవాడట కదా –

మసీదు తల్లి తన బాకీ తాను కోరితే తప్ప నేను దక్షిణ అడగను. అది తీర్చుకొన్నాకనే మసీదులో అడుగు పెట్టటం కల్గుతుందని. ఈయన దేమిటి? ద్వారక అని ఆయనే అన్నాడు కదా! ద్వారక ఎవరిల్లు! కృష్ణునిది కదా! బూటీ కట్టించిన గుడిలో మురళీధరుని విగ్రహం పెట్టాలనుకొంటే ఈయన పోయి కూర్చోవటానికర్థమేమిటి? తానూ ఆయన వకటేనని కదా! నానాకు గీతార్థం బోధ చేస్తూ – గురువులంతా కృష్ణమూర్తులేననటానికర్థమేమిటి? తానా గురు స్థానంలో వున్నాననే కదా. జగద్గురుత్వం కృష్ణావతారంలోనే ప్రారంభమైనది కనుక. ఈ మాట సద్గురువులు శ్రీ కందుకూరి శివానందమూర్తిగారు తమ శ్రీకృష్ణ అన్న

గ్రంథంలో వ్రాసినది.

అందుకే శ్రీ అరవింద మహాయోగి తాను కృష్ణావతారమేనని జనని - ఫ్రాన్సులో వుండగా ఆమెకు ధ్యానంలో కన్పించటం - శిష్యులకు చెప్పటం జరిగినది.

కనుక ద్వారక అంటే భావమిది. మసీదు దర్శనమే సర్వార్థదాయకమన్నా ఇదే.

❀ ❀ ❀

# బాబా అంటే? 2

3– వ అధ్యాయములో బాబా తన యథార్థతత్త్వ ప్రకటన స్వయంగా చేసాడు. కృష్ణాదులున్ను తమ తత్త్వాదులను తామే చెప్పకపోతే మనకు తెలియటమెలాగా? మనం చెప్పుకొనే మాటలు మనస్సుల నుండి పుట్టిన శబ్దాలు. అవి సత్య ప్రకటన కసమర్థములు. కనుకనే ఆత్మ మనస్సున కందదు. శబ్దాన్ని కందదని చెప్పుకోవలసి వచ్చినది.

27– వ పుటలో – మధ్యాహ్న హారతి అనంతరం బాబా భక్తులతో అన్నాడు. ఈ మసీదులో ఫకీరు అబద్ధమాడడు – అన్న మాట జ్ఞప్తిలో ఉంచుకొని చూడాలి – బాబా మాటలు మనన యోగ్యములు తప్ప, ధ్యాన యోగ్యములు తప్ప మామూలు సాధారణ వాక్యాలు కావు.

1. 'మీరెక్కడున్న – ఏమి చేస్తున్న, నాకు తెలుస్తుంది. ఎందుకంటే నేను మీ హృదయాలలోనే ఉన్నాను కనుక.

2. నేను సకల జీవ స్వరూపుడను. జగత్తును నడిపించేవాడను. సూత్రధారిని.

3. నేనే జగన్మాతను. త్రిగుణముల సామరస్యమే నేను.

4. సృష్టి, స్థితి, లయ కారకుడనూ నేనే, కనుక దృశ్యమాన చరాచర జీవకోటి అంతా నా శరీరమే, నా రూపమే.

5. ఇందుచేత మీదృష్టిని నాపై కేంద్రీకరించండి.

ఇదీ సూక్ష్మంగా బాబా ప్రవచన సారాంశము.

దీనిని నివారించుకోవాలి.

ఇందులో 1–2–4– ఒకే పరమార్థాన్ని వ్యక్తీకరించేవి. జగత్తు భగవంతునకు శరీరం. కనుక సృష్టి, కర్త, భర్తా, హర్తా నివాసంగా వున్నాడు కనుక –

పుండలీకరావు వాసుదేవానంద సరస్వతి ఇచ్చిన కొబ్బరికాయను పగులగొట్టి దారిలో తిని బాబా దగ్గరకు రాగానే బాబా అన్నాడట కదా.

'గాం ఆవిశ్య – ధారయామి అహం ఓజసా' – విశ్వాన్ని ఆవేశించి,

అంతా నా శక్తితో భరిస్తున్నానని గీతలో పరమాత్మ అన్నమాట. అది నా ప్రేరణ వల్లనే నీకివ్వబడినది. నా ప్రేరణ వల్లనే నీవు తిన్నావు – దేనికీ నీవు కర్తవు కావు' – గీతలో కృష్ణుడన్న హృద్దేశంలో వున్నాను. అర్జునా! – అదే అహంబ్రహ్మాస్మి స్థానం. దానికాయన బాబా పాలకుడను – అంటున్నాడు. నీ సకల భావాలు తదధీనాలే తదర్పణ బుద్ధితో జీవించు – నీ మనస్సు నాకర్పించి నా పాదాలపై పెట్టి లోకంలోకి వెళ్ళు – అన్న బాబా మాటలకర్థం హృదయ కుహర మధ్యలో నున్న ఆత్మనైన నాపై కేంద్రీకరించి కర్మయోగివి కావాలని బోధ – నీవే పని చేసినా – ఏది తిన్నా – నిద్రించినా – నన్ను భావిస్తూ వుండు. గీతలో పరమాత్మ అన్నాడు కదా –

'యత్కరోషి యదశ్నాసి యజ్ఞహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణం' (10–27)

ఏం చేస్తావో, తింటావో, యజిస్తావో – ఏది ఇస్తావో, ఏది తపస్సు చేస్తావో అదంతా నాకర్పించు.

ఈశావాస్యంలో చెప్పబడ్డది.

'కుర్వన్నేవేహ కర్మాణి – జిజి విషేత్ సమా:
ఏవం త్వయి నాన్యధీతోస్తి – న కర్మ లిప్యతే నరే'॥

కర్మ చేస్తూనే నూరేళ్ళు బ్రతకాలి. మరొక మార్గం లేదు. కర్మనీ కంటదు.

ఎప్పుడంటదు ? గీతలో చెప్పినట్లు చేస్తే – సర్వం తదర్పణం చేస్తే – లేకపోతే కర్మానుబంధం తప్పదనే – ఇదే బాబా చెప్పినది.

అలా జీవించటమే యోగం.

ఇంకా గీతలో చెప్పినట్లు

'మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి యు క్త్వైవం ఆత్మానాం మత్పరాయణ'– (10–34)

నిత్యం నన్నే స్మరించు. నా భక్తుడవు కమ్ము. నన్నే యజించు. నమస్కరించు – (ఆత్మతో సమావేశమంటే)

హృదయంలోని నన్ను ఇలా సేవించు – అపుడు నీవు నన్నే పొందగలవు.

ఈ మాటలు బాబా పదేపదే చెప్పటం గమనించవచ్చును.

సూత్రధారి – అంటే నా భక్తులెక్కడున్న పిచ్చుకకు దారం కట్టి పిల్లలు లాగినట్లు, నా దగ్గరకు చేర్చుకొంటానన్న మాటకు నిదర్శనంగా గోవా నుండి వచ్చిన భక్తుల కథ ద్వారా నిరూపించబడినది. అలాగే దీక్షిత్తు వంటి వారినీ ఒకరేమిటి? –

అందరూ అలా ఆకర్షింపబడినవారే.

త్రిగుణసామరస్యం – జగన్మాత

అంటే వివరించుకోవాలి.

3. త్రిగుణముల సామరస్యమంటే సృష్టికి పూర్వావస్థ – అదేమిటో ఎవరికీ అర్థం కాని కేవల చైతన్య స్థితి.

ఋగ్వేదంలో 10వ మండలంలో 129వ సూక్తం పేరు నాసదీయము. న+ అసత్: సత్తు కానిది. సత్తు అంటే వ్యక్త విశ్వం. అసత్ – విశ్వ బీజం – అవ్యక్తం.

అక్కడేమున్నదో? సత్తా? అసత్తా – తెలియదు. ఆకాశం – అంతరిక్షం. విశ్వగోళాలేమీ లేవు. అది దేనితో ఆవరింపబడినది? అదేమిటి?– రేయింబవళ్ళు సూర్య, చంద్రులు లేరు – జన్మ లేదు, మృత్యువు లేదు. కటిక చీకటిలో అంధకారము అణిగి వున్న స్థితి – దానిలో ఒక సంకల్పం కలిగినది. అదే విశ్వ బీజం.

ఇత్యాదిగా వుంటుంది. అదేమో తనకు తానే తెలుసుకోలేని స్థితియట – జ్ఞానం, అజ్ఞానం ద్వందం లేని స్థితి. ఆ సమరస స్థితి నుండి ఏర్పడిన స్థితి – విశ్వం – అదే విశ్వమయి – జగన్మాత.

ఈ విషయం తంత్రాల్లో చాలా విస్తృతంగా చెప్పబడినది. శివశక్తి సామరస్యస్థితి – త్రిగుణ సామరస్యం. దాని సంకల్పం బీజం కాగా విశ్వ వృక్షం నిర్మించబడినది. నిర్మాత, నిర్మించబడినదీ తానే. శక్తి – ఆ శక్తిని తానని బాబా వాక్యం. ఈ విషయం శాక్తేయతంత్రాల్లో చాలా వివరించబడ్డది.

11-వ అధ్యాయంలో - బాబా కేవలానందస్వరూపుడనీ - ఈ విషయం ఉపనిషత్తుల్లో చదువుతున్నాం. కానీ దానిని భక్తులు శిరిడీలో అనుభవిస్తున్నారనీ - సర్వమున కాధారభూతుడైన బాబా ఉపాధిరహితుడనీ కవి వర్ణించినాడు.

ఉపాధి అంటే శరీరం - ఆ శరీరం విశ్వం కనుక తాను దూరాననున్న భక్తులను రక్షించగలిగినాడు. ఈ విషయం విశ్వరూపమన్న అధ్యాయంగా వ్రాయబడుతుంది.

13వ అధ్యాయంలో - బాబా అన్న మాటలివి.

"నాకిల్లూ - వాకిలీ - పెళ్ళాం బిడ్డల బాదరబందీ ఏమీ లేకపోయినా, ఈ మాయ నన్ను బాధిస్తున్నది. నన్ను నేను మరచినా ఆమెను మరువలేకున్నాను. ఎప్పుడూ ఆమె నన్నావరిస్తున్నది. ఆమె చేతులో బ్రహ్మాదులే బందీలు. ఈ ఫకీరెంత?" ఈ మాయ ఎవరు? నన్ను నేను మరవటమంటే ఏమిటి? తన స్వస్థితిని - సత్పదార్థ స్వరూపుడనైన, పరమాత్మనైన నేను, నాయథార్థ స్థితిని మరచిపోవటం - అది సంభవమా. బాబా నిత్యం సహజ సమాధిలో వుండేవాడు తప్ప - నిద్రావస్థలో, తాను నిద్రపోతున్నట్లు నీకు కన్పిస్తున్న - తింటున్నట్లు కన్పిస్తున్న అవేమీ లేనివాడు కదా (ఈ మాటలు భగవాన్ రమణ మహర్షివి)

ఆ మాటలన్నాక వెంటనే బాబా అన్నాడట - 'ఎవరు అదృష్టవంతులో, ఎవరి పాపములు క్షీణించినచో వారు నన్ను సేవించటంలో తత్పరులు కాగలరు. నిత్యం సాయి, సాయి అని స్మరిస్తే వారిని సప్త సముద్రాలు దాటించగలను.

ఈ రెంటికీ - మాయావరణానికీ, దీనికీ సంబంధమేమిటి? మాయ అంటే భ్రాంతి - మిథ్య అని అనుకొంటున్నాము. త్రాడును చూచి పామనుకోవటం. ఉదాహరణగా - ఇది వేదాంతంలోని మాట తప్ప తంత్రవిద్యలోనిది కాదు. శాక్తేయతంత్రంలోని మహామాయగా - సృష్టి నిర్మాణ శక్తిని గురించి చెప్పిన మాట. శ్రీరామకృష్ణపరమహంస కూడా అన్నారు - ఈ మహామాయాశక్తి స్వరూపమే విశ్వమంతా. హరిహర బ్రహ్మాదులూ ఆమె స్వరూపాలే, అవతారాలేనని.

లలితాసహస్ర నామాల్లో ఆ తల్లిని వాగ్దేవతలు స్తుతిస్తున్నారు.

మిథ్యా జగత్ అధిష్ఠాత్రి – అని అంటే దేనిని చూచి మనిషి యథార్థ తత్త్వ అవగాహన లేక మరొకటిగా – తన వాసనానుగుణంగా చూస్తున్నాడో ఆ జగత్తు మిథ్య. దానినామె సృష్టించిన మహాశక్తి అంటే సత్యస్వరూపిణి – చిదానందస్వరూపిణి తాను ఆధారంగా రత్నసింహాసనంగా చేసుకొని జగత్తును పాలిస్తున్నది. ఆ రత్నాలు బంగారం చూచి తనదేనని మనిషి వాంఛిస్తున్నాడు. తన స్వంతంగా చేసుకోవాలని యత్నిస్తున్నాడు. తనను – తన కోరికలను దానిపై ఆరోపించుకొని అద్ధంలో తన ముఖం తానే చూసుకొని మురిసిపోతున్నాడు. అదీ లోకమంటే – దానిని వేరు చేసుకొని భక్తితో చూస్తే త్రాడు, పాముగా కన్పించటం మానివేస్తుంది. – ఇది వేదాంత దృష్టి.

కానీ తంత్రములో వేరుగా చెప్పబడినది.

బాబా సూక్తులు – నిర్దేశాలన్న గ్రంథంలో పూజ్యశ్రీ సరసింహస్వామీజీ వ్రాసిన మాటలివి.

నానా చందోర్కరుతో అన్న మాటగా వారు వ్రాసినది. “మాయ అంటే చైతన్య శక్తి – రెంటినీ వేరు చేయలేవు – సూర్యుని నుండి వెలుగును వేరు చేయలేనట్లు. ఈ శుద్ధ చైతన్యమూ – మాయ వేరు కావు. రెండూ ఒకటే ఇదే ప్రకృతి పురుషులుగా చెప్పబడినారు. చైతన్యమొక గుహ వంటిది. దానిలోనికి వెళ్ళి తిరిగి రావటం కల్ల.

ంమాయ కార్యం (జగత్తు, సృష్టి, బీజం, పురుషుడు, శివుడు) ఆమె విచిత్రగుణాలు కలది. పరమాత్మసృష్టి, చేద్దామన్న సంకల్పశక్తి. దానిని స్వాతంత్ర్య శక్తి” – అన్నారు. నానావిధాత్మక సృష్టి. (నెమలిపింఛంలాగా) నిర్మాణశక్తి ఆమెతాను. తాను కొల్హాపుర లక్ష్మినని బాబా భక్తులకర్థమయ్యే భాషలో చెప్పాడు – శివ, శక్తుల సమ్మేళనమే సృష్టి. ఇద్దరూ వేరు కాదు – ఇది తంత్రవిద్య. దీనినే శంకరులవారు. ‘సౌందర్యలహరి’గా గానం చేసినది. కనుక బాబా నిత్యం లోకంలోకి సర్వజీవస్వరూపంగా, ఉపాధి రహితుడై, జీవులే ఉపాధులుగా, రూపాలుగా వస్తున్నాడు. ఈ విషయానికి సచ్చరిత్రలో చాలా ఉదాహరణలున్నాయి. కొన్ని ఇక్కడ

పూర్వమే చూపబడినవి (పంచయజ్ఞ సందర్భముగా) శాస్త్రీయమైన మహాతత్త్వ సరళభాషలో – ప్రతీకాదృష్టితో చెప్పాడని గ్రహిస్తే చాలు.

బాబా శ్రోతలు అమాయకులైన వ్రేపల్లెవాసుల వంటివారు. పండితులు కారు. రమణమహర్షిలాగా, శ్రీఅరవిందులలాగా, పరమహంసలాగా – కనుక వారి కర్థమయ్యే భాషలోనే చెప్పాలి కదా!

మాయాశక్తి తనను బాధిస్తున్నదంటే – నిత్య అవతారంగా తాను వస్తున్నానని, జీవరక్షణ శిక్షణలు తన బాధ్యత అని, సచ్చరిత్ర చివరి కథలో (కప్ప – పాము కథ) రక్షకుడైన నేనిక్కడుంటే పామెలా కప్పను తింటుంది? అంటే ఇదే అర్థం.

కనుక మాయాశబ్దం వేదాంత విద్యలో మాట కాదు. బాబా వేదాంతి కాదు.

ఇందుకే బాబా మరొక చోట అన్నది – నా తల్లి ప్రకృతి. తండ్రి పురుషుడు, వారి కలయిక నా జన్మకు కారణం అని. అంటే శివ శక్తుల సమ్మేళనస్వరూపమై సర్వజగత్తూ నేనే ననటం. కనుక నన్ను ఏ తల్లి కనలేదు. జగత్తునెలా కనగలదు? – ఇక్కడ బాబా విశ్వమయుడై మాట్లాడుతున్నాడు. మాయాశక్తికి రెండు రూపాలున్నాయట.

1. విశ్వాతీత స్థితి 2. విశ్వమయ స్థితి.

ఈ ఈరెండర్థాల్లో బాబా మాట్లాడటం గమనిస్తే బాబా అంటే ఏమిటో – కొంతకు కొంత భావించటానికి వీలౌతుంది. అదొక మహాసముద్రం, లోతందదు.

అనుభవించాలి. అదే 'సచ్చరిత్ర' కారుడన్నదీ – ఉపనిషత్తుల్లో చెప్పబడిన ఆనందం భక్తులు (తనవంటివారు) బాబా రూపంలో శిరిడిలో అనుభవించారు. – ఇది ఆయన చెప్పిన ఆనందం. ఎంత చెప్పినా చెప్పినట్లు కాదు కదా.

(ఇకా వివరాలకు చూ. Charters & Sayings నరసింహస్వామీజీ గ్రంథం – 19వ ఆరోపం)

మరికొన్ని చోట్ల మాయాశబ్దం భ్రాంతి అన్న అర్థంలోనూ బాబా అన్నాడు.

మాయావరణలోని బద్ధజీవుడు యధార్థతత్త్వం చూడలేదని – ఇక్కడ మాయ అంటే వ్యక్తిగతమనస్సు.

ఇదే మాయా విషయం వ్యక్తీకరిస్తూ మహాభక్తకవి సచ్చరిత్ర 20వ అధ్యాయములో అన్నాడు.

"మౌలికముగా సాయి నిరాకారుడు. భక్తుల కొరకు ఆకారమును ధరించినాడు. ఈ మహాజగన్నాటకంలో మాయ – యన్న నటి సహాయంతో వారు నటుని పాత్ర ధరించినారు" – అని.

ఇది నాటక దృష్టా చెప్పటం. నాటక ప్రారంభంలో నాందీ ప్రస్తావన లుంటాయి కదా. ప్రస్తావన నటిని సహాయంగానే చేసుకొని సూత్రధారుడు నాటక రహస్యాన్ని వ్యక్తీకరిస్తాడు.

కొన్ని నాటకాల్లో సూత్రధారుడే ప్రధాన పాత్ర ధరించి రంగం మీదకు వస్తాడు. దీని దృష్ట్యా జగన్నాటకమన్న ఉదాహరణ చెప్పబడటం ఆధ్యాత్మశాస్త్రాల్లో వున్నదే నాటకమంటే – వ్యవహారార్థములో రామపాత్ర నొక నటుడు, ధరించి నటించటం. పాత్రవేరు. – పాత్రధారివేరు. కానీ ఇక్కడ ఇద్దరూ ఒకటే. కాకపోతే పాత్రధారిగా కన్పిస్తున్న బాబా – నిరాకార పరబ్రహ్మ పాత్రను నటిస్తున్నాడు– బాబా ఒకచోట మాన్‌కర్ – అన్న భక్తునికి కొంత డబ్బిచ్చి – మచ్చీంద్రగడ్‌కు పంపించి ముప్పూటలా ధ్యానం చేసుకోమన్నాడు. ఆయనకిష్టం లేకపోయినా అలాగే ఆ కొండ మీదకు వెళ్ళి ధ్యానం చేస్తున్నాడు. కొన్నాళ్ళకు బాబా ప్రత్యక్షమై చెప్పాడు. నేను శిరిడిలో 3 1/2 మూరల దేహంకల వానిగానే నీవు భావిస్తూ వచ్చావు కదా. ఇప్పుడు చూడు. నేనిక్కడా వున్నాను అక్కడా వున్నాను – నేను దేహం కాదన్నాడు. ఇదేపైన సచ్చరిత్రకారుడన్న మాటలు. నిరాకార బ్రహ్మ, సాకారమై రావటమే లోకం. ఈ ప్రపంచం – బద్ధజీవుడు ముక్తుడు కావటానికి ఏర్పాటైన యోగరంగభూమి. కేవల ఐహిర భోగలాలసుల కర్థంకానిది. వీరిని వారిగా మార్చటానికే అవతారం వస్తుంది. శ్రీరామకృష్ణ పరమహంసాదులు వచ్చి నిర్వహించిన పాత్రపోషణ ఇదే. 23వ అధ్యాయంలో చెప్పబడిన అంశం–

ఇంతకు పూర్వం చెప్పిబడిన కారణములచే మేము సాయిని భగవంతుని అవతారముగా నెన్నుచున్నాము – అని ముగింపు వాక్యముగా చెప్పాడు. మరొక అధ్యాయములో ( 11 ) చెప్పబడినది. కొందరు సాయిబాబా భగవద్భృత్తుడనీ – కొందఱు మహాభాగవతుడనీ అంటారు కానీ మాకు ఆయన నిరాకార బ్రహ్మం సాకారమైనదనిపిస్తుంది – అని.

కృష్ణాదులను అవతారాలని ఆనాటి శిశుపాలాదులు అంగీకరించలేదు కదా.

శ్రీభగవాన్ రమణులను గురించి కావ్యకంఠ గణపతిముని 40 శ్లోకాల్లో (అర్థం) స్తుతించారు. అందులో ఒక శ్లోకము –

'కేచిద్యోగ విదాం పురస్పర ఇతి ప్రజ్ఞా విబుధ్యాపరే
సాధు: కశ్చిదితరే గురుధియా కే ప్యంఘ్రి పద్మంతవ।
సేవంతే రమణాభిధాన మనుజ క్షేమాయజాతం క్షితౌ
ద్వి త్రాస్త్వాం గిరిజాంక పీఠనిలయా జావంతిదేవం గుహ:'–

కొందరేమో నిన్ను యోగులలో అగ్రగణ్యుడవని, మరికొందరేమో సాధూత్తముడవనీ, కొందరు గురువువనీ నీ పాదపద్మాలాశ్రయిస్తున్నారు. కానీ నీవు మాత్రం మానవ క్షేమార్థం అవతరించిన పార్వతి దేవి ఒడిలోని ముద్దులబిడ్డ సుబ్రహ్మణ్యేశ్వరుడవని ఏ యిద్దరికో ముగ్గురకో తెలుసు,

ఇదే భావం హేమద్పంతు చెప్పినాడు.

రమణ మహర్షి ఎవరు? అని కొందరు జిజ్ఞాసులైన భక్తులు వారినే ప్రశ్నించారు.

రాఘువాచారి అన్న భక్తుడొకసారి రమణులను దర్శించారు (1910) అపుడు వారు అరుణాచలం పైన విరూపాక్ష గుహలో వున్నారు (1899–1910)

ఆ గుహలో రమణులొక తిన్నెపై ఆసీనులై వున్నారట. వెనుక గోడపైన దక్షిణమూర్తి చిత్రమున్నది. అపుడా భక్తుడు –

స్వామీ! నరుడు కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శనం చేసాడు. నాకా యోగ్యత

వుంటే మీ యథార్థ స్వరూప దర్శన భాగ్యం కల్పించదని – ప్రాధేయపడ్డాడట. వెంటనే రమణులదృశ్యులైనారు – వెనుక చిత్రంతో సహా. ఆ స్థానములో

అపుడు తోచినదొక మహాశూన్యం తర్వాత అందులో ఒక పెద్ద వెలుగు తోచినది. మరల రమణుల ఆకారము, దక్షిణామూర్తి చిత్రం కన్పించిన – భగవాన్ అన్నారట. నేనే నిరాకారుడను, నీవు చూచిన ఇతర దర్శనం నీవు భగవద్గీతాధ్యయన ఫలంగా తోచినవి తప్ప – అవి నేను కాను – అని.

❀ ❀ ❀

# బాబా అంటే - 3

రాఘవాచారి దర్శనములో రెండు పొరలున్నాయి-

1. రమణులు యధార్థ స్వభావమైన సహజస్థితి, నిరాకారతత్వం - ఇది వారై అనుగ్రహించినది.

2. రాఘవాచారి మనస్సులో అనుకొన్నది. అది తాను కాదని రమణులున్నారు. తాను కానిదానిని చూసినది భక్తుడైన వాని మానసిక భావన యొక్క ప్రతిబింబము.

సాధారణముగా భక్తుల ధ్యానములో ఈ భ్రాంతి దర్శనమే కల్గటం, అదీ తత్త్వ స్వరూపమనుకోవటం, భ్రమ చెందటం, తత్ఫలితాలు పొందటం, మంచికానీ చెడుకానీ జరుగుతున్నది.

శ్రీరామకృష్ణ పరమహంస దగ్గరకొక రామభక్తుడు వచ్చి నాకు రామ దర్శనమైనదన్నాడట. అదెలా వుంది చెప్పు- అన్నారట వారు. ఈయన విల్లు భుజాన తగిలించుకొని వచ్చాడంటే - "భక్త రక్షకుడు కోదండంతో సహా వచ్చాడు. ఎందుకట? ఎవరిని చంపటానికి? - అది నీవు చూచిన చిత్రాల ప్రభావం వల్ల నీ మనస్సులో నీవు కల్పించుకొన్న రూపం తప్ప - శ్రీరామదర్శనం కాదు" - అని వారన్నారట.

ఇదే రమణులన్నది - భక్తుని మనస్సు - తత్త్వం మీద ఆరోపణం జరగటం భ్రాంతి తప్ప యధార్థం కాదు - అని. కానీ కావ్య కంఠ గణపతి ముని దర్శనమిలా వున్నది. 1908- జనవరిలో భగవాన్ శిష్యులతో 'పచ్చై అమ్మన్' కోవెలలో వున్నారు. ఒకరోజు గణపతి మునికి ఒక కాంతి గోళం నక్షత్రాకారంలో రమణుల నుదురును ఆరుసార్లు తాకగా, కావ్యకంఠుల దర్శనంతో వారు షణ్ముఖ అవతారమని తెలిసినదట. ఆశువుగా వెంటనే 8 శ్లోకాలు చెప్పారట.

అందులో మొదటి శ్లోకానువాదమిది.

'యానమునకేమె నెమలి వాహనము లేదు.

స్నానమునకు మందాకిని జలము లేదు. (స్వర్ణములో గంగ)

పానమున కిన్ని ఉమ చనుబాలు లేవు

గానమున కేమె ప్రమథులగణము లేదు

శోణగిరి స్వామి నీకెట్లు స్థానమయ్యె'– (వారు సుబ్రహ్మణ్య అవతరమని భావం).

ఇలా వారి శిష్యభక్తగణానికి రమణుల యధార్థ స్వరూపం గోచరించినదట.

ఈ కుమారస్వామినే గుహుడంటారు. బాబా ఈ గుహ పేరు శుద్ధ చైతన్యమంటారనీ,– అందులోకి ప్రవేశిస్తే తిరిగి వెనక్కు రావటమంటూ వుండదనీ' అన్నారు ఇది పూర్వమే చెప్పబడినది. గుహుడంటే గుప్తమైన జ్ఞానం – సత్యం – తత్వం – పరమాత్మ పరబ్రహ్మము – ఏదైనా ఒకటే.

ఆనాటి భక్తులు, బాబాలో తమ యిష్టదేవతలను గురువులను దర్శించినారని సచ్చరిత్ర కారుడూ, పూజ్యశ్రీ నరసింహస్వామీజీ పేర్కొన్నారు. ప్రత్యేకించి బాబా గీత – అనదగ్గంత గొప్ప గ్రంథము, "మార్గ సూచకములు (నిర్దేశాలు) సూక్తులు". అన్న గ్రంథములో అలాగే ఇతరులు రాసిన గ్రంథాల్లో చెప్పారు.

ఉదా: రామదాసు భజన సమాజం – మద్రాసు వారు బాబా దర్శనం చేసినపుడు యజమాని భార్యకు శ్రీరాముడుగా కన్పించాడు. అలాగే ఒక డాక్టరుకు రామునిగా దర్శనమిచ్చాడనీ సచ్చరిత్ర చెబుతున్నది. అలాగే మారుతి, కృష్ణుడు, గణపతి, దత్తుడూ కన్పించారని వారి వారి అనుభవాలు చెప్పారు.

అంటే బాబా అన్న తెరపైన – మనమున ఇష్టదేవతల రూపాలు తోచినాయన్న మాట – అంటే అసలు బాబా ఎవరు?

నరసింహస్వామీజీ వారు ఏర్చి కూర్చిన మహాగ్రంథరాజంలో ఎన్నో విషయాలు దీనికి సంబంధించినవి చెప్పటం గమనిస్తే చాలా ఆశ్చర్యకరంగా వుంటుంది. బాబా అన్నట్లు – నా అల్లాశక్తి లీలలు – అనంతం, విచిత్రం చెప్పనలవి కాదు – అని ఈ మాటలు సచ్చరిత్రలోనే వున్నాయి.

నిర్దేశాలు – సూక్తులన్న గ్రంథం చెప్పిన విషయాలివి.

1. నన్ను నిత్య – శుద్ధ – బుద్ధ చైతన్యంగా ఆరాధించు. నన్నే పొందుతావు.

(20వ అంశం)

2. (24వ అంశం) నేను నిరాకారుడను, నేనంతటా (నిండి) వున్నాను.

3. (9) నా నేత్రం నిత్యమంతటా చూస్తుంది. అది నిత్యం నా భక్తుల యోగక్షేమాలు చూచుకొంటుంది. (ఇదే వేదములో దివివ చక్షుః, ఆతతం – ఆకాశం లాగా నేత్రం విశాలమైనది. విశాలాక్షుడన్న – అధి + అక్షము (అధ్యక్ష) అన్నా ఇదే. కనుక నీవెక్కడున్నా, ఏది చేస్తున్నా నేను చూస్తూనే వుంటాను. గుర్తుంచుకో

4. (25) నన్ను శరణన్న వారి రక్షణ బాధ్యత నాదే.

5.(35) నా భక్తులను రక్షించటానికి పడిపోతుంటే – నా చేతులు నాల్గు చాచి – కాపాడుతాను.

(నారాయణుడు – స్థితి రక్షకుడు)

6.(103) నన్ను నిరాకారానంద స్వరూపంగా ధ్యానించు. అలా చేయలేకపోతే నీవు నిత్యం చూస్తున్న ఈ రూపాన్నే ధ్యానించు. (పరమహంస కూడా అన్నారు. ఒక భక్తుడు స్వామీ! మీరు చేసిన సాధన మావల్ల కాదు కదా – మేమేం చేయాలి అంటే మీ అందరి బదులు నేను చేసాను. దీనిని – (తన శరీరాన్ని చూపిస్తూ) గుర్తుంచుకో చాలు – అని.

7. (106) నేను సాక్షీభూతుడను. నేను శరీరం, ఇంద్రియాలు కాదు. నాకు కర్మలేదు. నేనేమీ పొందేది లేదు.

8. నన్ను తెలుసుకోవాలంటే – నేనెవరను?' – అని నిత్యం శ్రవణ మననం ద్వారా ధ్యానించు.

ఈ ప్రపంచం నీవు. నేను ఎవరు? ఎక్కడి నుండి. ఇదంతా వస్తున్నది, పోతున్నదని విచారించు.

9. లోకం భేదబుద్ధితో బ్రతుకుతుంది. నీవూ, (111) నేనూ, నాదీ, నీదీ అని ఇది భ్రమ. నేను నీలో వున్నాను. నీవు నాలో వున్నావు.

10 ఎవరినీ ద్వేషించకు. ఎవరికెవరు శత్రువు కాదు అంతా ఒకటే – (భారతంలో చెప్పబడినది. ఒక మంత్రమున్నది. నిత్యం జపించదగ్గది.

1. న మమ – నాది కాదు.

లోకం – మమ అనుకోవటం పాపం – అసత్యం.

11. (37) ఈ శుద్ధ బ్రహ్మణుడు (అంటే మహాయోగి) తెల్లనివాడు (బాబారంగు తెలుపు) ఇతడే లక్షలమందిని శుభ్రమార్గములో నడిపిస్తాడు. (శుభ్రమార్గము – ముక్తిమార్గము)

12. – నేను అల్లాను. మహాలక్ష్మిని మసీదులో ఫకీరు సత్యమే చెబుతాడు. నేను పండరి విఠోబ్రాను పండరి వెళ్ళి చూడు (నానా చందోర్కరుతో అన్నాడు)

"తల్లి సీవింటిలో నిత్యం పూజించే గణపతి నైవేద్యం నేనే ఆరగిస్తున్నాను." ఒక భక్తురాలు దూరగ్రామము నుండి వస్తే – నీవు నాకు తెలుసునన్నాడు. బాబా– ఆమె విస్తుపోయి 'నేనిపుడే కదా నీ దగ్గరకు వస్తున్నాను. అంటే బాబా చెప్పిన మాటలివి. నేను దత్తాత్రేయుడను (గంగాపూర్ భక్తునితో) నేనే లక్ష్మీనారాయణుడను. నీ చేయి నా పాదాల క్రింద చాచు. గంగదాకా పోవటం దేనికి? – (దాసగణుతో)

నీ ధ్యానంలో ఈ సాయి కన్పించినా ఒకటే శ్రీలక్ష్మి నారాయణుడను కన్పించినా ఒక్కటే. ఏమీ పర్వాలేదు.

ఒకేసారి శ్రీఅరవిందమహాయోగి భక్తుడన్నాడట–

గురూజీ! నేను కృష్ణధ్యానం చేస్తుంటే తమరూపం కన్పిస్తున్నది. ఎలా అంటే వారన్నారట–

'ఏదైనా ఒకటి నష్టం లేదు' – అని.

వారు కృష్ణావతారంగా ప్రకటించుకొన్నారు.

13. (105) – నేను భగవంతుని కన్నాను.

(అతనికి తండ్రిని లేదా తల్లిని) కనుక నన్ను కేవలానంద స్వరూపంగా భావించు.

ఇది చాలా గొప్పసూక్తి. వేదసూక్తం వంటిది. ఎందుకంటే భగవంతుడెవ్వడు? ఆయనను కన్నదెవ్వరు?

ఋగ్వేదంలోని దేవీసూక్తము'లో 7వ మంత్రములో పరమేశ్వరి అన్నది.

"నేనే విశ్వానికి పూర్వం తండ్రిని కన్నాను, నాగర్భం (బీజం) సముద్రములో నిక్షేపించాను. అక్కడి నుండి విశ్వమంతా వ్యాపించాను. దూరాన వున్న ఆకాశాన్ని సన్నిహితమైనదిగా స్పృశిస్తాను. నా వర్షించే ప్రవాహం ద్వారా అక్కడ ప్రవేశిస్తున్నాను. –ఇది మంత్ర భావం.

'అహం సువే పితర మస్య మూర్ధన్
మమ యోని: అప్సు అంత: సముద్రే
తతో వితిష్ఠే భువనాను విశ్వో
తామూం ద్యాం వర్ష్మణోప స్పృశామి'॥

ఇది ఆ మంత్రము.

సముద్రమంటే సృష్టికి పూర్వమున్న మహాచైతన్యం. (నిర్గుణం – నిరాకారం, గంభీరం కనుక సముద్రం)

అందులో తన గర్భమున్నదంటే – కన్నతల్లి – దానినుండి త్రిమూర్తులుద్భవించారు. వారి నుండి ఆకాశం (Space) ఏర్పడినది. దానినుండి జీవ ప్రపంచము వర్షం లాగా భూమి పై – సస్యంగా మొలిచింది. ఆ వర్షం దివినీ – భువినీ కలుపుతున్నది. ఇదంతా దేవి స్వరూపం. మహాశక్తి మహాదేవి – అని భావం

సృష్టి అంతా తానేనని చెప్పటం. ఇదే బాబా చెప్పిన మాటకర్థము,

134 (54) (ఉద్ధవేశబువాతో) నేనే కృష్ణుడను నాకు 11రూ॥లు దక్షిణగా ఇవ్వు.

ఉ.బు : నా దశేంద్రియాలు (జ్ఞానేంద్రియాలు – 5, కర్మేంద్రియాలు– 5 (10) – మనసు తో పాటుగా నీకెప్పుడో ఇచ్చాను.

బాబా : అవి ఇవ్వటానికి నీవెవడవు. అవి ఎప్పుడో నావే. నిత్యం పారాయణం చేయి.

ఉ.బు : ఏది?

బాబా : ఏది నీకు చెప్పానో, నీతో మాట్లాడానో ఇప్పుడు చెబుతున్నానో అది.

ఉ.బు : గీతావ్యాఖ్యానం జ్ఞానేశ్వరా?

బాబా : బాపూ సాహేబ్ ఏది చదువుతూ, చెబుతున్నాడో పోయి దానిని తీసుకొనిరా.

ఉద్ధవేశ్‌బువా వెళ్ళి భాగవతం 11 - వ స్కంధం తెస్తే బాబా వెంటనే దానిలోకి తన వ్రేలు గ్రుచ్చాడు.

కృష్ణ- ఉద్ధవ సంవాదం వచ్చినది. అది చూపించి బాబా అన్నాడు. 'ఇది పారాయణం చేయి నా పాదాలచెంత కూర్చో ధ్యానించు.

అదే బాబా అడిగిన 11రూ॥ల దక్షిణ అని నరసింహస్వామిజీ అన్నారు.

భావమేమంటే తనువూ (దశేంద్రియాలు) మనస్సు బాబాకు సమర్పించి - శరణనటం - పాదాల దగ్గర కూర్చొని ధ్యానం చేయటమంటే శరణాగతి చెందమనటం.

గురు సేవా పుత్తాంతంలో సచ్చరిత్ర బాబా చెప్పినదిదే.

15. (145) బాబా కులకర్ణితో - నీవు ముందుగా నెవాసాలోని మెహినీ రాజు దర్శనం చేయి ఆయన సగుణ బ్రహ్మ ఆ తర్వాత డిప్యూటీ కలెక్టరు దగ్గరకు వెళ్ళు. (కులకర్ణి అలాగే చేసాడు. అతని మీదున్న కేసు కొట్టివేసింది ప్రభుత్వం)

మోహినీ రాజన్న దైవం నెవాసా అన్న గ్రామంలో ఉన్న స్వామి.

ఈ విధమైన అంశాలనేక మాగ్రంథంలో గుది గ్రుచ్చబడినవి. దీని భావమేమిటి? - బాబా అంటే సాకార, నిరాకార బ్రహ్మమే లేదా కారణబ్రహ్మము. కార్యబ్రహ్మము.

మూర్తి పూజ కూడా చాలా ప్రోత్సహించాడు. మోహినీ రాజన్న దైవం విషయం దీనికి సంబంధించినదే. దేవాలయాలు, పూజలు వ్యర్థం కావు.

కృష్ణప్రేమ అన్న భక్తుడు పాశ్చాత్యుడు. మన దేశం వచ్చి ఉద్యోగనిమిత్తంగా,

యశోదామా అన్న కృష్ణభక్తురాలకు శిష్యుడై హిమాలయాల్లో కృష్ణాశ్రమంలో గురువుగారితో పాటు వుండేవాడు. ఆయన ఒకసారి దక్షిణదేశం వచ్చి శ్రీరమణ మహర్షిని శ్రీ అరవింద మహాయోగినీ దర్శించి, శ్రీరంగం వెళ్ళి రంగనాథ దర్శనం చేస్తే ధ్యానంలో ఆ స్వామి ఒక పెద్ద వెలుగు సముద్రంగా, చైతన్య సముద్రంగా కన్పించాడట. అప్పుడాయన వ్రాసాడు 'దేవాలయం ఉనికి ఊరకే రాలేదు. అక్కడ పరమాత్మ ఆ విగ్రహరూపంలో వున్నాడని." దీనినే శ్రీవైష్ణవమతం అర్చావతారంగా ఆరాధించి ప్రచారం చేసినది. కృష్ణాద్యవతారాలు నిత్యమూ వుండేవి కావు కదా. నిత్యమూ మనం కొలిచే క్షేత్రాధి దైవములూ అవతారాలే. శ్రీ రామకృష్ణపరమహంస దక్షిణేశ్వరంలో కాళీ మహాదేవి విగ్రహార్చన వల్లనే అంత గొప్పవాడైనాడు. ఆయన నుండే ఆధునికయుగారంభం జరిగినది. కనుక మూర్తి పూజ, క్షేత్ర దైవ దర్శనం బాబా వంటివే.

నరసింహస్వామిగారు వ్రాసిన ఈ ఆంగ్ల గ్రంథానికి పీఠిక వ్రాస్తూ ఇండోరు ఉన్నత న్యాయస్థానంలో న్యాయాధిపతి రేగే గారన్నారు –

1. బాబా ఎల్లప్పుడూ వివిధ స్థాయిల్లో మాట్లాడేవారు. ఒకసారి నేనే శివుడనని, మరొకసారి అల్లా బానిసనని, జీవుడనని, జీవులకు బానిసనని – ఇలా.

మానవుని బుద్ధి కగమ్య గోచరమైన తత్త్వం బాబా – అని తేల్చారు. కేనోపనిషత్తులో చెప్పబడ్డట్లు శుద్ధ చైతన్యం మనస్సునకూ, వాక్కునకూ అందదు – అలాంటివాడు బాబా.

కానీ ఆ పరమాత్మ మనకు సన్నిహితం కాకపోతే గతిలేదు. కనుక ఆయనే ఇదంతా ఐనాడని భావించాలి. కనుక నే అల్లా దగ్గరి నుండి కుక్క, పిల్లి దాకా తానే ననవలసి వచ్చినది బాబ.

'సర్వం ఖల్విదం బ్రహ్మ' – ఇదంతా బ్రహ్మస్వరూపమేనని వేదమన్నట్లుగా ఆ దృష్టితో జీవించాలి. ప్రతీ వస్తువూ, జీవు కానిదీ అంతా బాబాగానే ఉపాసించటమే మహాసాధన'– అని తాత్పర్యం. ఆయన జీవితమంతా దీనినే బోధిస్తున్నది. పారాయణమంటే దీనిని భావింపజేసేది – ఈ భావనతో చేయాలని తాత్పర్యం.

# విశ్వరూపం

**'మత్త: పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ**
**మయిసర్వమిదం ప్రోతం సూత్రేమణిగణ ఇవ' (గీత 7-7) శ్రీ**

(నాకంటే అన్యమేమీ లేదు. మణిహారంలో సూత్రంలాగా విశ్వమంతా గ్రుచ్చబడినది)

**'తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత**
**తత్ప్రసాదాత్ పరాంశాంతింస్థానం ప్రాప్యసి శాశ్వతం' (18-7)**
**'ఈశ్వర: సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా'- (18-61)**

(సర్వజీవుల హృదయాల్లో ఈశ్వరుడున్నాడు. అతడే విశ్వయంత్రాన్ని త్రిప్పుతున్నాడు. అతనినే శరణను, నీ సర్వస్వం సమర్పిస్తూ ఆయన దయవల్ల శాంతిస్థానం పొందగలవు)

నానా చందోర్కరు బాబా భక్తుల్లో గీతాభాష్యాదులు చదివిన వాడని తెలిసినదే.

ఆయనొకసారి ఖాందేషు జిల్లాలో - పచోరా దగ్గరగా 10-12 మైళ్ళ దూరంలో అడవి మార్గములో ఒక గుట్టపైన పద్మాలయాదేవి ఆలయానికి వెళ్ళాడు. ఆ గుడికి దగ్గరగా అడవిలో ఒక మైలు దూరంలో వున్న గుహలో నివసిస్తూ 'గోవింద బువా' అన్న సాధువున్నాడట. ఆయన ఆ గుడిలో గజాననుని పూజిస్తూ ఉదయం నుండి రాత్రి 10 గంటల దాకా వుండి వచ్చి పోయే భక్తులకు సౌకర్యాలేర్పాటు చేస్తూ వుండేవాడు. నానా ఆ గుట్టకు బయలుదేరి - రాత్రికి అడవిలో నుండి పోయి 10 గంటల తర్వాత గుడికి చేరుకొన్నాడు. అప్పటికి గోవింద బువా వుంటాడు కదా. నానా ఏమో నడచి తిండిలేక శోషపడుతూ బాబాను ప్రార్థించాడట. బాబా ఆకలిగా వుండి కాస్తా టీ అయినా దొరికితే బాగుండునని,

అది అడవి గుడి తలుపులు మూసే సమయం కానీ ఆ రోజున చిత్రంగా గోవింబువా టీతో ఆయన కోసం ఎదురు చూస్తూ రాగానే అందిచ్చాడు. నానా ఆశ్చర్యంగా చూస్తుంటే ఆయన అన్నాడట – 'ఇంతకు ముందుగానే బాబా కబురు విన్పించింది. నానా వస్తున్నాడు. ఆకలిగా వున్నాడు. కనుక నీవు అతనికి టీ ఇవ్వాలి. 10 దాటినా ఇక్కడే వుండు' – అని.

ఈ సందేశం బాబా గోవిందబువా అంతర్యామిగా విన్పించినదని భావించవచ్చుగదా.

చందోర్కరు ఒక వేసవి కాలంలో హరిశ్చంద్ర గుట్ట (అహమ్మదు నగరం జిల్లాలోని ఒక కొండ) పైన జాతరకు వెళ్ళాడు. కొండ ఎక్కేసరికి మిట్ట మధ్యాహ్నం కాగా ఆయనకు గొంతెండి పోయినది. ఎక్కడా నీరు లేదు. ప్రక్కనున్న వారితో అన్నాడట – బాబా ఇక్కడుంటే బాగుండేది కదా అన్నాడట. వారన్నారు 'బాబా శిరిడిలో వుంటాడు ఇక్కడ ఎందుకుంటాడు. నెమ్మదిగా నడుద్దాం – అన్నారట.

ఇంతలో ఇక్కడ శిరిడీలో మసీదులో బాబా మాధవరావు దేశపాండేతో అన్నాడు 'నానా దాహంతో తపిస్తున్నాడు. ఆదుకోవాలి కదా' అని.

అక్కడ కొండమీద నానా ఎక్కలేక ఒక రాయిపై కూలబడిపోగా, ఒక అడవి జాతివాడు కట్టెల మోపుతో వస్తూ – ఎందుకయ్యా అలా రొప్పుతూ, రోజుతూ వుంటావు. నీవు కూర్చున్న రాతి క్రిందనే నీరుంది. త్రాగితే పోలా' – అన్నాడు. సరే, రాతిని తొలగిస్తే స్వచ్ఛ జలముంది. త్రాగాడు. దాహం తీర్చుకోవటం జరిగింది.

ఆ భిల్లుడు ఆ బండ క్రింద నీరున్నదని ఎలా తెలుసుకోగలిగాడని ఆలోచిస్తే – అతడే బాబా – అని తెలిసిపోతుంది కదా.

ఎవరికెన్ని రూపాల్లో బాబా – కన్పించాడో – కథల ద్వారా తెలుస్తుంది. అంబే బాబా సకల జీవుల రూపాల్లో సంచరిస్తున్నాడన్న మాటే కదా!

వేదంలో మహారుద్రంలో చెప్పబడినది. "ప్రతీరోజూ నీరు తెచ్చుకునే ప్రతి వ్యక్తికీ ఆయన కన్పిస్తూనే ఉన్నాడ"ని.

అలాగే అన్నాడట ఒక భక్తునితో

"నానా! దత్తుడు నిత్యం నీకెదురుపడుతూనే ఉన్నాడు. కన్పించడం లేదంటే నేనేం చేయను" అని.

ఆ బండలాంటి 'అహం' (నేను)ను తొలగించుకుంటే దాని క్రిందనే నీరున్నదన్నమాటే కదా.

ఆ బండమీదే బాబా కూర్చున్నది. క్రిందా, పైనా తానే అమృతంలాగా వున్నాడు. ఆ బండ పేరు – నా మనస్సు – అహం – దానిమీదున్న బాబాను స్మరించుకోవాలి అంతే.

దేవుగారి ఉద్యాపన వ్రతం భోజనానికి వెళ్ళిన ముగ్గురూ బాబా – జోగు – మరొకరని బాబాయే అన్నాడు కదా!

నన్ను గుర్తించని వాడు నన్నెందుకు రమ్మనాలి – అనీ అన్నాడు. అంటే ప్రతి రూపమూ తానే, ప్రతి జీవి తానే, పురుగు పుట్ర – చెట్టు, చేమ ఒక మనిషే కాదు అన్నీ తానేనని నిదర్శన పూర్వకంగా చెప్పటమే కదా!

ఇందుకే సచ్చరిత్ర కారుడన్నాడు 10వ అధ్యాయము – బాబా సగుణావతారం అన్నచోట

"ఆత్మ జ్ఞానమునకాయన గని. దివ్యానందమునకునికిపట్టు. సాయి దివ్య స్వరూపం ఆద్యంత రహితమైనది. విశ్వమంతా వ్యాపించినది' – ఇత్యాదిగ

నరసింహస్వామీజీ వ్రాసిన పై ఆంగ్ల గ్రంథములో 116వ అంశం క్రింద బాబా అన్న మాటలు దాహరించాడు. "సంసారములో నీవెలా మెలగాలో చెబుతాను విను. ధనాన్ని దానధర్మాల క్రింద వినియోగించు. అందరినీ దయతో చూడు. నీ కర్మలను ఆనందంతో నిర్వహించు. ఈ సంసారమంతా దైవమే. అంతా అతనిదే – నాది కాదు అని బ్రతుకు"

68వ అంశంగా – నేను పంచభూత స్వరూపుడను – అన్నిటా అంతటా ఉన్నాను. ఆకలైన వాడికన్నం పెడితే నాకర్పించినట్లే. ఈ కుక్కలోనూ, దోమలోనూ నేనే ఉన్నాను.

48. "నా భక్తుడు నీలో, తనలో ప్రతి జీవిలో నన్నే చూస్తూ సర్వమూ

గురుమయంగా దర్శిస్తే నీవు నాలో లీనం కాగలవు.” (దీనినే యోగినీతంత్రమన్న గ్రంథమిలా చెప్పినది. “దేశ కాల పదార్థాత్మకమైన ఏయే వస్తువు ఎలా ఎలా కన్పిస్తుందో ఆయా రూపాల్లో ప్రకాశించే చిత్కళకు నమస్కారం. ఆ చిత్కళా స్వరూపం జగజ్జనని –”

(అదే బాబా – అదే శివుడు.)

జామ్నేర్ చమత్కారం

ఖాండేషు జిల్లాలో, శిరిడీకి 100 మైళ్ళ దూరములో జామ్నేరున్నది. అక్కడ నానా చందోర్కరుద్యోగం చేస్తున్నాడు. అతని కూతురు మైనాతాయి ప్రసవవేదన పడుతున్నది. చందోర్కరు దగ్గర ఊధీ లేదు. ఇది అక్కడి స్థితి. ఇక్కడ శిరిడీ మసీదులో రామగిరిబువా – అన్న భక్తుడు స్వగ్రామం (ఖాండేషు జిల్లాలో) పోయే ప్రయత్నంలో వున్నాడు. బాబా అతనికి ఊధీ ఇచ్చి, ఒక హారతి పాట వ్రాయించి ఇస్తూ – నీవు జామ్నేరు పోయి చందోర్కరుకీ పాట – ఊధీ ఇవ్వాలన్నాడు. ఆయన బాబా నా దగ్గరున్న డబ్బు జలగాం దాకా సరిపోతుంది. ఆ తర్వాత 30 మైళ్ళలోని జామ్నేరు పోవటానికి డబ్బు చాలదన్నాడు. ఫర్వాలేదులే – అన్నీ అల్లా చూచుకొంటాడు వెళ్ళు అన్నాడు బాబా. సరే ఈయన జలగాం స్టేషన్లో దిగేసరికి రాత్రి 2–3 గంటలయినది. జేబులో రెండే అణాలున్నవి. స్టేషన్ బయటకు వచ్చాడు. అక్కడ ఒక క్రొత్త టాంగా పెద్ద గుఱ్ఱాలతో పెట్టుకొన్న గడ్డాలు, మీసాలున్నాయన బాపుగిరి బువా' – ఎవరని అరుస్తున్నాడు. (ఈ పేరును బాబాయే పిలుస్తాడు. అందరూ రామగిర్ బువ అనే అంటారట) నేనేనని ఈయన రావటం జట్కాబండి ఎక్కటం, పోవటం జరిగినది. తెల్లవారేసరికి జామ్నేరు సరిహద్దుల్లో ఒక సెలయేరు దగ్గర బండినాపి, జట్కావాలా, గుఱ్ఱాలకు నీళ్ళు త్రాగించటానికి పోతూ, బువాకు నాస్తా' పెట్టినాడు. ఈయన కొంచెమావలకు వెళ్ళి వచ్చేసరికి టాంగా లేదు. తర్వాత కథ తెలిసినదే (సచ్చరిత్ర 33వ అధ్యాయము) ఇక్కడ వ్యాఖ్యానించుకోదగ్గ అంశాలు –

1. బువా మసీదులో బాబా మాటలకు పూర్తిగా విశ్వసించి (డబ్బు లేకపోయినా) వెళ్ళటం.

ఇది గురువాక్యం మీదుండవలసిన శ్రద్ధ – విశ్వాసం.

2. జట్కా బండి ఏమిటి? – అది మాయం కావటం వల్ల సాధారణమైన బండి కాదన్నమాటే కదా. బాపూ గిరిబువా అని పిలవటం వల్ల – నేను ఫలానా అని బువాకు గుర్తు చేయటమే కదా. దేవ్ గారి ఉద్యాపన విందుకు వెళ్ళిన బాబా – నేను నీవిందు కోసం వచ్చాను. చందా కోసం రాలేదు అన్నాడు. ఆయన సంతోషిస్తే బాబా మరొకమాట అన్నాడు. నాతోపాటు ఇంకా ఇద్దరున్నారు – అని తాను వ్రాయించిన వుత్తరంలోని మాట (ముగ్గురు వస్తాము) అన్నది. సూచించాడు. ఆయన గ్రహించలేదు. ఇక్కడ బువా కూడా గ్రహించలేదు.

**జట్కా బండి రహస్యం**

**'ఆత్మానం రథినం విద్ధి – శరీరం రథమేవచ**

**బుద్ధింతు సారథిం విద్ధి – మనః ప్రగ్రహ మేవచ' –**

అని కఠం 1–3లో 3వ మంత్రములో ప్రారంభించి, తర్వాత 2–3 మంత్రాల్లో రథ వివరణం చేస్తుంది.

'శరీరమే రథం. ఆత్మ రథికుడు. బుద్ధిసారథి, మనస్సు పగ్గం. ఇంద్రియాలు గుఱ్ఱాలు అవి పరుగుదీసే దారులే ఆకర్షణీయ సామగ్రి.(లోకం)

ఈ ఆత్మ – బుద్ధి – ఇంద్రియాలు కలిస్తే భోక్త అనుభవించేవాడు. విజ్ఞానవంతుడు. ఏకాగ్రబుద్ధి కలవాడు. వానికింద్రియాలు మనస్సు వశంలో వున్నందున రథగమనం సాఫీగా వుంటుంది. అవి జ్ఞానికి విరుద్ధంగా ఉంటుంది. వాడే సంసారి – ఇదే శల్యసారథ్యం. అదే కృష్ణసారథ్యంగా భారతములో చెప్పిన మాట.

ఈ కథలో టాంగా కృష్ణరథం, రథికుడు బువా. సారథి కృష్ణుడు. ధ్యేయం భక్తరక్షణ.

బాబా కథలో విషయమిలా గుప్తంగా వుంటుంది. వాఖ్యానం మనవంతు. మతానుభవాన్ని కల్గించే దైవం తప్ప పండితుని వలె వ్యాఖ్యానించేవాడు కాడు

బాబా. ఇందుకే ఈశావాస్య వివరణ మడిగిన దాసగణుకి బొంబాయిలో దీక్షిత్తు ఇంటిలో నౌకరు పిల్ల చెబుతుంది పొమ్మన్నాడు తప్ప తానేమీ వివరించలేదు. ఆ పిల్లకేమి తెలుసు గనుక?

కానీ ఆ పిల్ల ఆనందం వల్ల దాసగణుకి బోధపడినది. ఇదీ అనుభవం. బాబా విషయాన్ని వివరించటం. ఇక్కడ అనుభవముంటుంది. వాఖ్యానముండదు. ఇది ఆచార్యుల పని. అది దైవం పని. బాబా కథ ప్రతీక – భాష ప్రతీక. (ఇది వేదలక్షణం, దీనిని పురాణం వివరిస్తుంది. కథారూపంలో, బాబా కథ పురాణం దానికడుగున రహస్యముంటుంది.)

బాబా మహా సమాధి చెందిన తర్వాత ఆయన భక్తుడు యం.బి.రేగే – ఇండోర్ ఉన్నత న్యాయస్థానాధిపతి (నరసింహస్వామీజీ Charters అన్న గ్రంథానికి పీఠిక వ్రాసినతడు) 1928లో దక్షిణేశ్వరం వెళ్ళాడు. పరమహంస తపస్సు చేసిన దేవాలయం – విగ్రహాలు – ప్రదేశాలు చూడాలని. ఒక మార్గదర్శినినేర్పాటు చేసుకోగా అన్నీ చూచినాక అతనితో రేగే అన్నాడట – 'పరమహంసతో ఆడుకున్న రామలాల్ విగ్రహం చూపమని. ఆయన గుళ్ళో పెద్ద విగ్రహం చూపించాడట. ఇది కాదని ఈయన, ఔనని ఆయన వాదించుకొంటుండగా – ఆలయ పూజారి ఒకరు వచ్చి నేను చూపిస్తానని రేగేను తీసుకొని వెళ్ళి చూపించాడట. ఇంకా దేవాలయంలోని పరమహంస పూజించిన విగ్రహాలను చూపించి, తాకించి అన్నీ అయిపోయిన పిదప పూజారి అన్నాడట – 'రాత్రి నా కలలో ఎవరో చెప్పారు. రేపు ప్రొద్దున దక్కను నుండి ఒక భక్తుడు వస్తాడు. ఆయనకన్నీ చూపించమని' అని చెప్పారు. అందుకని మీరెక్కడ నుండి వచ్చారో అడిగి తెలుసుకొన్నాకనే నేనివన్నీ చూపించాను. నాకు మీరేమీ డబ్బివ్వక్కర్లేదు – అన్నాడు. రేగే ఇందతా బాబా కారుణ్యంగా భావించాడు. (ఈ రచయితకొక చిన్న అనుభవమున్నది. తానొకసారి దక్షిణేశ్వరం పోయి పరమహంస తిరిగిన దివ్య ప్రదేశాలు, ఆలయాదులు చూచి వద్దామని – అప్పుడాయన శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. బహుశా 1990 ప్రాంతం కావచ్చు. కానీ కలకత్తాలో ఎవరూ తెలియదే

ఎలా వెళ్ళాలి – అనుకొంటువుండగా – ఒక రోజున అకస్మాత్తుగా ఎవరో తెలియని వ్యక్తి నుండి కలకత్తాలో బాబా సంస్థకు సంబంధించిన మనిషి ఉత్తరం వ్రాసాడు. ఓహో! ఈయన ద్వారా మనం ఆయా ప్రదేశాలు చూడవచ్చున్న మాట – అని అనుకొన్నారు. కానీ వెళ్ళలేకపోవటమొక దురదృష్టము. (అప్పటికీ రేగే విషయం తెలియదు) కానీ బాబా విశ్వమూర్తి. అంతటా వ్యాప్తమైన దివ్యతేజస్సనటానికొక నిదర్శనం.)

ఓస్‌బోర్న్ రమణ మహర్షి శిష్యుడు – భక్తుడు దీర్ఘకాలం వారి దగ్గరున్నవాడు. వారి మార్గంలో సాధనచేసి తరించినాడాయన. రమణులపైన – బాబా పైన గ్రంథాలు వ్రాసాడు. బాబాపైన వ్రాసిన ఆంగ్ర గ్రంథం పేరు –

'నమ్మశక్యంకాని (మహత్తులుకల) శిరిడి బాబా –

'The incredible Sai Baba' 1957

అందులోని ఒక ఉదంతం –

కలకత్తాలో ఆయన కళాశాలాధ్యక్షులుగా వున్నపుడు తనకు ప్రక్క ఇంట్లో 'దట్టన్' అన్న ఆంగ్లవనిత – అవివాహిత – నర్సుగా బ్రతుకుతూ – ఆ వుద్యోగం పోయి – బంధువులు లేనిదై నిరుపేదగా వుంటున్నది. ఆమె ఒకరోజు దిగులుగా తన గదిలో కూర్చున్నది. అపుడొక ఫకీరు వచ్చి ఆమె నోదార్చి – దిగులు పడవద్దు తల్లీ నీకు మంచి రోజులు వస్తాయి. నీ మేనల్లుని దగ్గరకు వెళ్ళు (ఆయన కలకత్తా దగ్గర్లో ఒక వూళ్ళో వుంటున్నాడు – అని చెప్పి నాకు దక్షిణ ఏమైనా ఇస్తావా? అని అడిగితే ఆమె "అయ్యో! నా దగ్గర పైసా లేదు. ఏమివ్వగలవన్న"దట. ఆయన నవ్వి – నీవు మర్చిపోయావు. ఫలానా అల్మారాలో 35 రూ॥లు పెట్టావు చూచుకో – అన్నాడట. ఈమె వెతికితే నిజంగా ఆ సొమ్మునది. ఆమె దక్షిణ ఇవ్వటానికి వెనక్కు తిరిగేసరికి ఎవరూ లేరు. గది తలుపులు పెట్టే వున్నవి. రావటం – పోవటం కుదరదు. ఆమె ఆశ్చర్యపడినది. ఈ సంగతంతా 'ఓస్‌బర్న్'తో చెబితే – ఆయన అడిగాడట. ఆయన ఎలా వున్నాడని – ఈమె ఫకీరులాగా వున్నాడు తలకు ఏదో రుమాలు చుట్టుకొని కన్పించాడన్నది. ఈయన వెంటనే తన గదిలోకి బాబా ఫోటో

తెచ్చి చూపించాడట. ఈమె 'ఔను' – ఈయనే అన్నదట.

సాయిబాబాను గురించి ఈమెకేమి తెలియదట. అంతకు పూర్వం, తెలియని ఆమె దగ్గరకు పోయి ఓదార్చడమేమిటి? ఆ తర్వాత ఆమె జీవితం చాలా హాయిగా గడిచిపోయినదట.

ఈ సంఘటన తేదీ తెలియదు కానీ అప్పటికి బాబా మహాసమాధి చెంది చాలా కాలమైనదని మాత్రం స్పష్టము.

❊ ❊ ❊

# విశ్వరూపం

విశ్వరూప సందర్శనానంతరం అర్జునుడు

క్రృష్ణుని స్తుతిస్తూ 10– 15 శ్లోకాల్లో ఆశ్చర్యాని వ్యక్తం చేశాడు– సభక్తికముగా–

**'పశ్యామి దేహం స్తవ దేవ దేహే**

**సర్వాంస్తథా భూత విశేష సంఘాన్**

**బ్రహ్మాణమీశం కమలాసనస్థం**

**ఋషీంశ్చ సర్వానురాగాంశ్చ దివ్యాన్' (11–15)**

ఇది మొదలుగా

**'ఆఖ్యాహి భావానుగ్రరూపో**

**నమోస్తుతే దేవ వారప్రసీద**

**విజ్ఞానతుమిచ్ఛామి భవంతమాద్యం**

**నహి ప్రజానామి తవ ప్రవృత్తిం – (31)**

అన్నంత వరకూ అ అద్భుతస్తుతి సాగినది, " స్వామీ నీదేహములో సర్వభూతాలు – త్రిమూర్తులు– ఋషులు– నాగులూ – అందరూ దర్శన మిస్తున్నారు గదా! –

ఓయి భయంకర (విశ్వతోముఖ) రూపుడా నీవెవ్వరవు? తండ్రి తెలుసు కోవాలను కొంటున్నాను, ని అద్యస్థితి రూపమేది? నీ ప్రవృత్తి ఎమిటి?" అన్ని ప్రశ్నించాడు అంతచూచినాక ఈ ప్రశ్న ఎమిటి?

మనము ఇదే స్థితిలో వున్నాం , ఇంత కథ విని, బాబా ఎవరు? అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలింది.

ఏవరో? – అన్న ప్రశ్న వేయకచూచింది అనుభవించు – మరమాన్నం ఆస్వాదించాలి తప్ప ఎలా తయారు చేశారు? ఈ రుచికి కారాణమేమిటి? ఎవరు చేసారు – అన్న ప్రశ్నలేమిటి?– ఎవరో చేసారు – బాగుంది – తిను. నీ కర్తవ్యమింతే.

బాబా పుట్టుపూర్వోత్తరాలేవీ తెలియవు. తెలుపక పోవటానికి కారణమేమిటో? ఒక్కటే సమాధానం ఆది మధ్యాంత రహితుడైన భగవంతునికి పుట్టుపూర్వోత్తరాలు లేవు.

## అయోనిజ వాదం

పురాణాల్లో సీతా, ద్రౌపదులు, ధృష్టద్యుమ్నాదులు అయోనిజులని చెప్పబడటం తెలిసిందే. యజ్ఞ కుండంలోనుండి పుట్టినట్లూ యజ్ఞం కోసం నేల దున్నుతుంటె సీత పెట్టె నుండి బహిర్గతమైనది కదా కథ, వ్యాసాదులు, సద్యోజాతులు అనీ అన్నారు. అప్పుడే జన్మించి పెద్దవాడైనాడట. ఈ కథలకర్థాలేమిటీ?

పడలూరు రామలింగస్వామి చెప్పిన విషయం చూచాం కదా. ఆది ఇది.

1. సాధారణ మైథున సృష్టి; దీనినాయన అణుసృష్టి అన్నారు.

2. పరమాణుపక్ష సృష్టి ; భర్త స్పర్శతో గర్భధారణ జరుగుతుంది.

3. ప్రకృతి పక్ష సృష్టి : కేవల ఇచ్ఛతో జరిగే గర్భధారణ

4. శంభుప్రకాశ సృష్టి : ఇందులో సాధరణ, ఆసాధరణ భేదాలు రెండున్నాయి.

1. సద్యోజాత సృష్టి : గర్భం నుండి క్షణకాలంలో జన్మించటం– వ్యాసాదులు.

2. స్వయంగా పరమాత్మ శరీరాన్ని సృష్టించుకోవటం. శివలింగాలు స్వయంభూతములుగా చెప్పటం వింటున్నాం వాటినే లోకంలో స్వామి వెలిసాడనటం కద్దు. తానై బయటపడటం భూగర్భం నుండి. ఇవి చాలా చోట్ల విన్పిస్తాయి.

5. విభుపక్ష సృష్టి; ఋష్యాదుల దర్శనమాత్రం చేత జడ పదార్థం మానవునిగా రూపొందటం.

దీనికుదాహరణ– మహాభారతంలో ‘ అనుశాసనికం’ లేదా ‘అశ్వమేధపర్వంలో

వ్యాసమహర్షి దారిన పోతూ వుండగా ఒక కుమ్మరిపురుగు దొర్లుకుంటూ ప్రాణభీతితో పరుగెత్తుతుండగా – ఆ మహాత్ముడు కరుణించి దానిని 7 జన్మల తర్వాత జన్మ ఒక రాజుగా పరిణమింపచేసాడట. అలాగే దళిత పనితను వషిష్ట మహర్షి 7 జన్మల తర్వాత జన్మయైన అరుంధతిగా పరిణమింపచేసి భార్యగా చేసుకొన్న కథ– దీనికుదాహరణ– మెహర్బాబా తన గురువు కరుణిస్తే – ఆ చూపుతో ధూళికణం సైతం దివ్యావతార మెత్తుతుందన్న మాట. దీనికి సంబంధించినదే. గోవును ముక్తి పొందించిన విషయం భగవాన్ రమణుల విషయంలో తెలిసినదే. శ్రీ కాళహస్తి కథ తెలిసినదే.

దీనిని శ్రీ అరవింద మహాయోగి సైతం చెప్పారు –

‘స్థూల పదార్థ సృష్టి కంటే సూక్ష్మపదార్థ సృష్టిలో యోగశక్తితో శరీరధారణం చేయటం జరుగుతుంది. ఈ సూక్ష్మపదార్థ సృష్టి. స్థూల శరీర ధారణం చేయటానికవకాశమున్నది.

'A soul wishing to enter into a body or form for otself a body and takeprt in a divne life upon earth might be assisted to do so or even provided with such a fun by this method of direct transmutation without passing through birth by the sex process-

(The supramental transformation upon earth)

–sriaurobindo p. 47

ఇదే విషయాన్ని వివరిస్తూ – జనని – శ్రీ అరవిందుల మహాసమాధి తర్వాత కాలంలో అన్నారు.

ఏ మహాసంకల్పంతో వారు శరీరాని త్యాగం చేసారో అ విజ్ఞాన మయ పురుషావతారంలో – దివ్యశరీర ధారియై తిరిగి వస్తారు. పునరవతరణ జరుగుతుందంటూ సృష్టి ప్రారంభం నుండి శ్రీ అరవిందులు దాని పరిణతికై ఆవతరిస్తునే వున్నారు – ఎదో ఒక రూపంలో – 'కనుక వారు తిరిగి అవతరించి విజ్ఞానమయ పురుషునిగా – ఆ పరంజ్యోతి (supra light) భూమి పైకి అవతరింప చేస్తారు, వారికపుడు – దేహధారాణముండదు. దివ్వ శరీర ధారణంతో గర్భవసా క్లేశాదులు లేకుండా వస్తారు.

ఇలా శ్రీఅరవిందుల మహావిజ్ఞానదృష్టి నూత్నశకమన్న గ్రంథంలో కిశోర్ గాంధీగారు వ్రాసారు.

చూ. అదే పుస్తకంలో శ్రీఅరవిందుల పునరవతరణమన్న అధ్యాయం పుట 301–313.

కనుక దివ్య శరీర సృష్టి – పరమాత్మ తనకు తానై చేసుకొని ఆవిర్భవించటం సుసాధ్యమేనని పై వ్రాతలు బుజువు చేస్తున్నాయి. ఇది మానవ మేధాపరిధిలోని

విషయం కాదు. కనుక నిజానిజాలు చెప్పిన వారికే తెలుస్తుంది తప్ప మనకు తెలిసే విషయం కాదు. మనకు కన్పించే దానిలో ఎంత తెలుసును గనుక 99%- తెలియనిదే. ఈ విషయం విజ్ఞాన శాస్త్రం చెప్పనే చెప్పినది కదా. మన భావాతావరణం చుట్టూ ఒక సూక్ష్మ - తేజోమయ ఆవరణమున్నదని మనకు తెలుసునా? - ఇది తెలియటానికి - ఎంత విశ్వాసయోగ్యం కాకపోయినా దైవదృష్టికి మనస్సు కొలబద్దకాదు కదా.

కాబట్టి బాబా ఒక ప్రొద్దున శిరిడిలో 18 ఏళ్ళ పిల్లవాడుగా వేపచెట్టు క్రింద వెలిసాడు ఇంతే. ఆయనను గురించి ఆయనకే తెలియాలి.

## స్వాతంత్ర్యోద్యమం - మహర్షులు

'తమ తపస్సులు ఋషుల్ ధారపోయంగ' - (రాయప్రోలు). ఒకసారి ఒక సోదరి అడిగినది - అన్నా! స్వాతంత్ర్యోద్యమంలో బాబా ఏం చేసాడు? - అని - ఏమి చెప్పానో ప్రస్తుతం గుర్తు లేదు. కానీ ఈ ప్రశ్న గొప్పదే కదా! చాలా మందికి మనస్సులో మెదిలే వుండవచ్చు. కనుక కొంత చెప్పుకోదగ్గదే.

బాలగంగాధరతిలక్ 19-5-1917న బాబాను దర్శించి, బాబా! భారతదేశ స్వాతంత్ర్య విషయమేమిటని అడిగాడట - బాబా అన్నాడట 'నీవు ప్రపంచానికి చాలా చేసావు. ఇకపైన నీ సంగతి చూచుకో' అని - త్వరలో ఆయన మరణించాడు. ఇంతకన్నా బాబాకు స్వాతంత్రోద్యమానికి సంబంధం మనకేమీ తెలియదు.

మెహర్బాబా జీవిత చరిత్రలో చెప్పబడ్డ విషయాలివి. మెహర్బాబాకు ఐదుగురు గురువులున్నారు. 1. బాబాజాన్ 2. నారాయణ మహారాజు 3. తాజుద్దీన్ బాబా 4. శిరిడీబాబా 5. ఉపాసనీ మహారాజు.

ఇందులో రెండవ వారిని గురించి వ్రాయబడిన విషయ సారాంశం - అది రెండవ ప్రపంచ యుద్ధకాలం బ్రిటిష్ సైనికులు చాలామంది వీరికి భక్తులు. విజయం బ్రిటిష్ వారికే కాని వారి ప్రభుత్వం సుఖంగా వుండబోదు - అనేవారట.

అంటూ ఐరోపా చిత్రపటాన్ని చూస్తుండేవారట. యుద్ధంలో గాయపడ్డ వారి గాయాలన్ని వారి శరీరం మీద తోచి వెంటనే అదృశ్యమయ్యేవట. వారి దేహానికిందుకే నాల్గుసార్లు కట్టు కట్టారట. 1945 – సెప్టెంబరు 3న బ్రిటిష్ సేన జపాన్ దిగగానే యుద్ధం ముగిసినది. వెంటనే వీరన్నారట 'నా పని పూర్తయినది' అని నవ్వారట –

రెండవ ఉదంతం – అదే పుస్తకంలో చట్టీబాబా అని నాగపట్నంలో వుండేవారట. ఆయన ఆత్మమగ్నుడై బయటకు రాలేకపోతే మెహర్బాబా ఆయనతో జాగ్రదవస్థ కల్పించారు. ఆ చట్టీబాబాకు ఫ్రాన్సుతో 'ఆధ్యాత్మిక సంబంధముండేదట. అది 1940 జూన్ 9వ తేదీ ఆ రాత్రి ఈ బాబా వెర్రి ఆవేశంతో ఊగిపోతూ తన గది నుండి బయటకు వచ్చి మెహర్‌బాబాను కౌగలించుకొని 'నా ఇల్లు కూలిపోతున్నది అందుకని తలదాచుకోవటానికి వచ్చాను' – అన్నాడట.

ఆ తెల్లవారే మెహర్ చెప్పారట. ఫ్రాన్స్ యుద్ధ జ్వాలల్లో మండిపోతున్నది. అందుకని ఆయన అలా అన్నాడని జూన్ 5వ తేదీ నుండి ఫ్రాన్స్ ఓడిపోవటం 15వ నాటికి జర్మన్ సేవలు ఫ్రాన్సులో ప్రవేశించటం జరిగినది. (పుట 218ః అవతార్ మెహర్బాబా జీవిత చరిత్రామృతము – ముత్య వెంకట రమణమూర్తి)

పుదుచ్చేరి జనని జీవిత చరిత్రకారులు చెప్పారు. అది 1914. ఆగస్టు నెల. జనని పుదుచ్చేరిలో తన గదిలో ధ్యానంలో వుండగా – యుద్ధ దేవత కాళికాదేవి కపాలమాలా ధారిణి – నగ్నంగా నర్తనం చేస్తూ – పారిస్ నాశనం కాబోతున్నదని అరిస్తే – జనని నేను కానివ్వనన్నదట. అలాగే 1940 మే నెలలో ఒకనాడు హిట్లరధీనంలో జర్మన్ సేవలు పారిస్‌లో ప్రవేశించబోయే సమయంలో – కానీ అకాలంలో మంచు పడటం వల్ల పారిస్‌కా ముప్పు తప్పినదట. దీనిని వివరిస్తూ శ్రీఅరవిందులన్నారట ఆ మంచును కల్పించినది తానూ – జనని అని.

ఇలాగే రెండవ ప్రపంచ మహాయుద్ధంలో జర్మనీ ఓటమికి వారే తమ

యోగశక్తిని ధారపోసి – కాలు విరగగొట్టుకొన్న ఉదంతం – పుస్తకాల్లో వివరింపబడినది. (చూ. Beyond Man – అన్న ఆంగ్ల గ్రంథం)

శ్రీరమణ మహర్షి – ఒక శిష్యుని ప్రశ్నకు

సమాధానంగా 'ఋషులు తమ తపశ్శక్తితో దేశాన్ని తప్పక రక్షిస్తారు' – అని. మరొకసారి గాంధీజీ – బాబు రాజేంద్రప్రసాదును తమ రాయబారిగా రమణాశ్రమానికి పంపించారు. వారితో అన్నారట రమణులు – "ఇక్కడే శక్తి పని చేస్తున్నదో అక్కడా అదే పని చేస్తున్నది" అని. మరొకసారి ఒక భక్తుడు "మీరు దేశంలో తిరిగి ఈ ఆధ్యాత్మిక విషయం లోకానికి చెప్పాలి" – అని. వారన్నారట.

"ఉపన్యాసాలు చెప్పటమా? – ఆ పనికి లోకంలోనికి పోనక్కర్లేదు. ఈ అరుణాచల రమణుడు – ఆ పని చేయటం లేదని నీకెలా తెలుసు" అని.

అలాగే పహ్యారీ బాబాను కలిసిన స్వామి వివేకానందులు 'లోకంలోకి మీలాంటి వారు రావాలని' – అంటే ఆయన అన్నాడట. 'దానికోసం లోకంలో తిరగవలసిన అవసరం లేదు – ఆ పని ఇక్కడ ఉంటూనే చేయవచ్చు"నని కాబట్టి సూక్ష్మలోకంలో – తేజోవలయంలో – ఏది భూమండల చరిత్రకాధారమో, ప్రేరకమో అది. అక్కడి నుండి బాబాలాంటి వారు పని చేస్తారు. ఆ తపశ్శక్తి వల్ల భూలోకచరిత్ర మారిపోతుంది.

కావ్య కంఠ గణపతి ముని వంటివారు తపశ్శక్తితో స్వాతంత్ర్య సముపార్జన చేసే ప్రయత్నం చేసారు. దాని కోసమాయన ఒక శిష్యబృందాన్ని తయారు చేసాడని వారి జీవిత చరిత్ర చెబుతున్నది. కాబట్టి సారాంశమేమంటే – ఋషుల, యోగుల సహాయం, సహకారాలు స్వాతంత్రోద్యమానికి అదృశ్యహస్తం చాస్తూనే వుందని –.

❀ ❀ ❀

## వ్రాత్య కాండ

అధర్వవేదంలో 15వ కాండలో వున్నది.
అందులో 18వ సూక్త భావం
"అతని కుడి కన్ను సూర్యుడు
ఎడమ కన్ను చంద్రుడు
కుడి చెవి అగ్ని
ఎడమ చెవి వాయువు
రెండు ముక్కుపుటాలు - రాత్రింబవళ్ళు
దితి, అదితులు అతని కపాలం
తల సంవత్సరం
ఈ వ్రాత్యుడు పగలు పశ్చి మోన్ముఖుడు
రాత్రి తూర్పునకు ప్రయాణిస్తున్నాడు.
అతనికి నమస్సులు."

# వ్రాత్య సంప్రదాయం 1

ఈ మతాలు - సిద్ధాంతాలు - వాదోపవాదాలు - చర్చలూ - తర్కం ఇవన్నీ
ఎప్పటి నుండి వచ్చినవి? - దాదాపు 2000-2500 సంవత్సరాల ఇటీవల (బుద్ధుడు క్రీ.పూ. 2500 అంటున్నారు) అంతకు పూర్వం ఏ మతమున్నదో తెలియదు - అంతకు పూర్వం మనిషి భూమండలం మీద ఎప్పుడు జన్మించాడో? ఒక పరిణామ వాదం ప్రకారం - రాయిారప్పా, చెట్టూ, జంతువు వచ్చినాక మానవుడు వచ్చాడు. అదీ కొన్ని కోట్ల లక్షల సంవత్సరాల క్రితం ఎందుకంటే 30,000 సం॥ల క్రితం జగజ్జనని శిల్పం వచ్చినట్లు చెబుతున్నారు కనుక ఈ 2000-3000

సంవత్సరాల నుండి వివిధ సిద్ధాంతాలు ద్వైతాద్వైత, విశిష్టాద్వైతాదులు రాకపూర్వం – మానవుని దృష్టి జీవితం – దైవం – మతం అంటే ఏమిటి? అంటే మానవుడుగా దైవం అవతరించటం – ఏ పరశురామావతారంతోనో ప్రారంభమైనది కదా అంతకు పూర్వం మత్స్య – కూర్మ – వరాహ – నారసింహ అవతారాలెప్పుడు వచ్చాయి.

బహుశా జలరాశి నుండి భూమండలం మేర్పడుతున్న కాలంలో – ఏర్పడక పూర్వం – ఏర్పడినాక వచ్చి వుండాలి.

అంతా ఏకార్ణవంగా వున్న రోజుల్లో మత్స్యం;

బురద బురదగా భూమి ఏర్పడిన కాలంలో కూర్మం;

ఏర్పడినాక అంతా వరాహం; ఇంకా జంతువుల నుండి మనిషి బయట పడుతున్న కాలంలో నారసింహం – వచ్చి వుండాలి. అప్పటికి మనిషి ఎలా వున్నాడు? – మన ఊహకు అందదు. కానీ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు ఈ పరిణామం.

బాల్యావస్థ మొదటిది. యౌవనం తర్వాతది.

శైశవం – బాల్యంలో మనస్సులేదు. కేవలం హృదయంలో స్ఫురణను బట్టి వ్యవహరిస్తున్నాడు. ఒక 100 ఏండ్ల క్రితం పల్లెల్లో మనుషులు అతి సహజంగా, సాధారణంగా – కృత్రిమ ఆలోచనలు లేకుండా బ్రతికిన స్థితి మనకు తెలుసు. నేడు మన జీవిత విధానమంతా – కృత్రిమ వ్యవస్థ. కపట నాటకం. యాంత్రిక జీవితం. ఆనాడు ఎవని వృత్తులు వాడు చేసుకొంటూ అవసరాలకు తగినంత సంపాదనతో – అంతా కలిసి, మెలిసి జీవించిన జానపద జీవనం పోయినది. తర్వాత చదువులు చూచి మనోవికారాలతో ఆలోచనలు బలిసి పోవటం వల్ల – ఈ కృత్రిమ వ్యవస్థ బలిసిపోయినది. ఆనాడు మనస్సు లేకుండా – కేవల హృదయభాషతో – స్ఫురణతో బ్రతికినవాడు కనుక – వాడు సహజంగానే దైవానికి సన్నిహితంగా జీవించగల్గినాడు. ఇందుకే పురాణాల్లో దేవతలు – మనుష్యులు కలిసి జీవించిన కథలు వచ్చాయి. ఆ అతి ప్రాచీన జీవన విధానం వ్రాత్య సంప్రదాయం. వ్రాత్యుడంటే సంస్కారాలు, ఉపనయనాది షోడశ సంస్కారాలు

లేని వాడంటారు. ఈ సంస్కారాలు చాలా ఇటీవలవి. మనం చూస్తున్న దైవ విగ్రహాలనుకొన్న చోట్ల యజ్ఞోపవీతం లేదు – అది సహజమైన దైవలక్షణం.

అది మనస్సు వచ్చి సంస్కారాదులు కల్పించిన పిదప వచ్చినది – యజ్ఞోపవీత ధారణాదులు.

దీనికి పూర్వస్థితి వ్రాత్య సంప్రదాయం.

❀ ❀ ❀

# వ్రాత్య 2

మహావరాహ శిల్పంలో జందెం లేదు. దానికి బదులు వైజయంతీ మాల వుంటుంది. (చూ. అద్భుత శిల్పం – ఉదయగిరి గుహలోని 4వ శకంనాటి బృహద్విరాట్ శిల్పం)

ఆనాటి దైవం బాబా, ఆనాటి వ్రాత్య సంప్రదాయం (వామాచారమని నేడు పండితులనేదదే). ఏ సూత్రానికి కట్టుబడక, కేవలం దైవస్ఫురణతో బ్రతికేది. ఆనాటి సంప్రదాయం దానినే పేరున పిలిచినా సరే –

బాబా శిరిడీకి వచ్చిన నాటికి – 400 ఇండ్లు. 2500 జానాభా కలిగిన పల్లె. జనం – పొలంలో పనీ పాటలు చేసుకొని బ్రతికేవారు. వారికి దేవుడు వారు చేసుకొనే పనే. పొలం – పంట – వృత్తి – ఇదే దైవం – అపుడపుడు ఊరిలోకి ఎవరో గోసాయిలు, సాధువులు వచ్చి పోతూవుండేవారు. బహుశా వారు దేశభాషలోని ఏవో తత్త్వాలు పాడుకొనే వారు. బ్రహ్మంగారి తత్త్వాలులాగా వారికేది స్ఫురిస్తే అదే పాట. దానికనుగుణమైన ఆట. దీనికి శాస్త్రమాధారం కాదు. కేవల హృదయస్పందన – సహజాతి. సహజమైన హృదయచలనం. ఇదే జానపద సంప్రదాయంగా మనమీనాడంటున్నాము. వాడికి కోపతాపాలు క్షణికావేశాలు తప్ప దీర్ఘకాలికం కాదు.

రక్షణ – శిక్షణ దైవ కార్యాలులాగా భావించి బ్రతికేవాడు. ఆ దైవం ఈ సాధువుల ద్వారా విన్పించే పాటలోని మర్మమే. ఆ మార్మిక భాషలోని పాటకర్థం ఆనాటి వారికి తెలుసు. మనం మనస్సుతో బ్రతికేవాళ్ళం కనుక మనకు ఆలోచన అందకుండా పోయినది. అసలు ఆలోచనమంటే – మనస్సులో చేసే చింతన కాదు. ఆ – అంతటా లోచనం – కన్ను అంటే చూడటమే తప్ప చింతన చేయటం కాదు. చూచిన దాని నుండి పుట్టిన భాష వేరు. చూడకుండా అనుభవించకుండా – మనస్సు నుండి వచ్చే తలపుల భాష వేరు. బాబా భాష ఆ ప్రాచీన హృదయభాష. తత్త్వాలలోని భాష.

'గూటిలో చిలకేదిరా అన్న, గూడు చిన్న పోయెరా' – వంటి పాటలు నా చిన్నతనంలో బిచ్చగాళ్ళు రైళ్ళలో, ఊళ్ళలో, ఊరిలోని బైరాగుల మఠాల్లో – ధర్మసత్రాల్లో పాడటం నేనే విన్నాను. ఒక 50, 60 ఏళ్ళ క్రితం వారికా భాషలో సంకేతాలు తెలుసు.

'చిలక' అంటే ప్రాణం. 'పంజరం' అంటే శరీరం అని. ఇందుకే 'దామూ' అన్నాకు 4 మామిడిపండ్లు వేరుగా వుంచి, మిగిలిన బుట్టెడు మసీదులో వారికి పంచుతాను అని బాబా అన్నాడు – అవి 4 దాముకు.

అవి తిని వాడు చావాలి అని. విన్న దామూ భయపడితే – మహల్సా పతి అన్నాడు – 'చావంటే అహంకార మణగారిపోవటం' – మరి ఇది ఆనాటి వారి భాష. ప్రాచీన భాష.

పొలంలో పని చేసుకొనే వారికి జపం, తపం, మూడు పూటల స్నానాదులుంటాయా. మన తాతల, తండ్రుల జీవన విధానమంతా వృత్తి నిర్వహణమే. వారి మనస్సంతా లేదా హృదయం పని మీదనే కేంద్రీకృతమయ్యేది. పొలం గట్లు మీద బురదలో కూర్చొని అన్నం తినేవారు. కాల్వలో నీరు త్రాగేవాడు. వాడికి జపతపాదుల మతం తెలుసా?

ఒకసారి రమణమహర్షి కొండపైకి పోతున్నారు. ఒక కట్టెలు కొట్టుకునేవాడు – గొడ్డలి అవతల పారవేసి తల గుడ్డ తీసి, బహుశా నడుముకు చుట్టుకొని నమస్కరిస్తే – ఆ మహాత్ముడన్నాడట 'అదేమీ అక్కర్లేదు. నీపని నీవు చూసుకో' అని – అంటే అదే దైవం.

కర్మయోగమంటే ఏమిటని మరొక భక్తుడు ప్రశ్నించాడట భగవానుని – కొండపైకి పోతున్నపుడు – వారేమి మాట్లాడక దారిలో ఒక చెట్టు కొమ్మ విరిచి దానిని నగిషీగా తయారు చేసి, దారినపోతూ ఒక సాధారణ వ్యక్తికిచ్చారట – ఇదీ కర్మయోగమంటే – అని ఉదాహరణ పూర్వకంగా – నాటి మనిషి ఈ కర్మయోగి – అవసరాలకు మించని కోరికలు. ద్వేషాసూయాదులు లేక ప్రక్కవాడంటే స్నేహంగా మసలుకోవటం. అవసరమైన సహాయం చేయటం, మనం చూచిన విషయాలే.

ఆనాటి ప్రేపల్లె – బృందావన జీవనంలోకి ప్రవేశించిన దైవం బాబా.

గౌలీబువా అన్నాడట కదా! సచ్చరిత్రలో చెప్పాడు.

'ఈయన సాక్షాత్తు విఠోబా (పుండరీపురం దైవం) పేదల కోసం వెలసిన కారుణ్యమూర్తి అని. భిక్షాటనం వృత్తి (సంపాదన లేదు) దానికి బదులుగా ఊరి వారికి సాయపడటం (కలరా వంటి వ్యాధులు నివారించటం లాంటివి) – ఆ పేదవారి దైవం బాబా.

ఒకసారి ఒక ఊరివారు – బాబాను గురించి ప్రసంగిస్తూ వుండగా అడిగారు – 'అయ్యా! ఈనాడు బాబా భక్తి ఇంతగా వ్యాప్తి చెందటానికి కారణమేమిటని?' – అన్నాను. "కష్టపడి పని చేసుకొనేవారు – నిరుపేదలు, పండితులు కానివారు – లోకంలో నూటికి నూరుపాళ్ళూ వున్నారు. పండితులు చెప్పే గీతా, ఉపనిషత్తులూ, బ్రహ్మసూత్రాలు, దర్శనాలు ఏమీ తెలియని వారెంత మంది? వారి గతి ఏమిటి?

మన తాతలు, తండ్రులూ వ్యవసాయం లాంటి వృత్తులతో జీవించారు. నేను కొంచెం ఆయా గ్రంథాలు చదివాను. పెద్దవారిని సేవించాను. నా సంగతి వేరు. వారి సంగతి వేరు కదా! స్నాన, జప – తపాదులు, సంధ్య వార్చటం లాంటివి తెలియవు? వారికెలా చెప్పాలి? ఏమి చెప్పాలి? వారికి దైవము, మోక్షము వంటివి ఎలా చేకూర్చాలి? దీనికోసం బాబా వచ్చాడు. లోకానికవసరమాయన? ఆయన శక్తి అవతల పెట్టి మనకాదైవం – మోక్షం వంటి వాటిని దగ్గరకు తెచ్చినాడాయనే. నియమాలు, నిష్ఠలు లేవు. ఆహార నియమాలు లేవు. అంటూ, ముట్టూ లేవు – ఏమీ లేవు. అందుకని బాబా వెంట పడినది లోకం. అంతకంటె సులభోపాయం లేదు. సులభదైవం లేదు. ఇవతల ప్రక్క మనం మతమంటే నియమనిష్ఠలు, అందరకు అందుబాటులో లేని విషయాలు చెప్పి – జనానికి దైవం దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాం కదా. ఎవరో కొందరకే దైవం – మతం సన్నిహితం కాగా – బాబా మతంలో జన సందోహానికి తావు చిక్కింది.

'రమతేరాం ఆవోజీ ఆవోజీ

గోనేంకో ఊధియా లావోజీ – లావోజీ' –

ఆనందంలో మునిగే రామా! గోనెల కొద్దీ ఊధి తేవయ్యా – ఊధి పంచిపెడుతూ పాడిన పాట – బాబా. అదేం పాట? కానీ అది చాలు వారికి – నిరుపేదలు – చదువుకొనని వారికి. బ్రహ్మ సూత్రాలు దేనికి? లేదు కదా. కనుక వీటితో పనిలేని దైవం – సాక్షాత్తుగా – మన దగ్గరకు తెచ్చిపెట్టేవాడు మనకు కావాలి. అందుకే బాబా మన దగ్గరకు వచ్చాడు. ఇందుకే మనం ఆయన వెంట పడుతున్నాము."

ఇది చెప్పిన దానికి సారాంశము. ఇదే వ్రాత్య సంప్రదాయము. ఉల్లిపాయలు తిన్నా నష్టం లేదు. తినేవాడు నాకేమి చెబుతాడని ఒక సాధువు హిమాలయాల నుండి వచ్చి, జొన్నరొట్టె ఉల్లిపాయ తినే బాబాను చూసి అనుకొన్నాడట. తిని జీర్ణించిన వానికి తింటే ఏమిటని? బాబా అన్నాడట.

మతమంటే ఉల్లిపాయ తినవచ్చునా? లేదా అన్నది కాదు. విచారించదగ్గది. తిన్నదంతా దైవానికర్పించు. ఇది చెప్పకుండా ఏది తినాలో, ఏది తినకూడదో చెప్పేది మతం కాదు.

బాబా ఆహార నియమాలు వల్లించలేదు. తనను ధ్యానిస్తూ ఏదైనా తిను – ఫర్వాలేదు. రమణమహర్షి తల్లితో అన్నారట 'అమ్మా! నీవు స్వర్గానికి పోతుంటే – దారిలో ఉల్లిపాయల కొండలూ, ములగకాయ చెట్లు అడవులూ అడ్డు వస్తాయా? – అని.

ఇది మతానుభవానికి సంబంధించినవి కావు – బాబా చెప్తున్నది ఇదే.

శ్రీకృష్ణుడూదిన మురళి వెదురు గొట్టం – పుల్ల. మన తల్లులు, అమ్మమ్మ లూదిన పొయ్యి గొట్టమే. కృష్ణ నిర్యాణానంతరం వ్రేపల్లె వాసులైన వృద్ధులు – కృష్ణుని చూచినవారు వాని వెదురుపుల్ల పాట విన్నవారూ – ఆ పుల్లను తెచ్చి ఊరికి నడిబొడ్డున రావి చెట్టు క్రింద – రచ్చబండపైన పెట్టి పూజిస్తూ వుండేవారు. అడవికి పోతూ, వస్తూ వున్నప్పుడు తంగేడు పూలు, మోదుగు పూలూ తెచ్చి – రాత్రిపూట ఆ వేణువులోనికి గాలి దూరి పాట పాడేదట. ఆ గానం వింటూ

హాయిగా నిద్రించే వారట ఆ పల్లీయులు. ఆ వృద్ధుల తరం పోయింది. తర్వాత వారు వచ్చి అయ్యో మన పూర్వులు దీనినలాగే పెట్టినారే అని దానికి వెండి తొడుగు చేయించారట. తర్వాతి వారు బంగారు తొడుగు. తర్వాతి వారు దానికా రత్నాలు పొదిగించినారు. ఆ పుల్ల పాట పాడటం లేదు. ఈ రత్నాల మురళిని పూజిస్తున్నా – అపుడొక సాదువు బాబాలాంటి వాడు వ్రేపల్లె వచ్చి – పిల్లలను మందలించి ఆ తొడుగులన్ని తీయించి – పారవేసి, యథాతథంగా ఆ వెదురు గొట్టాన్ని అలాగే వుంచాడట. అది మళ్ళీ పాడటం మొదలు పెట్టినదట – ఇది బాబా చేసిన పని. మనం బంగారు కవచాలు, కిరీటాలు పెట్టి – లక్ష పత్రితో, లారీ పూలతో విగ్రహాన్ని పూజిస్తున్నాం, అసలు విగ్రహమే ఒక తొడుగు. దానికివన్నీ మరీ తొడుగులు కదా. చైతన్యారాధనపోయి, ప్రాణశక్తిని చంపి, బాహ్యాడంబరం పెంచుకొన్న విధానం మతం కాదు.

'లక్ష తులసీ దళాలతో పూజించిన ఒక భక్తురాలితో రమణులు 'అన్నిసార్లు నిన్ను నీవు గిల్లుకో పోయినావా?' అన్నారట.

ఆ శుద్ధ తత్త్వస్వరూపులు – ఒక పూవు చాలన్నారట. మరోసారి ఒక తల్లి చెట్టు పూలన్నీ కోస్తుంటే – మందలిస్తూ అన్నారట – 'ఓహో! ఆ చెట్టు నీకోసమే పూసినదన్నమాట' అని – ఈ ఆడంబరాలు – యంత్రాలు –మంత్రాలు – తంత్రాలు – శుద్ధ తత్త్వ స్వరూపులైన బాబా – రమణల దగ్గర లేవు. కేవల భక్తి ఆత్మవిచారణ చాలన్నారు.

బాబా పేరున యంత్రాలు, మంత్రాలు, తంత్రాలు వస్తున్నాయి. కానీ బాబా

– నా సంప్రదాయం చెవి కొరకటం కాదన్నాడు – రమణులూ అన్నారు మరొక రీతిగా –

మంత్రజపం వల్ల మనస్సణగారదని –

అతి ప్రాచీన మానవుడు దైవారాధన ఎలా చేసాడు? పొలంలో చదువురాని రైతు – వరి దుబ్బునే పీకి వినాయకునిగా భావించేవాడు. పల్లె నడిబొడ్డున పాతిన

రాతినే దైవంగా పూజించేవాడు. ఈ సనాతన లేదా ప్రాచీన సంప్రదాయమే వ్రాత్య సంప్రదాయం. దానినే బాబా చెప్పాడు లేదా చేసి చూపించాడు.

ఇందుకని బాబా, మనలో తంత్ర మంత్ర, యంత్రాదులతో అణగారిపోయిన శుద్ధ తేజస్సు – దానినే భక్తితో ఆరాధించు అన్నాడు.

ఈ బాహ్య క్రతు విధానం – పురోహిత సంప్రదాయం – మంత్ర, యంత్రాదులు ఒకపుడు మహర్షి నుండి వచ్చి – పురోహితుని లోనికి పోయి – బాహ్య విషయమైపోగా – ఆధునిక కాలంలో రామకృష్ణ పరమహంస నుండి రమణమహర్షి దాకా వచ్చిన అవతారాలు – దానిని తొలగించే మతమంటే క్రతు విధానం కాదు – జ్యోతిషం కాదు – ఆత్మానుభవమని ప్రచారం చేసారు. ఇందుకే పరమహంసాదులు పండితులను చూసి హాస్యంగా అనేవారట – 'వీరికి దేవుడు పుస్తకాల్లో వుంటాడట' – అని. ఈ యుగంలో వచ్చినది విప్ర ఋషి సంప్రదాయం. దీనికి విరుద్ధమైనది పురోహిత బ్రాహ్మణ సంప్రదాయం – ఇది ఆత్మద్రవ్యం లోపించిన బాహ్య ఆచారకర్మకాండ. దీనినే బాబా నిరసించి – నీకు, నాకు నడుమ పూజారి, పురోహితుడు లేదన్నాడు. నీవేదైనా అడిగితే నన్నే అడుగు. వాడికేం తెలుసని వాడి నడుగుతున్నావు – అని. దీనిని రెండు రకాలుగా నిరూపించాడు బాబా.

1. నానావలి బాబా గద్దెపై నెక్కి – దిగిన కథ
2. దేవు గుడ్డపీలికల కథ

నానావలి కానీ ఉపాసనీ మహారాజు కానీ బాబాకు వారసులు కాలేదు. ఉపాసనీ వంటి మహాయోగిని తనకు వారసునిగా, బాబా నియమించలేదు.

దేవు – పాండువన్న వానిని బాబాను గురించి అడిగిన కథలో నన్ను గురించిన పొడి పొడి మాటలన్న గుడ్డ పీలికలు – నీకు దేనికిరా? నేను నీకు రవసెల్లా కప్పుదల్చుకొన్నానన్న కథలో – బాబాకు – నీకు నడుమ ఎవరూ లేరు. పూజారి లేదు. మన గుడిలో వున్నట్లుగా. మనం నేరుగా పోయి బాబాను తాకవచ్చు. ఒకప్పుడు 20 ఏళ్ళ క్రితం శిరిడిలో బాబా సమాధి పైకి ఎక్కి మనమే అభిషేకం

చేసుకొనే వీలుండేది. నేడది పోయింది. దాని కారణం నేను విన్నది – 'ఎవరో పీఠాధిపతి వచ్చి చెప్పారట. ఎవరుబడితే వారు సమాధి పైకెక్కకూడదని' – పురోహిత సంప్రదాయం వచ్చినదన్న మాట. దీని నుండి పుట్టినదే 'దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడని' – తమాషా ఏమంటే – సచ్చరిత్రలో పూజారి పురోహితుల, కథలూ; జ్యోతిష్య విషయాలు వచ్చాయి. వాటి ద్వారా బాబా మనకేమి చెప్పదలచుకొన్నట్లు:

1–2 ఉదాహరణలు చాలు విషయాలు తెలుసుకోవటానికి –

సచ్చరిత్రకారుడు హేమద్పంతు చెప్పినదే.

1. రెండవ అధ్యాయంలో హేమద్పంత్‌ని తనను బాబా పిలిచిన విషయం చెబుతూ తన స్నేహితుని కొడుకు జబ్బు పడితే మందులూ, మాకులూ పని చేయకపోతే గురువును పిలిపించుకొన్నా ప్రయోజనం లేకపోయినదని చెప్పి గ్రంథకర్త అన్నాడు – జబ్బునయము చేయలేని గురువు వల్ల ప్రయోజనం ఏమిటని? – బాబా దర్శనానికి వెళ్ళటం మానివేసిన అంశం.

2. వణి – శతశృంగి పూజారి కాకాజీ వైద్య కథ (30వ అధ్యాయం)

3. 47వ అధ్యాయంలోని కప్ప – పాము కథలో

1వ అంశం వల్ల అతడు యథార్థ గురువు కాదు. ధరించిన వేషగాడని భావం. ఒకచోట బాబాయే అన్నాడు. నిజమైన గురువు ఎవ్వరో వెతుక్కోవాలి. అతని దర్శన మాత్రంతో మనస్సు విశ్రాంతి పొందుతుంది. అదే గుర్తు అని తన గురువును ఎలా అన్వేషించారో చెప్పిన కథ – దీనికి సంబంధించినదే.

2. వణి పూజారి దైవసన్నిహితుడు కాడు. వంశపరంపరగా చేస్తున్న వృత్తి మాత్రజీవుడన్న మాట. అందుకే ఆ తల్లి బాబా దగ్గరకు పంపించినది. కానీ అతడు చండీపూజ చేస్తున్నాడు కనుక తల్లి కలలో కన్పించటం – చెప్పటం – ఇతడు శిరిడీ రావటానికి బాబా శ్యామాను ఒక నెపంగా పంపటం – అతడు శిరిడీ వచ్చి బాబాను దర్శించి – మాటా, పలుకు లేకుండా దైవానుభూతి పొందటం జరిగింది. ఇతడు పరిపక్వ జీవి. గురు దర్శనంతో తరించినాడు.

ఇలాంటి పూజారులు అరుదే.

పరమహంస సంప్రదాయంలో రామకృష్ణమంత్రం – సర్వులకూ కుల వివక్ష లేకుండా ఉపదేశిస్తారు ప్రతి జనవరి 1వ తేదీన. ఇది స్వామి వివేకానందాదేశం ప్రకారం జరుగుతున్న మహావిషయం.

పురోహితుడంటే – దైవ వాక్కును – మంత్రరూపంలో విని విశ్వ కుటుంబానికి రాబోయే – రావలసినది – (దైవవాక్కులాగా) అందించేవాడని ఆ శబ్దార్థం. వేయి పడగల్లో గణాచారి పాత్ర ఇదే. వీరినే మహావిజ్ఞాన శాస్త్రవేత్తలు MANA PERSONALITY–గా వివరించారు. అతి ప్రాచీన మానవ సమాజంలో వీరు దైవ ప్రతినిధులుగా – గ్రామానికి – దేశానికి రాబోమే అరిష్టాదులను సూచిస్తూ – హితమైన మార్గాన్ని ప్రబోధించేవారని శాస్త్రజ్ఞులు చెప్పిన మాట. ఆనాడు శరీరారోగ్యం – మానసికారోగ్యం – కల్గించే వాడే పురోహితుడు – పూజారి – ఆయనే వైద్యుడు. ఇదే బాబా శిరిడీలో తొలి రోజులలో వైద్యుడుగా (హకీం) వ్యవహరించటానికర్థం.

మనశ్శరీరాల – ఆధి వ్యాధులకాయనే వైద్యుడు. వైద్యనాధుడని శివుని నామము. ఇదే అర్థం. భవరోగ నివారకుడనీ – భావం.

'అగ్ని మీళే పురోహితం' – అని వేదంలోని ప్రధమ మంత్రం, ఇక్కడ అగ్ని దేవుడు మనిషికి పురోహితుడు. (రాబోయే శుభం చెప్పేవాడు – శుభమార్గ విధాత) బాబా ఈ అగ్నినే ధునిగా చేసినది. అదే పురోహితాగ్ని.

3. ఈ కథలో మహాదేవుని గుడికి సంబంధించిన ఆస్తి, పాస్తుల విషయం – పూజారి కూతురు గౌరికి స్వప్నంలో శివుడు చెప్పాడట. 'ఈ ఆస్తి విషయం, మసీదు బాబా నడుగు' – అని.

ఆ పూజారి బాబా స్నేహితుడు కనుక గౌరీ వివాహాన్ని గురించి బాబా నడిగినాడట. ఆయన సలహా ప్రకారం ఆ గౌరి పెండ్లి జరిగినది.

ఈ పూజారులు, వేదకాలం నాటి పురోహితులు. వారికీ, దైవానికీ సంబంధముండేది. రాను రాను ఆచారం ప్రబలి పోయి – ఆత్మద్రవ్యం

చచ్చిపోయేంతగా కర్మకాండ పెరిగిపోయినది.

ఈ పురోహిత బ్రాహ్మణాధీనంగా, మంత్రవిద్యగా పరిణమించటం వల్లనే బాబా – నాది చెవి కొరికే సంప్రదాయం కాదని, రాధాబాయిదేశ్‌ముఖ్ కథలో చెప్పినది. ఈ కథ చాచా గొప్పదని బాబా చెప్పి – రచయితతో – దీనిని మననం చేసుకో అన్నాడంటే – ఆ కథా మహాత్మ్యం చెప్పనలవి కాదన్నమాట.

ఈ ప్రస్తుత రచయితతో ఒక మిత్రుడు, పండితుడు అన్నాడు". మా మేనమామ దేవీ భక్తుడననీ, దేవీ భాగవతం తెనుగు చేసానని, షోడశీమంత్రోపదేశం చేస్తానని చేసేవాడు. దానికింత ఖరీదని నిర్ణయించాడు. ఇది చూచి నా కసహ్యం వేసి కమ్యూనిస్టు అయ్యానని–

ఆయన సైతం బ్రాహ్మణులకే ఆ మంత్రోపదేశం చేసేవాడు. ఈ సంగతి జగత్ప్రసిద్ధమే.

ఇందుకే మంత్ర విద్య బాబా సంప్రదాయంలో, రామకృష్ణ పరమహంసాదుల సంప్రదాయంలో లేదు.

'సాయి – సాయి' అన్న రెండక్షరాలే మంత్రం.

# జ్యోతిషం

బాబా ఈ జ్యోతిష విషయం విశ్వసించనక్కర్లేదన్నాడు. 12వ అధ్యాయంలో నాసిక్ నుండి వచ్చిన మూలేశాస్త్రి కథ వస్తుంది. ఆయన బాబా చేయి చాపమన్నాడు. సాముద్రికం చూస్తానని. బాబా నాల్గు అరటి పండ్లాయన చేతిలో పెట్టాడు. నాలుగు పురుషార్థాలకు చిహ్నంగా.

29వ అధ్యాయంలో సావిత్రీబాయి తెండుల్కరు కథ వస్తుంది. ఆమె కుమారుడు న్యాయశాస్త్రం చదువుతున్నాడు. బాబా చదవనందువల్ల పరీక్షలకు హాజరు కాలేక పోతున్నాడనీ – జ్యోతిష్కులు వ్రాయవద్దు – ఉత్తీర్ణుడు కాలేవనీ – అన్నారని తల్లి బాబాతో అంటే – ఆ తండ్రి అన్నాడట – ఆ శాస్త్రం విషయం మావలపెట్టి నా మీద నమ్మకంతో పరీక్షలకు వెళ్ళమని. ఆ పిల్లవాడలాగే వెళ్ళాడు. ఉత్తీర్ణుడైనాడని చెప్పనక్కర్లేదు. ఇతని తరగతిలోని వాడే అక్కల్ కోట విదార్థి సపత్నేకరు. ఇతని కథలోలే – బాబా తన పాదాలను గురించి – ఇవి సనాతనములు. 'హే పాయ్ పురాతన్ పార్' – అని చెప్పింది. (ఈ పుస్తకం ఈ రచయిత చేత బాబా వ్రాయించాడు – అదే పేరున)

అన్నమాచార్యులు 'బ్రహ్మ కడిగిన పాదమన్నాడే – అదే బాబా పాదమంటున్నాడు – తనంత తానై చెప్పినది. ఎవరి ద్వారానో చెప్పించకుండా.

మరొక అధ్యాయంలో బూటీకివ్వాళ ప్రాణగండమున్నదని జ్యోతిష్యుడు చెప్పాడట – బాబా మృత్యువెలా వస్తుందో నేను చూస్తాను. నీవు నిశ్చింతగా వుండమన్నాడు. బూటీ బయటకు ఒక పాము కన్పిస్తుంది. నౌకరు చంపబోతే – అది కన్పించలేదని – చెప్పబడటం చదువుతున్నాం.

(ఇక్కడ ఈ రచయుతకు ఒక కుటుంబానుభవమున్నది)

అనంతపురములో వున్నాం. బాబా ఒకనాటి రాత్రి నా ఇల్లాలు శాంతకుమారి

కలలో కన్పించి – ఒక చోట కూర్చున్నట్లు 'తల్లీ రేపు నీ యింట్లో దొంగలు పడబోతున్నారన్నాడు' – బాబా భాషతో పరిచయం కల్గినందున – అది పామని

గ్రహించి – తెల్లవారి వెనుక, ముందు తలుపులన్ని మూసి వేసాడు. కానీ సాయంకాలానికి ఎలా వచ్చిందో ఒక త్రాచు వంటయింట్లోకి దూరినది. దానికెలాగో ఒక రాగి కాగు బోర్లించి పెట్టాము తర్వాత బయట పనిచేసే వారిని పిలిచి దూరంగా వదలి పెట్టించాం. వదలి పెడితే ఆ పాము ఆ పనివారి వెంట పడి చాలా దూరం వచ్చినదట. వారన్నారు 'అమ్మా! దానిని మీరు పెంచుకున్నారా' అని. తర్వాత మేమూ యింట్లో నెల కంటే ఎక్కువ రోజులుండలేదు. చెన్నై వెళ్ళిపోయాము.

ఈ విషయాలేమి చెబుతున్నాయి? –

'భయదగ్ని: తపతి, భయాన్తపతి సూర్య:

భయాదింద్రశ్చ, వాయుశ్చ, మృత్యు: ధావతి పంచమ:' –

కఠం 1–3 – 3

పరమాత్మ భయంతో అగ్ని, సూర్యడు, ఇంద్రుడు, వాయువు – మృత్యువు పరుగెత్తుతున్నారు – అన్నపుడు ఆ పరమాత్మనే ఆశ్రయించు. గ్రహాలేమి చేస్తాయి అవీ ఆయన వల్లనే ఆయా పనులు చేస్తూ వున్నాయి కనుక తననే ఆశ్రయించు.

జ్యోతిష్కులేం చెబుతారు? ఈ గ్రహం వల్ల ఈ దోషం వస్తున్నది. కనుక శివాభిషేకం చేయించుకో' అంటున్నారు. చివరకు నీవు శివుని దగ్గరకే వస్తున్నావు.

ఐనపుడు నడుమ ఈ పురోహితుడూ, జ్యోతిష్కులూ ఎందుకు?

ఇది బాబా భావం.

పిళ్ళై కథలో నేనీ బాధ పడలేకున్నాను. పది జన్మల మీద ఈ బాధ పంచమని

ఆయనన్నాడట. 'ఎందుకురా, నేనిక్కడ ఇహ, పరసుఖాలిస్తుండగా పది జన్మలుదేనికి, పది రోజుల్లో నయం చేస్తాను. వాడిని మసీదుకు తీసుకురండి' – అని.

ఇది బాబా అభయప్రదానం. అంతా పిళ్ళై లాంటి వారే కదా. ఏదో వక బాధ ననుభవస్తూనే వుంటారు కదా! వారందరకూ అది అభయమే.

చతుర్విధ పురుషార్థ ప్రదాతగా బాబా వుండగా భయం దేనికి? ఆయన వామ పాదమే గోవర్ధన పర్వతం. దానినే గొడుగుగా చేసుకొని జీవించాలి.

అహంకారం త్యజించు.

'మచ్చిత్త: సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి' -

నన్ను ధ్యానించు. నా అనుగ్రహం వల్ల అన్ని కష్టాలు తీరిపోతవి.

'అహం త్వాం సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి -

మాంఏకం శరణం వ్రజ' -

నన్నే శరణను. నిన్ను ముక్తుని చేస్తానని గీతాస్వామి

# త్రిక సూత్రాలు

త్రికమంటే మూడు

1. నేను - నరుడు

2. తాను - నారాయణుడు

3. గురువు - నన్ను, తననూ - ఒకటిగా చేసే సేతువు, జ్యోతి, మార్గదర్శి తానూ (తత్, సత్) - గురువూ - ఒకటే. కానీ, మనిషిగా... అవతారంగా, సత్తుగా అన్నీ తానేయైనవాడు గురువు.

నరుడు కాకపోతే వీడి కష్ట-సుఖాలు, బోధకాలు-సాధకాలూ-తెలియవు. వీటిలో వుంటూ నరునిగానే బ్రతుకుతూ, తన నారాయణ స్థితిలో, సహజ సమాధిలో వుంటూ - మరల బయటకు వస్తూ, మార్గనిర్దేశం చేసే గురువుగా వ్యవహరిస్తూ ఈ త్రిదశల్లో త్రిమూర్తిగా, త్రివిక్రమునిగా వ్యవహరించేవాడు గురువు. అతడే ప్రస్తుత గ్రంథస్వరూపుడైన బాబా - అతడే నందా (అఖండ) దీపం - జ్యోతి - మార్గదర్శనం చేయించే దివిటీ.

మార్గమూ - మార్గదర్శనమూ - గమ్యమూ - ఈ మూడు త్రికమే. అదే బాబా.

❊ ❊ ❊

# గురువు - బాబా

1. నేనే సర్వత్రా వున్నాను. ప్రపంచమంతా నాదే. (ఇలాంటి చోట్ల బాబాయే భగవంతుడు. అల్లాయై మాట్లాడుతున్నాడు. ఇది ఆయన విశ్వోత్తీర్ణదశ. గీతలో - భగవంతుడు 'అహం పాపేభ్యో మోక్షయిష్యామి' - అన్నచోట - తాను భగవత్ స్థాయిలో వుండి అంటున్నట్లు

2. నేనే అంతటా తిరుగుతున్నాను.

3. ఈ విశ్వమంతా నాకు శరీరమే. నేను నిర్గుణుడను, సగుణుడను.

4. నేను ఆయనకు బానిసను - (ఇలాంటి చోట్ల మానవ దశలో వుండి మాట్లాడుతున్నాడు)

5. ఆయనను వేదాలే వర్ణించలేనపుడు మనబోటి వారెంత? గురువుల మాటలు మౌనంతో విను.

6. నా పిల్లలెంత దూరాన వున్న - వేలమైళ్ళ దూరాన వున్నా వారిని ఆకర్షిస్తాను. వీళ్ళు వస్తేనే నాకు చాలా ఆనందం.

(స్వామి వివేకానంద వచ్చినప్పుడు పరమహంస అన్నారట - నాయనా ఇన్నాళ్ళకా వచ్చావు. నీ కోసం ఎన్నాళ్ళు - ఎన్ని రాత్రులు ఎదురు చూచానో తెలుసా - అని)

నేను నీవారిని రక్షిస్తాను. మరి లెక్కలన్ని ఆయన కప్పచెప్పాలి కదా.

7. నా వారికి ఊదీ చాలా ఉపకరిస్తుంది. దానిని జాగ్రత్త చేసుకో.

8. ఈ శిరిడీకి ముందు, ముందు వేల మంది వస్తారు. చీమల బారుల్లాగా. భయపడకు. నేనున్నాను కదా. వచ్చేవాళ్ళు వస్తారు. పోయే వాళ్ళు పోతారు. మనకెందుకు?

9. చెవిలో ఊదే సంప్రదాయం కాదు మాది. మా సంప్రదాయం వేరు.

10. నేను వేలమైళ్ళు వెళ్ళి నా వారిని రక్షిస్తాను. నా దృష్టిలో అంతా ఒకటే. మంచీ, చెడూ లేవు. నా దర్బారులో అంతా సమానమే.

11. నా దర్బారుకు వచ్చే వారిలో మంచి వారున్నారు. చెడ్డ వారున్నారు. దుర్మార్గులున్నారు. క్రూరులున్నారు. వారిని గురించి నీకెందుకు? అందరి మీద నా దయ వెన్నెల్లాగా పరుచుకొంటుంది.

12. నాకు భగవంతుడే లక్ష్యం. ఎవరినీ లక్ష్య పెట్టను.

13. మీరంతా నగరాల్లో - పల్లెల్లో వుంటారు. నేనేమో అడవిలో వుంటాను.

14. మీకు నెత్తిమీద కప్పుంది. నాకేమి లేదు. (దిగంబరుని భావం)

15. నాకొక గుర్రమున్నది. అది 11-12 మందిని లాక్కుపోతుంది. ప్రాణశక్తి - మిగిలినవి దశేంద్రియాలు.

దీనిని బట్టి చాంద్‌పాటిల్ గుర్రం - కథ నన్వయించుకోవాలి.

'శ్రీలీలాసమాధి'లో దని వివరణమున్నది.

16. నాల్గు శరీరాలనూ చీల్చి పారేసాను.

(త్రిపుర సంహార కథలోని మూడు శరీరాలు (స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలతో పాటుగా నాల్గవది మహాకారణ శరీరం ప్రకృతి)

17. నేను పోయినా కూడా నా మాటలు గుర్తుంచుకొనండి. నా ఎముకలు నా సమాధి నుండి మాట్లాడుతవి. నన్ను శరణన్న వారినది వెన్నాడుతుంది. నీతో ప్రసంగిస్తుంది.

(ఇక్కడ గురువు - దైవమై లోకానికుపదేశిస్తున్నాడు)

తానెవరో. బాబాలో 3 దశలు గోచరిస్తవి.

1. దైవం 2. గురువు 3. నరుడు (జీవుడు)

సావిత్రీబాయి తెండుల్కర్ అన్నదట 'బాబా - ఎప్పుడూ మసీదులో నున్న వ్యక్తిగా - సర్వవ్యాప్త మహాదైవంగా గోచరించేవాడని.

18. చర్చల్లో పాలు పంచుకోవద్దు. పది మాటలకొక మాటతో సమాధానం చెప్పు - అదైనా అవసరమైతే.

(ఇదే మౌనస్థితికి సోపానం)

నీవితరులను ప్రశంసించనక్కర్లేదు. నిందించటం అంతకంటె వద్దు – (ప్రతి వ్యక్తి తానే కనుక దైవం – ఆత్మ – గురువు) నీవితరులను బాధిస్తే నన్ను బాధించినట్లు అనుభవిస్తాను.

20. (సర్వాంతర్యామి కనుక. పరమహంస శరీరం మీద ఎద్దును కొట్టిన దెబ్బలు కన్పించాయట. ఇదే సర్వాంతర్యామిత్వమంటే. జగత్తంతా నా శరీరమేనని బాబా అన్నదీ ఇందుకే.

గురువు

21. నన్ను విశ్వసించిన వారిని నేనెప్పుడూ విడవను.

ఆత్మవేత్త గోల చేయడు.

దైవం – గురువూ ఇచ్చినది పోదు.

భగవంతుడే ఇవ్వగలవాడు. ఏది అడగాలో తెలియాలి. నా దగ్గరకు వచ్చేవారంతా లోకవాంఛలతోనే వస్తున్నారు.

❀ ❀ ❀

## తత్ - సత్ - తాను

(అది - ఉన్నది)

1. భగవంతుని చేరుకోవటానికి చాలా శ్రమించాలి.

2. చిత్రమేమంటే ఆయన నీలోనే వున్నాడు.

(వేలికి గోరంత దగ్గర్లో వున్నాడు. కనుక నాకాయన అగమ్యుడు కాడు. కాకపోతే శ్రద్ధా - సబూరీలుండాలి. ఈ రెండూ వున్న వారికాయన సులభుడే.

3. అతడే మార్గదర్శి. నీవు పరిపూర్ణకాముడవు కాగలవు.

4. ఆయన విషయంలో ధీరులే పొరపాటు పడుతున్నారు. మనమెంత!

5. అతడు దయామూర్తి. అది పొందినవారు మౌనులౌతున్నారు. వారు మాట్లాడరు.

6. ఆయన ఇవ్వటానికే నిత్యం సిద్ధంగా వుంటాడు

7. ఆయన సర్వవ్యాపకుడు - ఆయన నామం శాశ్వతం.

8. ఈ ప్రపంచమంతా ఆయన లీల.

9. అతడే సర్వవిభువు. ఇంతకంటె సత్యంలేదు. ఆయన వున్నాడు. అంతకంటె పరం లేదు. అతడే సర్వప్రపూర్ణుడు. అనంతుడు. సర్వశక్తిమంతుడు. సృష్టి స్థిలి లయాత్మకుడు. ఆయన సంకల్పం లేనిదే ఆకు అల్లాడదు. ఆయనపై శ్రద్ధ

వుంచు. అంతర్జ్యోతి నీకు మార్గదర్శకం. దానికి నీవు శరణు - అని జీవించు.

ఆయన మార్గాలు నీ బుద్ధి కందేవి కావు. అద్భుతాలు.

10. రక్షణ - శిక్షణ లాయనకే తెలుసు.

11. అతడు దరిద్రులకు నారాయణుడైన రక్షకుడు.

12. అంతకంటె దయామయుడు లేడు. కరుణయే ఆయన స్వరూపం.

13. అంతర్నేత్రంతోనే ఆయయను చూడగలవు.

14. ఆయనే సర్వేశ్వరుడు. ఆయన సంకల్పం లేనిదే నీవాయనను సమీపించలేవు.

## నేను – తానూ – దైవం

ఈ మూడు తత్త్వాలను గురించి గురువైన బాబా చెప్పిన మాటలు.

నేను – (మనిషి) – ఇతని కర్తవ్యం, అతనిని గుర్తించటం.

భగవంతుడు ప్రత్యక్షం కావటం – లేదా ముక్తి అంటే ఏదో ఆకాశం నుండి వర్షం పడ్డట్లుగా – ధనరాశి కురవటం కాదు. అది నిత్యమూ వుండేదే – ఉన్నదే – లేనిదానిని నీవు సృష్టించలేవు. ఉన్నదానిని తీసివేయనూ లేవు. ఏ శాస్త్రం చెప్పినా – ఉన్నదానినే చెబుతుంది తప్ప – లేని దానిని సృష్టించి చెప్పదు. ఉన్నది అంటే – దాని రహస్య స్థావరం తెలియాలి. అది స్పష్టంగా – స్పష్టాస్పష్టంగా వుంటుంది. ఈ మూడు రకాలు మనస్సులోని ఆలోచనలే. స్పష్టంగా వున్నది గురువే – అయినా అందరకు అర్థం కావటం లేదు.

బాబాను ఒక భక్తుడడిగాడట – బాబా – ఇంతమంది నీ దగ్గరకు వస్తున్నారు కదా – ఇందరు తరిస్తారా? – అని – అంటే బాబా అన్నాడట 'నానా! ఆ మామిడి చెట్టు చూడు. అంతపూత పడినది కదా – అందతా పిందెలు, కాయలుగా ఔతుందా! అందులో ఎన్ని, ఏయే దశల్లో రాలిపోయాయో కదా! పడిన కాయలన్నీ పండ్లు కావు కదా! కొద్దిగానే పండు దశ దాకా వస్తాయి. ఇది తెలిసినదే కదా – దానిననుమంతిచాడు. ఆయన శిక్షా విధానం చాలా కఠినం – అందుకనే బాబా అనేవాడు – పిల్లను తల్లి గర్భం నుండి వేరు చేయటానికి పిల్ల ప్రేగు కోయక తప్పదు – అని.

కాబట్టి మానవుడు తనను – మనస్సును శుభ్రం చేసుకుంటే – ఉన్నదక్కడే వున్నది కనుక ప్రతిబింబిస్తుంది. శుభ్రమైన నీటిలో చంద్రబింబంలాగా మురికి నీటిలో దాని ప్రతిబింబం గోచరించదు కదా. ఆ మురికిని మనో మాలిన్యాన్ని – నీవు శుభ్రం చేసుకోవాలి. శుభ్ర పదార్థంనే వండుకొంటున్నావా? నకిలి పదార్థాలనా? అలాగే మనస్సన్న పాత్రను తోముకొని బాబా దగ్గరకు వెళ్ళు. ఆ అమృతం నీ పాత్రలోకి ప్రవహిస్తుంది.

ఇదే సచ్చరిత్రకారునకు గిన్నెడు మజ్జిగ నిచ్చి ఈ అవకాశం మళ్ళీ నీకు రాదు. త్రాగమని బాబా అనుగ్రహించిన సంఘటన చెప్పి దభోల్కరన్నాడు –

'హేమద్పంతుకు గిన్నెడు మజ్జిగ నిచ్చాడే. కానీ ఆయన సచ్చరిత్ర' అన్న అమృతాన్ని భక్తులకిచ్చాడన్నాడు కదా!

## నేను – i

1. నీ కర్తవ్యాన్ని నీవు నిరహంకారంగా ఆయన చేతిలో పనిముట్టుగా నిర్వహించు.

'నిమిత్త మాత్రం భవసవ్యసాచి' న్ (గీత)

అర్జునా! నీవు నిమిత్తమాత్రుడవుగా వ్యవహరించు.

2. కర్మ ఫలాన్ని భగవదర్పణం చేయి. అపుడ నీకు కర్మ అంటదు. నీవు సర్వ జీవరాసులను ప్రేమించు. అవన్నీ భగవంతుని సృష్టే. ఎవరితోనూ వివాదపడబోకు. వాదించవద్దు. ఓపికగా వను. ఇతరులను నిందించబోకు.

3. అలసుడవు కావద్దు. నలుగురుకూ ఉపయోగించినది ఏదో ఒకటి చేయి. పవిత్ర గ్రంథాలు చదువు. ఆహార నియమం పాటించు.

4. భగవంతుడున్నాడు. ఆయన లేడనుకోవద్దు.

'అస్తీతి ఉపాసితవ్యం' – కఠం

(ఉన్నదని దానికి సన్నిహితంగా బ్రతుకు)

5. ఆయనను చేరే మార్గంలో నీవు చాలా శ్రమించాలి.

6. ఆయన దూరంగా వున్నావని ఎవరన్నారు? – నీ హృదయంలోనే ఆయన వుంటే – వ్రేలుకు గోరు దూరమేమో నీకాయన అత్యంత సన్నిహితుడు.

7. శ్రద్ధ – సబూరీలతోనే ఆయనను చేరగలవు.

8. నీకున్న దానితోనే తృప్తిపడు. కోరిక లేకపోవటమే ముక్తి.

9. దీపముంటే చీకటి ఉండదు కదా.

10. పాపం జోలికి పోకు. అది భగవంతునికీ నీకు నడుమ అంతరాన్ని

కల్పిస్తుంది.

11. మంచి పనులు చేయి. ఆయన ఆశీర్వదిస్తాడు.

12. భగవంతుడు ధర్మాత్ముల దగ్గరే వుంటాడు. ఆయన ధర్మ పక్షపాతి.

13. ఆయన అనుగ్రహపాత్రుడైనవాడు. 'మౌని' ఔతాడు. కానివాడు వాగుడుకాయ. నీ మంచితో ఆయన దయను సాధించుకో

**ii**

పాము నిన్ను కరవకముందే దాని కోరలు పీకేసెయ్యాలి.

అదెంత దూరం పోతుందో చూద్దాం.

భక్తుల నెత్తిమీద చేయి పెట్టేవాడు చాలా బాధపడవలసి వస్తుంది.

కుటుంబములో పది మంది వుంటే భేదాభిప్రాయాలూ వుంటాయి. అంత మాత్రాన కొట్లాడుకోవటం దేనికి?

(లోకం కూడా కుటుంబంలాంటిదేనని భావం)

నీ ఆలోచనలే నీకు రక్షా కవచం.

నీవు ఇతరులకు మంచి చేస్తావనుకో. అది నీ వెంటనే వస్తుంది. మంచికి మంచే – చెడుకి చెడే లాభం.

ధనం న్యాయానికి ఖర్చు చేస్తే – నిన్నదే కాపాడుతుంది.

(న్యాయార్జితం కావాలి. దానిని పదిమందికి వినియోగించాలి. ఇది నాటి మనిషి లక్షణం)

ఓర్పున్న వాడికే మంచి జరుగుతుంది.

అన్యుల ధనాన్ని ఆశించవద్దు.

(మాగృధః కస్య చిద్ధనం – ఈశమంత్రమిదే)

మనం ఇంద్రియ భోగాల కోసమే జన్మించామా! ఇంద్రియాలు భగవత్ సృష్టి.

### iii

ఇంద్రియాలకు లోబడకు. అవి నిన్ను బంధిస్తాయి. వాటిని నీవు బంధించాలి తప్ప వాటికి నీవు బంధీవి కారాదు.

గురువునంటి పెట్టుకొని బ్రతుకు. గమ్యం దాకా అతడే నీకు తోడు – ఇది శ్రద్ధాపూర్వకంగా వుండాలి తప్ప లోకరీతిగా కాదు.

లోకంలో ప్రతిదీ నశించేదే. దీనియందు అతిగా అనురక్తి పనికిరాదు. విరక్తితో అంటీ, అంటక బ్రతుకు.

ప్రతిదానినీ నవ్వుతూ స్వీకరించు. ఎందుకంటే దేనిని నీవు ఆపలేవు కనుక. మట్టి, మట్టిలో కలుస్తుంది. జీవుడెగిరిపోతాడు.

అంతా ఋణానుబంధం వల్ల ఒక చోటికి చేరుతారు. ఇది తెలిసి ఇంటికి వచ్చిన వారిని ఆదరించు. అది ఏ జీవైనా సరే. అతిథ్యమివ్వటం నేర్చుకో. ఆకలితో వస్తే అన్నం పెట్టు. దప్పికతో వస్తే నీరివ్వు. బట్టలు కావాలన్న వారికి బట్టలివ్వు. నీ యింటి వసారా నల్గురికి చోటివ్వాలి. అపుడే భగవంతుడు సంతోషిస్తాడు.

ప్రయాణీకులందరూ గమ్యం చేరరు. నీ లక్ష్యాన్ని బట్టి ఉంటుంది. అలాగే – అంతా నన్ను పొందలేరు. బయలుదేరేవారు చాలా కొద్దిమందే. వారిలోనూ అంతా నన్ను చేరలేరు. ఎవరో కొద్ది మంది మాత్రమే పొందగలరు.

నేలమీద పడ్డ ప్రతి విత్తు మొలకెత్తదు. మొలిచిన ప్రతి విత్తు చివరి దాకా ఎదగదు. ఫలించేది కొంచమే. ఈ విషయం తెలిసినదే. ఐతే ఫలించేది ఏది? గమ్యం చేరే వారెవరు? ఎలా? – అంటే ఆ దైవం సూర్యచంద్రులులాగా అంతటా వెలుగుతున్న, చీకటిలో వుండే వారికి లభించదు. నీవై – ఆ వెలుగులోకి రావాలి. ఈ ప్రయత్నం చేయలి.

ఆ ప్రయత్నమే నిన్ను నీవు పరిశుద్ధుని, పవిత్రుని చేసుకోవటం – ఈ పని నీ వంతే. దైవానుగ్రహం ఉంటుంది. కానీ నీ ప్రయత్నం నీవు చేసుకోవాలి. మహాభక్తుడైన బూటీ అల్లుడు – ఆచార్య నార్కే

పూజ్య శ్రీనరసింహస్వామీజీతో అన్నాడట–

ఒక మహాత్ముడిలాంటి వాడని ఆయన చుట్టూ చేరిన వారిని బట్టి నిర్ణయించరాదు. బాబా సన్నిదిలో వేశ్యలు, వేశ్యాలోలురు, లుబ్ధులూ – ఆశాపరులూ – అన్ని రకాల పాపాలు చేసినవారు – వుండేవారు. వారంతా భౌతిక వాంఛలతోనే వచ్చేవారని వేరే చెప్పక్కర్లేదు. వారవి పొందకపోతే వారు సన్మార్గంలో నడవటానికి బదులుగా దుర్మార్గంలో నడిచేవారు. బాబా వారి ననుభవింపచేసేవారు. ఆయన శిక్షా మార్గం చాలా తీవ్రంగా ఉండేది. ఆయన అంటూ వుండేవారు – 'నీవు ప్రసవం జరిగే వేళ తల్లి ప్రేగును కోసి పిల్లను తీయాలి కదా' – అని.

ఇది నిత్య సత్యం. ఎంత కృష్ణుడైనా – ఎంత సన్నిహితుడైనా – అంతా తరించలేరు. కౌరవులేమైనారు. విశ్వరూపం చూచి కూడా – వ్యామోహపాశం త్రెంచుకోలేక సర్వనాశనమైనారు. ఇది నిత్య మానవ స్వభావం. కనుకనే బాబా పై రీతిగా మనలను గురించి అంతగా చెప్పవలసి వచ్చినది. అయనను సేవించటమంటే – నిన్ను నీవు క్షాళించుకోవటమే.

❀ ❀ ❀

# భరత వాక్యం

అంటే నాటకమై పోయినాక - నటీనటులు - తమతమ పాత్రలు విడిచి- లోకంలోకి వ్యక్తులైనాక - లోక సంరక్షణార్థం చేసే ముగింపు ప్రార్థన.

ఈ గ్రంథకర్త కూడా - ఆ పాత్రను వదిలి (బాబా ధరింప చేసినది) - తాను తానుగా మిగిలి - (వ్యక్తిగా) వ్రాసినదాని సారాంశం చెప్పటం - భరతవాక్యం.

ముందు పుటల్లో చెప్పినది సంగ్రహంగా - ఇది.

నేటి యుగావతారారంభం శ్రీరామకృష్ణులతో జరిగినది. అక్కడ నుండి బయలుదేరిన భాగీరథి - అనేక ఘట్టాలు - తీర్థాలు - సృష్టించి - మనవతరణార్థం - ప్రవహిస్తూనే వుంది. - అవే స్వామీజీ (వివేకానంద) - బాబా - శ్రీఅరవిందమహాయోగి - భగవాన్ రమణులు - ఇత్యాదులు. వీరంతా మానవతావాద దృష్టితో పరతత్త్వాన్ని సామాన్య మానవులదాకా - గడపల్లోకి తీసుకొని వచ్చిన మహాత్ములు. స్వామీజీ ప్రతిన ఏమంటే - 'నా ఉద్యమం హరిజనుల గడపల దాకా ఉపనిషత్తును తీసుకొని పోయేటంత వరకాగదని - ఇదే బాబా వంటివారు చేసిన పని. నిర్వహించిన అవతార కార్యం.

చాలామంది అడగటమో, చెప్పటమో చూస్తూ వుంటాం - బాబా ఇంతగా వ్యాప్తి చెందటానికి కారణమేమిటి? - అని. తెల్లవారుజామున లేచి పొలంలోకి పనికిపోయే కార్మిక, కర్షకాదులకు - జపతపాది ధర్మాలు కుదరవు కద! వారి గతి ఏమిటి? - వేలకు వేలు ఖర్చు పెట్టి తీర్థయాత్రలు చేయలేనివారు ప్రస్థాన త్రయమంటే కనీసం వినని వారు - ఊరిలోనికి రాలేనివారు - స్త్రీలు. అహర్నిశలు వంటిల్లే కైలాసంగా బ్రతికేవారు. ఇలాంటి వారంతా మతబాహ్యులు. దళితులు. ఏది మతమో వేల సంవత్సరాల నుండి చూస్తున్నాం.

మడీ, మైలా, మంత్రం, తంత్రం, పాండిత్య చర్చలు - ఇవేమీ తెలియకుండా దూరాన బ్రతికేవారు. ధనవంతులైనా, పేదలైనా - వీరి సంగతి ఏమిటి? వారి కోసమే వీరంతా వచ్చినది. మరీ బాబా దగ్గర వీరూ, వారూ లేదు అంతా

జగన్నాథమే. అంటూ లేదు, సొంటూ లేదు. బ్రహ్మసూత్రాలు.

బ్రహ్మమెలా వుంటాడు? – ఇలా వుంటాడని చెప్పడానికి వచ్చిన మరో అవతారం బాబా.

స్వామీజీ కన్యాకుమారి దగ్గర సముద్రంలో గుట్టపైన మూడు రోజులు చేసిన ధ్యాన తాత్పర్యమేమిటి? స్వామి రంగనాథానంద (1950–ప్రాంతం కావచ్చు) మాస్కో విశ్వవిద్యాలయంలో – 'మానవతావాదం – స్వామి వివేకానంద' – అన్న అంశం మీద 45 నిమిషాలు ప్రసంగించిన విషయం – 10 రూ॥ల చిన్న పొత్తముగా వచ్చినది. అందులో వారన్న మాటలు 'స్వామీజీ తన ముక్తి కోసం తపస్సు చేయలేదు. అశేష దరిద్రనారాయణుల సముద్ధరణార్థం మూడు రోజులు ధ్యానం చేసారు. పాశ్చాత్య మానవతా వాదం చివరకు ముర్ఖు సిద్ధాంతం కూడా సత్ఫలితాలనివ్వలేదని – వివరించి – స్వామీజీ ఆధ్యాత్మిక మానవతా వాదాన్ని చెప్పి, అదే తరణోపాయమని – వివరించి' ముగించాడు. సాధారణ మానవుడు మన వేదాంత బ్రాహ్మణమతంలో లేదు. కనుకనే శ్రీవైష్ణవాదులు భక్తి ఉద్యమం తెచ్చి – కడజాతి వారి నుండి మహాభక్తులను సృష్టించినది. మహారాష్ట్రంలో సంత పంథాలో, తమిళనాడులో శైవవైష్ణవంలో, కర్ణాటక శైవంలో – ఎంతమంది మహాభక్తులుగా కడజాతీయులు ఉన్నత శిఖరాలకెగసి పోయారో తెలిసిన విషయమే.

ఒకసారి ఈ గ్రంథకర్త ఇంటికొక సనాతనాచారపరాయణుడు వచ్చి వాకిట్లో వున్న కుక్కను కట్టివేయమంటే గృహస్థు అన్నాడు – అది కరవని సాధు జంతువు భయం లేదు రండి అంటే అతిథి అయిన బ్రాహ్మణుడన్నాడు – 'నేను తాకరాదండీ' – అని. 'శునిచైవ శ్వపాకేచ' అన్న గీతాస్వామి ఆరాధిస్తున్న దేశమేమిటి? దానిని చెప్పి ధన, కీర్తులను పొందుతున్నాం కదా. ఇదేమి అని అనిపించింది. విశ్వాసం కల జంతువును బంధించటం. ఇది ఈ దేశంలో మతం, అదీ ఒకే వర్గానికీ – పండితునికీ కట్టుబడి పోయినది. అందరను కౌగిలించుకోలేకపోయినది. 'నేను కుక్కగానూ వస్తాను – పందిగానూ వస్తానన్న బాబా దైవమేమిటి?' అవి నీచ జంతువులు కదా. కానీ కాలభైరవోపాసనలు – వరాహావతార కథనాలూ, పురాణాలూ

వచ్చాయి.

మసీదు – మాంసం, పలావు వండేవాడు దైవమేమిటో నాటి నుండి అనేవారులేరా? కానీ, బ్రహ్మ పదార్థానికి ఉచ్చనీచాలు లేవు. విధి నిషేధాలు లేవు. ఇవన్నీ సంఘం కట్టుబాట్లు, మానవ నిర్మిత మణిసౌధాలు. బాబా దరిద్రనారాయణుడు. పాతపడిన మసీదు నివాసం. కుక్కలు వచ్చి జోలిలోనివి ముట్టుకొన్నా అసహ్యించుకోనివాడు. వర్గ, మత, స్త్రీ – పురుష విభేదం లేనివాడు. పాటించని వాడు. మహాత్ర్వాత్యుడుగా వేదంలో స్తుతింపబడిన ఆదిమ తత్త్వ స్వరూపుడు – కనుకనే పేద, సాదల కోసం అవతరించిన పండరినాథుడని ఆనాటి భక్తులన్నారు. ఇదే ఆయన జగద్వ్యాప్తిలోకి రహస్యం ఇదొక కారణం.

తాత్త్వికముగా బ్రాహ్మణ మతంలో దైవం తటస్థ బ్రహ్మం. నిర్గుణాది నామాలు పెట్టబడినవాడు. బాబా నిర్గుణ – సగుణ తత్త్వ స్వరూపునిగా చెప్పుకొన్నాడు. తటస్థంగా వున్నాడు. మనలో ఒకడుగానూ వున్నాడు. ఇదే ఎక్కువపాళ్ళు. శిరిడీ వాస్తవ్యులంతా – ఆయన దగ్గరకు వచ్చిన వారంతా అమాయకులైన బృందావన నివాసులు. వారికీ గోల దేనికి? తమ కడుపు నిండాలి. మనస్సు నిండేటట్లు చెప్పాలి – ముక్తి గోల ఏమిటో తెలియని వారికి బాబా చెప్పవలసి వచ్చినది.

గుడులూ, తీర్థాలూ, క్షేత్రాలకూ పోనక్కరలేదు. మడీ, పూజా లేదు. జపతపాదులు లేవు. అడవికి పోనక్కరలేదు. సంసార త్యాగం లేదు. ఏవేవి బ్రాహ్మణమతం చెప్పిందో అవేమీ లేవు – అనే సరికి. మనిషికెంత వెసులుబాటు చిక్కినది. నీవంటరాని వాడివి అంటే వాడెంత తనలో తను క్రుంగదీసుకొని పోతాడు. అలాకాక రారా – నేనూ నీవూ ఒకటే ననేసరికి వీడికెంత మనోవికాసం – ధైర్యం చిక్కుతవి – ఇది బాబా మార్గం.

సగుణ బ్రహ్మ అన్న తానే. ఏదీ త్యాజ్యం కాదు. నీ జీవితం – నీ యిష్టం– కానీ నీ మనస్సు నాకివ్వు – ఇదే బాబా చెప్పినది. ఆ బృందావనవాసులకా కృష్ణుడు దైవమో ఎవరో తెలియదు – ఏ నారదుడో, ఇంద్రుడో వస్తే కానీ, ఆయనసలెవ్వరో తెలియనట్లు – ఈ నేటి బృందావనవాసి ఫకీరెవ్వడో తెలియకనే ఆయనతో కలసి,

మెలసి; ఆడీ – పాడీ; నీవెంత అని కసిరి కౌగిలించుకొన్నారో – బాబా చరిత్రలు సాక్ష్యం చెబుతున్నవి.

ఏ నానా చందోర్కరుతోనో అద్వైతం చెప్పినా అందరికీ ఆయన తమ వాడేనని తెలిసిన సత్యం. ఏ మాయావాదమూ లేదు. ఇంద్రియదమనం లేదు. నీ ఇంద్రియాలతో సృష్టిననుభవించు. కానీ ఆ సృష్టి అందమంతా భగవదైశ్వర్యంగా భావించు. ఆ దృష్టితో చూస్తున్నట్లు చూసి అనుభవించు.

స్త్రీని చూస్తే భగవంతుడెంత మహాశిల్పి ఈ అజంతా అప్సరసను – ఈ దేవతా సౌందర్యం బొమ్మగా మలిచాడో – ఓహో! ఈ ప్రకృతి ఋతుక్రమంగా ఎన్ని భూమికలు ధరిస్తున్నదీ, – ఎన్ని అందాలు రంగవల్లులుగా రచిస్తున్నదీ? – ఈ సంధ్యలూ, చీకట్లు, వెన్నలా, చెట్టు, పుట్టా – జంతువులూ అన్నీ కలసి పిల్లలాడు కొన్నట్లు – క్రీడగా, క్రీడారంగంగా భగవంతుడనుగ్రహించాడు – అని భావిస్తూ జీవితాన్ని, ప్రేక్షకునిగా అనుభవించు చాలు. అంతకంటే తపస్సు లేదు. ధ్యానం లేదు. నీవు అన్నం తిన్నా, నిద్రపోయినా, ఏమి చేసినా, ఏకాగ్ర మనస్కతతో చేయి. అన్నం తింటున్నపుడు బాబా 'నాకీ పూట ఈ అన్నం పెట్టాడనుకొంటూ – ఆయనను స్మరిస్తూ, ఆస్వాదించు. నేను స్థానంలో బాబాను పెట్టుకో చాలు. ఇదీ బాబా బోధ. సాధన. నిద్రిస్తూ బాబానే స్మరించు. ఏదీ వదలనక్కరలేదు. సర్వం ఈశ్వరాధీనంగా జరుగుతుందనుకో. పాములను చంపాలా? అక్కర్లేదా అన్న మీమాంస వస్తే బాబా చెప్పాడట. ఏదీ ఈశ్వరాజ్ఞ లేనిదే జరగదని విశ్వసించు అన్నాడే తప్ప చంపు అని కానీ చంపవద్దని కానీ అనలేదు.

ఏదీ ఋణానుబంధం లేనిదే నీ దగ్గరకు రాదు. వచ్చిన ప్రతి జీవి భగవంతుడే, బాబాయే అని ఆరాధనా భావంతో ఆరాధించు. దేనిని కసరు కోవద్దు – అనటంలో ఎంత కారుణ్యం, ఎంత జీవప్రేమ – మానవతా భావన ఉన్నదీ' – స్పష్టంగానే తెలుస్తున్నది.

(ఒకసారి రమణులు కొండపైకి వెళ్తున్నారు. ఒక కర్మజీవి కట్టెలు కొట్టుకుంటూ – ఆపి, తలగుడ్డ నడుముకు చుట్టుకొని వంగి నమస్కరించాడట. ఆ

భగవంతుడన్నాడట 'అక్కర్లేదు. నీ పనిని ఏకాగ్రంగా నిర్వహించుకో – చాలు' అని.)

ఇదే బాబా మార్గం. నీ విధిని నీవు నిర్వహించు. నేను చేస్తున్నానకోవద్దు. ఈశ్వరారాధాన మనస్కుడవై మసలుకో – అన్నదే ఆయన చెప్పిన మంత్రం. వేరే మంత్రం లేదు, జపం లేదు. ఇదే మంత్రం. చెవి కొరికే సంప్రదాయం మాకు లేదన్న మాటతో – ఎంత సమతావాదం పుష్పించినదో ఆలోచించాలి. ఒకసారి స్వామి వివేకానందకొక శిష్యుడిలాగే నాకేదైనా మంత్రం చెప్పండి' – అంటే ఆ పరమశివుడన్నాడట – 'మనిషిని ఆరాధించు, ఆదరించు' చాలు అని ఊర్ధ్వలోక దైవ దృష్టిని, అథోలోక మర్త్యలోకం వైపునకు మళ్ళించాడాయన – అంటే దరిద్రనారాయణోపాసనగా చెప్పాడు. మతంలో బ్రహ్మమూ – మాయా వంటి గ్రంథ విషయాలున్నాయి. ఆ స్థానంలో నేటి యుగ ఋషులు జీవిని – మనిషిని పెట్టారు.

బాబాకు వారసులు లేరు. రమణులకు, శ్రీ అరవిందులకూ లేరు. భగవంతునకు వారసుడు ప్రతి మనిషీ – అయినపుడు నడుమ పూజారి, పురోహితుడెందుకు? నానావలి బాబా గద్దెపై కాసేపు కూర్చొని లేచిపోయిన ఘట్టం తాత్పర్యమేమిటి? తనకు వారసులెవరూ లేరు.

బాబాకు వారసుడు లేడు. ఉపాసనీకి ఇద్దామనుకున్నాడే కానీ అది జరుగలేదు. అందుకే బాబా నేటికీ మన దగ్గరకు తానే వస్తున్నాడు. దక్షిణ అడిగినా – మహిమలు ప్రకటించినా, నిన్ను లోకోన్ముఖ జాంతవ మనస్సును, తన వైపునకు ఆత్మవైపున కాకర్షించటం కోసమే తప్ప బాబాకు నీపైకమెందుకు? నీ కర్మ క్షాళనార్థం ఆ రూపాయి దక్షిణగా తీసుకొన్నాడు తప్ప – తనకు గుడులెందుకు? లోకాన్ని వైకుంఠం చేయాలన్న తండ్రి కోరిక తప్ప – నిన్నుద్ధరించాలన్న ఆలోచన తప్ప – బాబా సర్వాత్మ కనక మన మధ్యకు తానై వస్తున్నాడు. నీవు ఆయనెక్కడున్నాడోనని అడవుల్లో గుహల్లో అన్వేషించనక్కర్లేదు. తానై – తనకు తానుగా నీ దగ్గరకు వస్తున్నాడు. గుర్తించు. దేవ్‌గారి ఉద్యాపన వ్రతంలా బెంగాలీ సన్యాసిగా వచ్చినట్లు

– దభోల్కరు ఇంటికి చిత్రపట రూపంగా వచ్చినట్లు, మరొకరికి అనేక దైవాలుగా, మనుష్యులుగా, బిచ్చగాళ్ళగా వస్తాడు. గుర్తించు.

బాబా మన దగ్గరకు వస్తున్నాడు. ఏ రూపంలో ఎవరు వచ్చినా బాబాగానే ఆదరించటం నీవంతు. అదే ఆయనకు నీవిచ్చే బిల్వపత్రం – తులసీదళం.

ఆ తండ్రి మనలను కాపాడాలి అనీ అనుకోవటం దేనికి? – కాపాడుతుంటే అని అనుకోవాలి.

ఇంతే.

సర్వమున్నతని దివ్య కళామయమంచు' –

తదేక దృష్టితో జీవించటమొక్కటే మన కర్తవ్యం.

క్షరపురుషుడు (ప్రతిజీవి)

అక్షరపురుషుడు (అంతరాత్మ)

పురుషోత్తముడు (నారాయణుడు) – ఆయనే.

ఆనందాదీపం వెలుగులో మన యిల్లు చక్కబెట్టుకొందాం.

❀ ❀ ❀

